బుధవారం
18•3•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 263
• పేజీలు : 12 + 12 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD






Goodlife & Accessories are optional & extra charges applicable | Offer valid till 20th March 2020 & Subject to BS4 stock availability.*

Authorised Dealers - Karimnagar: Bharadwaj Hero, Ph: 7799766341. Devesh Hero, Ph: 7799766346.
Ramagundam: Siddi Shri Vinayaka Hero, Ph: 9817009247.
Mancherial: Balaji Hero, Ph: 7799766326. Adilabad: Chandra Hero, Ph: 7799766397.

Authorised Service Centres - Jagityal: Ravi Teja Motors, Ph: 98666 24312, 96039 67071. Siddipet: Master Motors, Ph: 99088 02229, 96521 12282. Sircilla: Arif Motors, Ph: 91337 86757. Metpalli: Harihar Enterprises, Ph: 9441873338, 8523803388. Korutla: Shri Rama Motors, Ph: 08725-254666, 99899 07676. Peddapalli: Shri Sai Maruti Motors, Ph: 98662 06602, 95020 73443. Nirmal: Sai Chandra Motors, Ph: 08734-242984 / 85209 12777. Kaghaznagar: Manish Motors, Ph: 9848849975. Bellampalli: R.K. Enterprises, Ph: 9849 302384.

Authorised Representative Dealers: Bhainsa: Tirumala Enterprises, Ph: 9440349120. Utnoor: Shri Chandra Motors, Ph: 9959876486. Ichoda: Ichoda Motors, Ph: 9440757883. Asifabad: Shivani Motors, Ph: 9440010306. Bodh: Mahalakshmi Motors, Ph: 9440037842. Manda: Manda Motors, Ph: 9701494879. Mandamarri: Jagadamba Motors, Ph: 9440922683. Tandur: Shri Vigneshwara Motors, Ph: 9440443676. Chennur: Karthikeya Motors, Ph: 9985589955. Lakshettipet: Shri Srinivasa Motors, Ph: 9246234143. Banswada: Shri Srinivasa Motors, Ph: 9705675700. Yellareddy: Shiva Sai Motors, Ph: 9440288498. Ramayampet: Shiva Motors, Ph: 9912475028. Dharpalli: Venkateshwara Motors, Ph: 9493244488. Lingampeta: Vigneshwar Motors, Ph: 9553465555. Dichpally: Narasimha Motors, Ph: 9966550026. Machareddy: Balaji Motors, Ph: 9494624242. Bikaner: Ganesh Motors, Ph: 9441134175. Choppadandi: Shri Sai Motors, Ph: 9848793898. Huzurabad: Rahul Motors, Ph: 9849169794. Sultanabad: Shri Sai Surya Motors, Ph: 9849473568. Jammikunta: Pavan Motors, Ph: 9246826995. Humnabad: Sahiti Motors, Ph: 9866260441. Yellareddypet: United Motors, Ph: 9951406077. Vemulawada: Siri Motors, Ph: 9000857772. Bejjanki: Narmada Motors, Ph: 9440825483. Mulkanoor: Sampath Motors, Ph: 7032826995. Manthani: Shivasankar Automobiles, Ph: 8074655686. Rayekal: Harika Motors, Ph: 9000188393. Gollapalli: Shri Amrutha Motor, Ph: 9989151651. Dharmaram: Shri Dhanya Motors, Ph: 9642020222. Dharmapuri: R R Motors, Ph: 9849004221. Armoor: Venkateshwara Motors, Ph: 9848522331. Bichkunda: Shri Lakshmi Motors, Ph: 9491740244. Bhingal: Shri Lakshmi Narasimha Motors, Ph: 9848258736. Kamarapalli: Harihara Motors, Ph: 9948555525. Nandipet: Shri Lakshmi Motors, Ph: 9963149399. Huzurabad: Rahul Motors, Ph: 9849169794. Jammikunta: Pavan Motors, Ph: 9246826995. Gangadhar: R K Motors, Ph: 9394551432.

epaper.ntnews.com

• ఆకుపచ్చ చీరలో అందాల అవని



అందాల అదితి.. ఎటుచూసినా పచ్చని పంటలతో కళకళలాడుతున్న మేదిని.. పచ్చనిచీరెకట్టి సింగారించుకున్న పుడమి.. ఒకప్పుడు యాసంగి పంట గగనమైన ప్రాంతం.. నేడు యాసంగిలో కూడా గజం జాగ ఖాళీ లేకుండా వరిపంట సాగైన సందర్భం.. వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామంలో ఆవిష్కృతమైన దృశ్యం.

# రాములోరి కల్యాణానికి రావద్దు!

## కరోనా కారణంతో ఆలయంలోనే నిరాడంబరంగా నవమి వేడుకలు

### రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

**ఖమ్మం/భద్రాచలం, నమస్తే తెలంగాణ:** భద్రాచలంలో ప్రతిఏడాది వైభవంగా నిర్వహించే సీతారాముల కల్యాణం కరోనా వైరస్ కారణంగా ఈసారి నిరాడంబరంగా జరుగనున్నదని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చెప్పారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా శ్రీరామనవమి వేడుకను ఆలయ ప్రాంగణంలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. ఏప్రిల్ రెండున సీతారాముల కల్యాణం భక్తులు లేకుండానే జరుగుతుందని పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మంలోని వీడీవోస్ కాలనీలో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో మంత్రి పువ్వాడ మీడియాతో మాట్లాడుతూ.. కరోనా వైరస్ ఎఫెక్ట్‌తో మిథిలా ప్రాంగణంలో తలపెట్టిన సీతారాముల కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం వేడుకలను ఆలయ ప్రాంగణంలోని బేడా మండపంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



రామాలయాన్ని కట్టించిన భక్తరామదాసు కాలంలో నవమి వేడుకలు ఇక్కడే జరిగేవని గుర్తుచేశారు.



ఖమ్మంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

### ఆన్‌లైన్‌లో విక్రయించిన కల్యాణ టిక్కెట్ల సొమ్ము భక్తులకు వాపసు

ఆన్‌లైన్‌లో విక్రయించిన రాములోరి కల్యాణ టికెట్ల సొమ్మును భక్తులకు వాపస్ ఇవ్వనున్నట్టు దేవస్థానం ఈవో జీ నరసింహులు తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో 1003 టిక్కెట్లు విక్రయించామని, తద్వారా సుమారు రూ.13.80 లక్షల ఆదాయం వచ్చిందని, మిథిలా ప్రాంగణం వేదిక మారిన నేపథ్యంలో టిక్కెట్ల సొమ్మును తిరిగి భక్తులకు ఇస్తామని తెలిపారు. త్వరలోనే వైదిక కమిటీతో సమావేశమై ఆలయ ప్రాంగణంలో నిర్వహించే నవమి వేడుకలపై సమాలోచనలు జరుపుతామని పేర్కొన్నారు.

# వేరుశనగ పరిశోధనకు 50 కోట్లు

## మంజూరు కోసం కేంద్రానికి మంత్రి నిరంజన్‌రెడ్డి లేఖ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో వేరుశనగ పరిశోధనాకేంద్రం ఏర్పాటుకు రూ.50 కోట్లు మంజూరుచేయాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు ఆయన లేఖ రాశారు. తెగుళ్లను మరింతగా తట్టుకొని నిలబడే నాణ్యమైన విత్తనాల ఉత్పత్తికి, ఎగుమతికి అవకాశముండే వేరుశనగ పండించడానికి వనపర్తిలో పరిశోధనాకేంద్రం ఏర్పాటుచేయాలని నిర్ణయించామని, రాష్ట్ర ప్రభుత్వం స్థలాన్ని కూడా కేటాయించిందని తెలిపారు. విత్తన పరిశోధన కేంద్రం ఏర్పాటు, అవసరమైన సదుపాయాలు, ల్యాబ్, నూతన భవనం కోసం పెట్టుబడి నిధులు విడుదలచేయాలని కోరారు. ప్రాజెక్టుల నిర్మాణంతో సాగునీరు పుష్కలంగా అందుబాటులోకి రావడంతో తెలంగాణ వ్యవసాయ స్వరూపం పూర్తిగా మారిపోయిందని తెలిపారు. ప్రపంచంలోనే ఆఫ్లాటాక్సిన్ (విషపూరిత క్యాన్సర్‌కారక పదార్థాలు) లేని వేరుశనగ పంటకు పాలమూరు జిల్లా ప్రసిద్ధి చెందిందని పేర్కొన్నారు. ఆఫ్లాటాక్సిన్ లేని వేరుశనగకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉన్నదని తెలిపారు. దీనినుంచి ఉత్పత్తిచేసే పీనట్ బట్టర్‌కు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఎక్కువని పేర్కొన్నారు. దేశంలోనే అత్యధికంగా వేరుశనగ దిగుబడి వనపర్తి, నాగర్‌కర్నూలు, జోగుళాంబ గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి వస్తున్నదని వెల్లడించారు.

# ప్రధాని మోదీనే దేశద్రోహి

- సెక్యులరిజానికి బ్రాండ్ అంబాసిడర్ కేసీఆర్
- బండి సంజయ్ వ్యాఖ్యలపై మండలి విప్ కర్నె ప్రభాకర్ ఫైర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీఏఏ పేరిట ప్రజల మధ్య విభేదాల చిచ్చురేపుతున్న ప్రధాని నరేంద్రమోదీయే దేశద్రోహిగా మిగులుతారని మండలి విప్ కర్నె ప్రభాకర్ అన్నారు. సీఎం కేసీఆర్ సెక్యులరిజానికి బ్రాండ్ అంబాసిడర్ అని, ఆయనను విమర్శించేస్థాయి మతతత్వ బీజేపీకి లేదని మండిపడ్డారు. మంగళవారం టీఆర్‌ఎస్‌ఎల్పీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దేశద్రోహి అంటూ సంజయ్‌చేసిన వ్యాఖ్యలపై ధ్వజమెత్తారు. ప్రజలందరూ కులమత బేధాలు లేకుండా కలిసి ఉంటున్నారని, వారి మధ్య చిచ్చుపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదని, అవసరమైతే దేశవ్యాప్త ఉద్యమానికి కేసీఆర్ నాయకత్వం వహిస్తారని చెప్పారు. సంజయ్ అవగాహన లేని వ్యాఖ్యలుచేసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న రెండ్రోజుల్లో ప్రజల్లో చులకనయ్యారని పేర్కొన్నారు. ఆయన నోరు మూసుకుంటే మంచిదని హితవుపలికారు.

# మూడు తప్పుడు ప్రశ్నలకు మార్కులు

## ఇంటర్‌బోర్డు కార్యదర్శి వెల్లడి.. ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇంటర్ ఫస్టియర్ ప్రశ్నపత్రాల్లో తప్పుగా వచ్చిన ప్రశ్నలకు మార్కులు ఇస్తామని ఇంటర్‌బోర్డు కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన ప్రథమసంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్‌లో కలిపి మూడు ప్రశ్నలు తప్పుగా వచ్చాయని, వాటికి మార్కులు వేస్తామని.. విద్యార్థులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

### నేడు ద్వితీయ సంవత్సరం చివరి పరీక్ష

రాష్ట్రంలో ఈ నెల నాలుగో తేదీన మొదలైన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు మంగళవారం ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా చివరిరోజు ప్రథమ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షల కోసం 5,03,429 మంది నమోదుచేసుకోగా.. 4,78,987 (95.15 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు. 24,442 మంది పరీక్షలకు హాజరు కాలేదని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఒమర్ జలీల్ తెలిపారు. బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు కూడా పూర్తికానున్నాయి. ఒకేషనల్ పరీక్షలు మాత్రం ఈ నెల 23 వరకు కొనసాగుతాయి.

## లోకం పోకడ




ఫేక్‌న్యూస్ ఫార్వార్డ్ చేసే మాయదారి జబ్బు సోకింది.. మంచి ట్రీట్‌మెంట్ ఇవ్వాలి!

## ముహూర్తం

సూర్యోదయం: 6.21 గంటలకు

సూర్యాస్తమయం: 6.21 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం దశమి గురువారం తె.జా. 4.27 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: పూర్వాషాఢ మధ్యాహ్నం 1.01 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, అమృతఘడియలు: ఉదయం 7.59 నుంచి 9.39 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.21 నుంచి 1.50 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.57 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు, వర్జ్యం: రాత్రి 9.38 నుంచి 11.21 వరకు.

# రేపటి నుంచి పది పరీక్షలు

- గంట ముందే పరీక్ష కేంద్రాలకు
- హాజరుకానున్న 5.34 లక్షల మంది
- 2,350 పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు
- దగ్గు, జలుబు ఉన్నవారికి ప్రత్యేక గదిలో పరీక్షలు
- అన్ని కేంద్రాలలో శానిటైజర్లు
- సమీక్షలో మంత్రి సబితాఇంద్రారెడ్డి

• ఆల్ ది బెస్ట్



పదో తరగతి పరీక్షల నిర్వహణపై మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి . చిత్రంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రారామచంద్రన్ తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి ఏప్రిల్ 6 వరకు నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో హాజరుకావాలని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి సూచించారు. ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. పదోతరగతి పరీక్షల నిర్వహణపై మంగళవారం విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పదోతరగతి పరీక్షలకు రాష్ట్రంలో 5,34,903 మంది విద్యార్థులు హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. వీరిలో బాలురు 2,73,971, బాలికలు 2,60,932 మంది ఉన్నారని చెప్పారు. పరీక్షలకు 5,09,079 రెగ్యులర్, 25,824 ప్రైవేటు విద్యార్థులు హాజరవుతున్నారని చెప్పారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,530 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. పది పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి ప్రారంభమవుతాయని, 8.30 గంటలకే పరీక్షకేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు హాల్‌టికెట్లను www.bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, ఇప్పటివరకు దాదాపు 4.5 లక్షల మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని వివరించారు. ఎండతీవ్రత దృష్ట్యా పరీక్షకేంద్రాల్లో ఇద్దరు చొప్పున వైద్యసిబ్బందిని, అవసరమైన ఔషధాలను, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుతున్నట్టు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులు పరిష్కరించడానికి ప్రభుత్వ పరీక్షల కార్యాలయం, డీఈవో కార్యాలయాల్లో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్‌రూం (040-23230942) ఏర్పాటుచేసినట్టు చెప్పారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన విద్యార్థులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. పరీక్ష వేళకు చేరుకొనేలా సకాలంలో బస్సులను నడుపాలని ఆర్టీసీ అధికారులను, కరంట్ కోతలు విధించవద్దని విద్యుత్ శాఖాధికారులను కోరినట్టు పేర్కొన్నారు

### ప్రత్యేక గదిలో పరీక్షలు

కరోనావైరస్ వ్యాప్తి నేపథ్యంలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు దగ్గు, జలుబు ఉన్నట్టయితే ప్రత్యేక గదులు ఏర్పాటుచేస్తున్నట్టు సబిత తెలిపారు. విద్యార్థుల కోసం ప్రతి పరీక్ష కేంద్రంలో శానిటైజర్లు, లిక్విడ్ సబ్బులను అందుబాటులో ఉంచుతామన్నారు. విద్యార్థులు మాస్కులు ధరించినా, వాటర్‌బాటిళ్లు తీసుకొచ్చినా అనుమతిస్తామని చెప్పారు. ఇన్విజిలేటర్లను రిజర్వులో ఉంచుతామని, ఎవరైనా అనారోగ్యానికి గురైతే మరొకరిని నియమిస్తామన్నారు. పరీక్షకేంద్రాల్లో గుంపులుగా ఉండకుండా ప్రతిరోజు ఉదయం 8.30 నుంచే లోపలికి అనుమతిస్తామని చెప్పారు. సమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రారామచంద్రన్, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఏ సత్యనారాయణరెడ్డి, అదనపు డైరెక్టర్ రమణకుమార్, శ్రీహరి పాల్గొన్నారు.

### డియర్ స్టూడెంట్స్

- ఆల్ ది బెస్ట్ చెప్పుకొనేందుకు కరచాలనం చేయొద్దు.
- పరీక్ష కేంద్రాలకు తల్లిదండ్రుల వాహనాలపై వెళ్లడం ఉత్తమం.
- జనసమ్మర్ధ ప్రదేశాల్లో వేచి చూడాల్సి వచ్చినప్పుడు నోటికి చేతిరుమాలు లేదా మాస్కు కట్టుకోవాలి.
- ఒకవేళ టిష్యూను వాడితే.. తర్వాత చెత్తబుట్టలో పడేయాలి.
- ఎట్టి పరిస్థితిలోనూ పరీక్ష కేంద్రం వద్ద గుంపులుగా ఉండొద్దు.
- ఏవైనా అంశాలపై బృంద చర్చలకు దూరంగా ఉండండి.
- తప్పనిపరిస్థితిలో పాల్గొనాల్సి వస్తే మాస్కులు ధరించాలి
- మిగతావారికి రెండుమీటర్ల దూరం ఉండేలా జాగ్రత్తపడండి.
- ఒత్తిడిలో చేతులతో తరచూ ముఖాన్ని రాసుకోవడం చేయొద్దు.
- చేతులు శుభ్రం చేసుకోకుండా ఆహార పదార్థాలు తీసుకోవద్దు.

# వంతెన కింద శవం

- గుర్తుతెలియని మహిళ దారుణహత్య
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు
- లైంగికదాడి జరుగలేదని ప్రాథమిక అంచనా
- చేవెళ్లలోని తంగడిపల్లి వంతెన వద్ద ఘటన



చేవెళ్ల మండలం తంగడిపల్లి వంతెన సమీపంలో వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

**చేవెళ్ల:** గుర్తుతెలియని వివాహిత దారుణ హత్యకు గురైంది. మృతురాలి ఆనవాళ్లు తెలియకుండా ఉండేందుకు ఆమె ముఖాన్ని బండరాయితో మోదినట్టు పోలీసులు గుర్తించారు. సదరు మహిళను ఎక్కడో చంపి ఇక్కడ తీసుకొచ్చి పడేశారని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని తంగడిపల్లి వంతెన కింది భాగంలో 30-35 ఏండ్ల వివాహిత దారుణహత్యకు గురయింది. నగ్నంగా ఉన్న మృతదేహంపై నగలు ఉన్నాయి. ముఖం ఆనవాళ్లు గుర్తుపట్టకుండా ఉండేందుకు బండరాయితో మోదడంతో.. వంతెన గోడలకు రక్తం చుక్కలు చిందాయి. వంతెన పైభాగంలో తాడు దొరుకడంతో మహిళను చంపి తీసుకొచ్చి వంతెన కిందకు దానితో దింపినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. తెల్లవారుజామున 2-3 గంటల మధ్య హత్య జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. ఉదయం బహిర్భూమికి వెళ్లిన స్థానిక యువకుడు మహిళ మృతదేహాన్ని చూసి గ్రామస్థుల ద్వారా పోలీసులకు సమాచారం అందించాడు. డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, చేవెళ్ల ఏసీపీ రవీందర్ రెడ్డి, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్యాం బాబు, ఎస్వోటీ అదనపు డీసీపీ సందీప్ కుమార్ ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి గ్రామస్థులను వివరాలు అడిగి తెలుసుకొన్నారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంలు వివరాలు సేకరించాయి. లైంగికదాడి జరుగలేదని, వివాహేతర సంబంధం హత్యకు కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

### మహారాష్ట్ర లేక రాజస్థాన్?

మృతదేహంపై కనిపించిన గుర్తులు సాధారణంగా మహారాష్ట్ర, రాజస్థాన్‌కు చెందిన మహిళల శరీరంపైనే కనిపిస్తాయని పోలీసులు చెప్తున్నారు. ఆమె గాజులు, చైన్, ఉంగరాన్ని బట్టి మృతురాలు ఆయా రాష్ట్రాలకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. పోస్ట్‌మార్టం నివేదికలో మరిన్ని విషయాలు వెలుగులోకి రానున్నాయి. తంగడిపల్లి మీదుగా వచ్చిపోయే మార్గాల్లోని సీసీటీవీ ఫుటేజీని పోలీసులు సేకరిస్తున్నారు. తంగడిపల్లి పరిసరాల్లో సోమ, మంగళవారాల్లో కొత్త వ్యక్తుల మొబైల్ ఫోన్లకు అందిన సిగ్నల్స్‌ను ట్రాక్ చేసేపనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి వలస వచ్చి హైదరాబాద్ శివారులో నివసిస్తూ ఉండొచ్చని, ఒంటిపై దుస్తులు తొలిగించడం ద్వారా దృష్టి మరల్చే ప్రయత్నం చేశారని పోలీసులు భావిస్తున్నారు. మహిళను ఎక్కడ చంపారు? వేరే ప్రాంతంలో చంపి తీసుకొచ్చి పడేశారా? ఎందుకు చంపాల్సి వచ్చింది? హత్యకు వివాహేతర సంబంధమే కారణమా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

### నాలుగు క్లూస్‌టీంలతో విచారణ

హత్య కేసును ఛేదించేందుకు నాలుగు క్లూస్‌టీంలను ఏర్పాటుచేసినట్టు ఏసీపీ రవీందర్‌రెడ్డి చెప్పారు. వీలైనంత త్వరగా హత్యకు గల కారణాలను సేకరించి నిందితులను పట్టుకొంటామన్నారు. మృతిరాలి ఒంటిపైనుంచి రెండు బంగారుగాజులు, గొలుసు, ఉంగరం స్వాధీనం చేసుకొన్నట్టు తెలిపారు.

### విషయం ఊళ్లో చెప్పా: నవీన్

'ఉదయం 7 గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లగా సమీపంలోని వంతెన కింద బొమ్మ మాదిరిగా కనిపించింది. దగ్గరకెళ్లి చూడగా నగ్నంగా ఉన్న మహిళ చనిపోయి ఉన్నది. వెంటనే గ్రామస్థులకు సమాచారమిచ్చా. గ్రామస్థులు చేవెళ్ల పోలీసులకు సమాచారమందించారు' అని గ్రామస్థుడు నవీన్ తెలిపారు.



ఖైరతాబాద్‌లోని విద్యుత్‌సౌధ వద్ద నిరసన దీక్షచేస్తున్న తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు

# ఏ ఆంధ్రా ఉద్యోగినీ ఒప్పుకోం

## విద్యుత్ సంస్థల్లో కొనసాగుతున్న ఆందోళన

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో ఆంధ్రాప్రాంత ఉద్యోగులను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమని తెలంగాణ విద్యుత్ ఉద్యోగసంఘాలు పునరుద్ఘాటించాయి. ధర్మాధికారి ఉత్తర్వుల పేరుతో, ఇతర కారణాలతో ఆంధ్రా ఉద్యోగులు ప్రవేశించాలని యత్నిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించాయి. 584 మంది ఉద్యోగులను ఏపీ విద్యుత్ సంస్థలు రిలీవ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు మంగళవారం సైతం తమ నిరసనలను కొనసాగించారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జేఏసీ, తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీల నేతృత్వంలో వేర్వేరుగా రిలే నిరాహారదీక్షలు నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని విద్యుత్‌సౌధ, మింట్‌కంపౌండ్‌లోని టీఎస్ఎస్పీడీసీఎల్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహించారు. ఆందోళనలు కొనసాగుతుండగానే.. ఏపీ నుంచి రిలీవైన ఉద్యోగులు కొందరు విద్యుత్‌సౌధలోని ప్రవేశించేందుకు యత్నిస్తుండగా తెలంగాణ ఉద్యోగులు అడ్డుకున్నారు. దీంతో ఏపీ ఉద్యోగులు వెనుదిరిగిపోయారు.

# 10 పట్టణాల్లో బీపాస్

## పైలట్ ప్రాజెక్టును స్వయంగా పర్యవేక్షిస్తున్న డీటీసీపీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రజలకు ఇండ్ల నిర్మాణ అనుమతులను సులభంగా ఇచ్చేందుకు టీఎస్ బీపాస్ (తెలంగాణ స్టేట్ బిల్డింగ్ పర్మిషన్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్)ను తీసుకొస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. పది పట్టణాల్లో దీన్ని ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నది. రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఇటీవల అసెంబ్లీలో చేసిన ప్రకటనకు అనుగుణంగా ఏప్రిల్ రెండు నుంచి టీఎస్ బీపాస్‌ను పూర్తిస్థాయిలో అమల్లోకి తెచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జనగామ, వికారాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల పట్టణాల్లో ఈ నెల 2 నుంచే టీఎస్ బీపాస్ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించిన ప్రభుత్వం.. తాజాగా దీన్ని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు సూర్యాపేట, నల్లగొండ, సంగారెడ్డి, జగిత్యాల, అచ్చంపేట మున్సిపాలిటీలకు విస్తరించింది. ఈ ప్రాజెక్టును డీటీసీపీ (డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నది. ఇంటి అనుమతుల కోసం ప్రజలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఎలా చేస్తున్నారు? ఏయే పత్రాలను అప్‌లోడ్ చేస్తున్నారు? అనే విషయాలను డీటీసీపీ అధికారులు, సిబ్బంది స్వయంగా పరిశీలించి ఏమైనా పొరపాట్లుంటే అక్కడికక్కడే పరిష్కారాలను చూపుతున్నారు.

బుధవారం
18•3•2020
కరీంనగర్

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




## కరోనా డైరీ



ఓటేసినప్పుడు వేలికి సిరా రాస్తారు! నెల పాటు ఆ గుర్తు అలానే ఉండిపోతుంది! కరోనా అనుమానితుల గుర్తింపు విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం ఇదే చిట్కాను పాటిస్తున్నది! 'హోం క్వారంటైన్డ్' అని రాసి ఉన్న ముద్రను వారి చేతిపై వేస్తున్నది. కరోనా లక్షణాలున్నవారు బయట తిరుగకుండా.. తిరిగినా వెంటనే గుర్తించేందుకు వీలుగా ఈ చర్య తీసుకున్నది.



కరోనా వ్యాప్తి నియంత్రణ చర్యల్లో భాగంగా స్టేషన్లలో రద్దీని తగ్గించేందుకు భారత రైల్వే దేశవ్యాప్తంగా 250 రైల్వే స్టేషన్లలో ప్లాట్‌ఫాం టికెట్ ధరను పెంచింది. రూ. 10 నుంచి పెద్ద స్టేషన్లలో రూ. 50, చిన్న స్టేషన్లలో రూ. 20 చేసింది.



కరోనా వ్యాప్తి నేపథ్యంలో మహారాష్ట్రలోని షిర్డీ సాయిబాబా ఆలయాన్ని మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి మూసివేశారు.



భద్రాద్రిలో ప్రతిపడాది వైభవంగా నిర్వహించే సీతారాముల కల్యాణం కరోనా వైరస్ కారణంగా ఈసారి నిరాడంబరంగా జరుగనున్నది. శ్రీరామనవమి వేడుకను మిథిలా స్టేడియంలో బదులు ఆలయ ప్రాంగణంలోనే నిర్వహించనున్నారు.



కరోనా వ్యాధికి ఔషధాన్ని కనుగొనేందుకు ఐఐసీటీ, ప్రముఖ ఫార్మా కంపెనీ సిప్లా చేతులు కలిపాయి. రెమ్‌డెసివిర్, ఫేవిపిరావిర్‌తోపాటు బొలాక్సావిర్ డ్రగ్‌ను కూడా తయారుచేయాలని సిప్లా చైర్మన్ వైకే హమీద్ తమను కోరారని ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్ చంద్రశేఖర్ తెలిపారు.



కరోనా దెబ్బతో పేద, మధ్యతరగతి ప్రజలు బ్యాంకు రుణాలకు వడ్డీలు చెల్లించలేకపోతున్నారు. రుణాల ఈఎంఐ చెల్లింపునకు కేంద్రం రెండునెలలు వెసులుబాటు కల్పించాలి.

- ప్రధాని మోదీకి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ లేఖ





# కరోనా కట్టడిలో మనం భేష్

## భారత్ నిబద్ధత ప్రశంసనీయం: డబ్ల్యూహెచ్‌వో

## నివారణే ధ్యేయంగా తెలంగాణ కఠినచర్యలు

మన దేశంలో కరోనా తొలి కేసు నమోదుకు.. మొదటి మరణానికి మధ్య వ్యవధి 42 రోజులు..
అమెరికాలో ఇది 39 రోజులు.. చైనాలో 10 రోజులు..
ఇరాన్‌లో తొలికేసు నమోదైన రోజే తొలి మరణం కూడా..
వైరస్ ఉనికి తెలిసిన 47 రోజుల్లో ఇటలీలో 2,158 మరణాలు..
అదే సమయంలో భారత్‌లో మూడు మరణాలు మాత్రమే నమోదు!

ప్రత్యేక కథనం 4వ పేజీలో

దేన్నైనా జయించగలమని గొప్పలు చెప్పుకొనే చైనా.. అమెరికా.. యూరప్ దేశాలు.. ఇప్పుడు ఒక మహాభూతానికి గడగడలాడుతున్నాయి. అనేక దేశాల్లో రోగం ఉన్నదని తేలేలోగానే మరణం సంభవిస్తున్నది. ఒకే ఒక్క దేశం.. 130 కోట్ల జనాభా.. భౌగోళికంగా విశాలం, సంక్లిష్టమైన భారతదేశం విజయవంతంగా వైరస్‌ను అడ్డుకొంటున్నది. ఇది ఎవరో అన్నమాటలు కావు. సాక్షాత్తూ ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రశంసలు. కరోనా నియంత్రణలో భారత్ నిబద్ధత అద్భుతమని కొనియాడింది. మరోవైపు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా తీసుకొంటున్న కఠిన చర్యలు.. కొవిడ్ -19 వ్యాప్తిని పకడ్బందీగా కట్టడి చేస్తున్నాయి.



మాదాపూర్‌లో కొవిడ్ తనిఖీలు

# ఉద్దీపనలకు సై!

దేశ ఆర్థిక వ్యవస్థపై కరోనా ప్రభావం
మరింత పెరుగనున్న మాంద్యం ముప్పు
ఆర్థిక, ద్రవ్యపర ప్యాకేజీలు తప్పవన్న నిపుణులు
ఉత్పత్తి పెరుగుదల, ధరల నియంత్రణపై చర్యలుండాలని సూచన

8

# రుణమాఫీ చెక్కు రైతు చేతికే

- రూ. 25వేలలోపు రుణం ఒకేసారి..
- రూ. లక్షలోపు నాలుగు విడుతల్లో మాఫీ
- కుటుంబం యూనిట్‌గా పథకం అమలు
- గ్రామీణ బ్యాంకుల్లో గోల్డ్ లోన్లకూ వర్తింపు
- పట్టణాల్లో నగలపై పంటరుణాలకు వర్తించదు
- వ్యవసాయ రుణమాఫీ మార్గదర్శకాలు జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**



లక్ష రూపాయలకు మించకుండా స్వల్పకాలిక పంట రుణాలకు మాఫీని వర్తింపజేస్తూ రాష్ట్రప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకొని రుణమాఫీ చేస్తారు. రూ. 25వేలలోపు రుణాలు ఒకేసారి.. లక్షలోపు ఉంటే నాలుగు విడుతలుగా ప్రభుత్వం మాఫీ చేయనున్నది. గ్రామీణప్రాంతాల్లో పంటకోసం బంగారం తాకట్టుపై తీసుకున్న రుణాలకు కూడా మాఫీని వర్తింపజేసింది. రుణమాఫీ చెక్కులను రైతులకే నేరుగా అందజేయనున్నారు. ఈ మేరకు వ్యవసాయశాఖ కార్యదర్శి డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డి మంగళవారం మార్గదర్శకాలకు సంబంధించి ఉత్తర్వులు జారీచేశారు. 2014 ఏప్రిల్ 1 నుంచి 2018 డిసెంబర్ 11వ తేదీ వరకు రైతులు తీసుకున్న, రెన్యువల్ చేసుకున్న పంటరుణాలకు మాఫీని వర్తింపజేశారు. అసలు, వడ్డీ కలుపుకొని రూ.లక్షకు మించకుండా అర్హులైన వారందరి రుణాలు మాఫీ చేయనున్నారు. అధిక వడ్డీకి అప్పులు

మిగతా 7వ పేజీలో

## భారతీయ చిరుత జన్యుక్రమం గుర్తింపు

అంతరించిపోయిన చిరుతల పునఃసృష్టి
ల్యాకోన్స్‌తో కలిసి ప్రయత్నిస్తామన్న సీసీఎంబీ

10



ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ICMR)
మాంసాహారం (చికెన్ & గుడ్లు) తినడానికి
కోవిడ్-19 (కరోనా వైరస్) కు ఎటువంటి
సంబంధం లేదని సుస్పష్టంగా తెలియజేసింది

- చైనా, అమెరికా మరియు ఆస్ట్రేలియా వంటి దేశాల్లో కరోనా వైరస్ వ్యాప్తి చెందిన తర్వాత, వినియోగదారులు తమ వ్యాధినిరోధక శక్తిని పెంపొందించుకోడానికి చికెన్ మరియు గుడ్లను విరివిగా తింటున్నారు.
- ప్రపంచ వ్యాప్తంగా మాంసాహార వినియోగంలో చికెన్ వాటా 50 శాతానికి మించి ఉన్నదనేది వాస్తవం.

- (మూలం: మీడియా రిపోర్ట్స్ &
https://www.icmr.nic.in/sites/default/files/press_realease_files/Press_Release_ICMR_13March2020.pdf)

భారతదేశ వైద్య రంగంలో ఫార్ములేషన్, కోర్డినేషన్ మరియు బయో మెడికల్ పరిశోధనలో అత్యున్నత ప్రాధికార సంస్థ 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ICMR), న్యూఢిల్లీ', ఇది ప్రపంచంలోనే పేరుగాంచిన అత్యంత పురాతన సంస్థ.

ప్రజా ప్రయోజనార్థం జారీ చేసినవారు :
Vencobb FRESH CHICKEN
ఆలిండియా పౌల్ట్రీ డెవలప్‌మెంట్ అండ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్
NECC
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ



# నీటివృథాకు చెక్‌డ్యాం

నిజాంసాగర్ ప్రాజెక్టు దిగువన మంజీర నది పరివాహక ప్రాంతం

## నెరవేరనున్న పరివాహకవాసుల దశాబ్దాలకల
## రూ.52 కోట్లతో చింతల్‌నాగారం, బీర్కూర్, కుర్థివద్ద చెక్‌డ్యాంలు
## భూగర్భ జలం, బోరుబావులకు రీచార్జి

**మంజీరకు జీవంపోసేందుకు సర్కారు నిర్ణయం**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

గోదావరి ఉపనది మంజీరా మహారాష్ట్రలోని బీడ్ జిల్లా బాలాఘాట్ పర్వతశ్రేణుల్లో సముద్రమట్టానికి 823 మీటర్ల ఎత్తులో పుడుతుంది. కర్ణాటక మీదుగా తెలంగాణలోకి ప్రవేశించే ఇది రాష్ట్రంలోని సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో ప్రవహిస్తూ లక్షల ఎకరాలకు ఆయువుపట్టుగా నిలుస్తుంది. అనంతరం నిజామాబాద్ జిల్లాలో గోదావరిలో కలుస్తుంది. అయితే, ఎగువన పలు ఆనకట్టల నిర్మాణాలతో తెలంగాణలో మంజీర గతరూపును కోల్పోతున్నది. వర్షాలు కురిస్తే వరదనీరు దిగువకు చేరడమే తప్ప నిలకడగా నిలిచే అవకాశమే లేకుండాపోయింది. సంగారెడ్డిలోని సింగూర్, కామారెడ్డిలోని నిజాంసాగర్ ప్రాజెక్టు నిండటం గగనంగా మారడంతో ముఖ్యమంత్రి కేసీఆర్ వరద నీటినిఒడిసి పట్టేందుకు చెక్‌డ్యాంల నిర్మాణానికి పూనుకున్నారు. నది పొడవునా చెక్‌డ్యాంలతో వర్షపు నీటి నిల్వతో భూగర్భ జలమట్టం పెరుగడంతోపాటు, బోరుబావుల్లోనీరు పైకి ఉబికివస్తుంది.

**వానలకు పొంగి.. తర్వాత ఎండి..**

నిజాంసాగర్ ప్రాజెక్టు పరివాహక ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టు దిగువన మంజీరనదిపై కామారెడ్డి జిల్లాలో మూడుచెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.15.98 కోట్లతో బీర్కూర్ చెక్‌డ్యాం, రూ. 28.29 కోట్లతో చింతల్‌నాగారం, రూ. 7.5 కోట్లతో కుర్థి వద్ద బ్రిడ్జికమ్ చెక్‌డ్యాం నిర్మాణాలకు అనుమతులు మంజూరయ్యాయి. ఏటా వర్షాకాలంలో చెరువులు, కుంటలు, వాగులు, వంకలు వరదనీటితో కళకళలాడుతాయి. భారీవర్షాలకు పొంగిపొర్లి.. వృథా జలాలు దిగువకువెళ్లి సముద్రంలో కలుస్తున్నాయి. వానకాలం తర్వాత చెరువులు, కుంటల్లో చుక్కనీరు ఉండటం లేదు. ఈ పరిస్థితిని రూపుమాపి వానకాలంలో వరద నీటిని ఒడిసి పట్టేందుకు సీఎం ఆదేశాలతో నీటిపారుదల అధికారులు చర్యలు చేపట్టారు. చెక్‌డ్యాంల ద్వారా నీటిని నిల్వచేయడంతో చుట్టూ కిలోమీటర్లమేర భూగర్భజలాలు వృద్ధిలోకి రావడంతోపాటు బోరుబావుల్లో పుష్కలంగా నీరు లభించనున్నది.

**50ఏండ్ల కల సాకారం దిశగా**

తెలంగాణ సరిహద్దులోని జుక్కల్ నియోజకవర్గం పిట్లం మండలంలో మారుమూల ద్వీపకల్పగ్రామం కుర్థి. 1,133 మంది జనాభా నివసిస్తున్న ఈ గ్రామానికి వానకాలంలో మంజీర వరదనీటితో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. కొన్నివారాలపాటు వీరు ఈ ఇబ్బందిని అనుభవిస్తుంటారు. 2015 ఆగస్టు 17న ప్రారంభమైన గ్రామజ్యోతి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రమంత్రి కేటీఆర్ ఈ ప్రాంతంలో పర్యటించి కుర్థి వాసుల కష్టాలపై చలించారు. నాటి మంత్రి వాగ్దానం మేరకు రూ.7.5 కోట్లతో మంజీరనదిపై బ్రిడ్జి కమ్ చెక్‌డ్యాం నిర్మాణానికి అనుమతులు రావడంతో ఈ ప్రాంత వాసులు సంతోషం వ్యక్తంచేసున్నారు. జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గం పరిధిలో విస్తరించిన మంజీర నదిపై బీర్కూర్‌లో నిర్మించనున్న చెక్‌డ్యాంకు రూ.15.98 కోట్లు మంజూరయ్యాయి. ఇక్కడ 32 మిలియన్ క్యూబిక్ ఫీట్ (ఎంసీఎఫ్‌టీ) సామర్థ్యంలో జలాలను నిల్వ చేయనున్నారు. 100 మీటర్ల పొడవుతో

మిగతా 7వ పేజీలో

epaper.ntnews.com

# ఆరునెలల్లో కరోనాకు ఔషధం

■ చేతులు కలిపిన ఐఐసీటీ, సిప్లా

**హైదరాబాద్, మార్చి 17:** ప్రపంచాన్ని తీవ్రంగా కలవరపరుస్తున్న కరోనా వ్యాధిని నయం చేసే ఔషధాన్ని కనుగొనేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ), ప్రముఖ ఫార్మా కంపెనీ సిప్లా చేతులు కలిపాయి. దేశీయ పరిజ్ఞానంతోనే ఔషధం తయారుచేసేందుకు అవి ప్రయత్నిస్తున్నాయి. వీటి ప్రయత్నాలు సఫలమైతే ఆరునెలల్లో కరోనా వ్యాధి చికిత్సకు ఔషధం అందుబాటులోకి రానుంది. కరోనాను నివారించగల వ్యాక్సిన్ తయారీకి ఏడాదిన్నర సమయం పట్టనుండగా, వ్యాధి చికిత్సకు ఔషధాలను తయారుచేసేందుకు పలు కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా కాలంతో పోటీపడుతున్నాయి. యాంటీవైరల్ డ్రగ్స్ రెమ్‌డిసివిర్, ఫేవిపీరవిర్ ఆధారంగానే అవి ఔషధం తయారు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. రెమ్‌డెసివిర్, ఫేవిపిరావిర్‌తోపాటు బొలాక్సావిర్ డ్రగ్‌ను కూడా తయారుచేయాలని సిప్లా చైర్మన్ వైకే హమీద్ తమను కోరారని ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్ చంద్రశేఖర్ మంగళవారం చెప్పారు. తాము అందించే ఈ డ్రగ్స్ ఆధారంగా సిప్లా సంస్థ తదుపరి ప్రయోగాలు చేయడంతోపాటు ప్రభుత్వం నుంచి అనుమతులు పొంది, కరోనావైరస్‌కు చికిత్సనందించే యాంటీవైరల్ ఔషధాలను ఉత్పత్తి చేస్తుందని తెలిపారు.

## దిశ విచారణ కమిషన్ ప్రొసీడింగ్స్ వాయిదా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పశువైద్యురాలు దిశ లైంగికదాడి, హత్య కేసులో నిందితుల ఎన్‌కౌంటర్‌పై దర్యాప్తుకు సుప్రీంకోర్టు నియమించిన విచారణ కమిషన్ ప్రొసీడింగ్స్ వాయిదా పడ్డాయి. ఈ నెల 23, 24 తేదీల్లో హైకోర్టులో కమిషన్ విచారణ చేపట్టాల్సి ఉన్నది. కరోనా ప్రభావంతోపాటు హైకోర్టు ప్రాంగణంలో ప్రవేశంపై నిషేధాజ్ఞలు ఉన్నందున విచారణ వాయిదా పడిందని కమిషన్ కార్యదర్శి శశిధర్‌రెడ్డి తెలిపారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో వారంలో మూడురోజులు మాత్రమే కేసుల విచారణ చేపట్టాలని సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ ట్రిబ్యునల్ (క్యాట్) నిర్ణయించింది.

## మాస్కులు ఇచ్చి పెండ్లికి ఆహ్వానం

**మెట్‌పల్లిటౌన్:** కరోనా వైరస్ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలపై ప్రజల్లోనూ అవగాహన పెరుగుతున్నది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణానికి చెందిన బెజ్జారపు ప్రవీణ్ వివాహం లక్ష్మితో ఈ నెల 20న మెట్‌పల్లిలో జరగనుంది. కాగా ప్రవీణ్ తన పెండ్లికి మాస్క్‌తో రండి అంటూ పెండ్లి పత్రికతో పాటు మాస్కును ఇస్తూ ఆహ్వానిస్తున్నాడు.



పెండ్లి పత్రికతోపాటు మాస్కను అందజేస్తున్న ప్రవీణ్ (కుడి నుంచి మొదటి వ్యక్తి)





# గడ గడ

## నిద్రలేకుండా చేస్తున్న గబ్బిలం

■ సార్స్, నిఫా వైరస్‌లకు కూడా అదే కారణం

■ కరోనా విస్తరణకూ దానిపైనే అనుమానాలు

■ పుణె ఇన్‌స్టిట్యూట్‌లో పరిశోధనలు

■ తెలంగాణలో కూడా నమూనాల సేకరణ

**నలుపు రంగులో కాళ్లు పైకి, తల కిందికి వేలాడేసి నిద్రపోతూ.. చూడటానికే భయానకంగా కనిపించే ఆ నిశాచరజీవి నేడు ప్రపంచాన్ని గడగడలాడిస్తున్నది. పొద్దంతా నిద్రపోయి రాత్రంతా ఆహారం కోసం వేటాడే ఆ జీవి విస్తరిస్తున్న వైరస్ కారణంగానే నేడు వేలసంఖ్యలో మనుషులు చనిపోతున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంతకు మునుపు సార్స్, స్వైన్‌ఫ్లూ, నిఫా వంటి ప్రాణాంతక వైరస్‌ల వ్యాప్తికి, నేడు ప్రపంచదేశాలను వణికిస్తున్న కరోనా విస్తరణకు కూడా అదే కారణమన్న వాదన వినిపిస్తున్నది. అసహ్యమైన ముఖాకృతితో.. కొందరు అపశకునంగా భావించే ఆ జీవి మరేదో కాదు.. గబ్బిలం.**

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ :**

గబ్బిలాల నుంచే వైరస్ వస్తున్నదా లేక వాటి ద్వారా వైరస్ వ్యాపిస్తున్నదా అన్నదానిపై పలుదేశాలలో విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి. మనదేశంలో కూడా పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీలో పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఇందుకోసం పరిశోధకులు దేశవ్యాప్తంగా ఆయాప్రాంతాలలో పర్యటించి పలు రకాల గబ్బిలాల నుంచి రక్తం, లాలాజలం నమూనాలను సేకరిస్తున్నారు. పుణె శాస్త్రవేత్తలు ఇటీవల తెలంగాణలో కూడా పర్యటించి గబ్బిలాల నుంచి నమూనాలను సేకరించారు.

### నిఫాకు కారణం గబ్బిలాలే

రెండేండ్ల క్రితం కేరళలోని కోజికోడ్, మలప్పురం జిల్లాల్లో 17 మందిని బలిగొన్న నిఫా వైరస్‌కు కూడా పండ్లు తినే గబ్బిలాలే కారణమని నిర్ధారించారు. నిఫా కారణంగా ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మరణించడంతో వారి ఇంటి ఆవరణను శాస్త్రవేత్తలు పరిశీలించారు. అక్కడి బావిలో పెద్ద ఎత్తున గబ్బిలాలు ఆవాసం ఏర్పరచుకోవడం గుర్తించి, వాటి రక్తనమూనాలను సేకరించారు. నిఫా వైరస్‌కు గబ్బిలాలే కారణమని ఆ తరువాత పుణెలోని నేషనల్ వైరాలజి ఇన్‌స్టిట్యూట్ నిర్ధారించింది.

### వైరస్ ఎలా విస్తరిస్తుంది?

గబ్బిలాలు సగం తిని పడేసిన పండ్లను పందులు తినడం ద్వారా స్వైన్‌ఫ్లూ వ్యాధి ప్రబలిందన్న వాదన ప్రచారంలో ఉంది. హాంకాంగ్‌లో పందిమాంసం వండిన ఒక చెఫ్ మరో మహిళతో కరచాలనం చేయడం ద్వారా ఆమెకు స్వైన్‌ఫ్లూ వచ్చిందని, ఆమె నుంచి వ్యాధి క్రమంగా ఇతరులకు విస్తరించిందని అంటుంటారు. 2009లో పుట్టిన స్వైన్‌ఫ్లూ భారత్‌తోపాటు పలుదేశాలను ఇప్పటికీ గడగడలాడిస్తున్నది. స్వైన్‌ఫ్లూ (హెచ్1ఎన్1)ను ప్రపంచ ఆరోగ్య సంస్థ 2010లో మహమ్మారిగా ప్రకటించింది.



### తెలంగాణకు పుణె శాస్త్రవేత్తలు

వైరస్‌లకు, గబ్బిలాలకు ఉన్న సంబంధంపై పరిశోధనలు చేస్తున్న పుణెలోని నేషనల్ వైరాలజి ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన శాస్త్రవేత్తలు నాలుగు నెలల క్రితం తెలంగాణలో పర్యటించారు. పలు ప్రాంతాలలో వేర్వేరు గబ్బిలాలను గుర్తించి వాటి రక్త నమూనాలను, లాలాజలం నమూనాలను సేకరించారు. హైదరాబాద్‌లోని హైకోర్టు భవనం, ఉస్మానియా యూనివర్సిటీ, చిల్కూరు బాలాజీ దేవాలయం, మంజీరా నది, జనగామ తదితర ప్రాంతాలలో వివిధ రకాలకు చెందిన వందల సంఖ్యల గబ్బిలాల నుంచి నమూనాలను సేకరించారని వన్యప్రాణి నిపుణులు శంకరన్ చెప్పారు. ఈ గబ్బిలాలద్వారా ఎటువంటి వైరస్‌లు ఉత్పన్నమవుతున్నాయి, వాటికి విరుగుడు ఏమిటి అన్నదానిపై శాస్త్రవేత్తలు పరిశోధనలు సాగిస్తున్నారని తెలిపారు.

### గబ్బిలాలలో పలురకాలు

గబ్బిలాలు జనసంచారంలేని పాడుపడిన బంగ్లాలు, చారిత్రక కట్టడాలు, పెద్దపెద్ద వృక్షాలను ఆవాసాలుగా చేసుకుంటాయి. పర్యావరణ పరిరక్షణలో తమవంతుగా సహకరిస్తుంటాయి. తలకిందులుగా నిద్రపోయే క్షీరజాతికి చెందిన ఈ జంతు జాతులు మన దేశంలో ప్రధానంగా 11 ఉన్నాయి. కేవలం పండ్లను తినేవి కొన్ని రకాలైతే క్రిమికీటకాలను తినేవి మరో రకం. కప్పలు, చేపలను తినేవి మరికొన్ని రకాలు. పండ్లను తినే గబ్బిలాలు విత్తనాలను విసర్జించడం ద్వారా చెట్ల వ్యాప్తికి దోహదపడుతాయి. ఇవి మానవులకు నేరుగా హాని తలపెట్టకపోయినా వైరస్‌ను మోసుకొచ్చే వాటిగా అనుమానిస్తున్నారు. వీటిపై సాగుతున్న పరిశోధనలు విజయవంతమైతే స్వైన్‌ఫ్లూతోపాటు కరోనాకు కూడా వ్యాక్సిన్ అందుబాటులోకి రావచ్చని భావిస్తున్నారు.

## ఈఎంఐ వెసులుబాటు ఇవ్వండి

■ ప్రధానికి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ లేఖ

**ఖైరతాబాద్:** కరోనా వైరస్ ప్రభావంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భువనగిరి మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. బ్యాంకు రుణాలకు వడ్డీలు చెల్లించలేకపోతున్నారని చెప్పారు. రుణాలకు సంబంధించి ఈఎంఐ చెల్లింపునకు కేంద్ర ప్రభుత్వం రెండునెలలు వెసులుబాటు కల్పించాలని కోరారు. కరోనా నిర్ధారణ పరీక్షలకు అవసరమయ్యే కిట్లను కేంద్ర ప్రభుత్వం.. అన్ని రాష్ట్రాలకు సరఫరా చేయాలని విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, డాక్టర్ హర్షవర్ధన్‌కు లేఖలు రాశారు. వీటిని మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు చూపించారు.



ఫిలిప్పీన్స్‌లో చదువుకుంటున్న ఏపీ, తెలంగాణకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు స్వస్థలాలకు వస్తూ మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో చిక్కుకుపోయారు. భారత రాయబార కార్యాలయం నుంచి అనుమతి రానిదే విమానం ఎక్కనివ్వబోమని విమానాశ్రయ అధికారులు అడ్డుకొంటున్నారని, తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

## ప్లాట్‌ఫాం టికెట్ @ రూ.50

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వ్యాప్తి నియంత్రణ చర్యల్లో భాగంగా స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు భారత రైల్వే ప్లాట్‌ఫాం టికెట్ ధరలను భారీగా పెంచింది. దేశవ్యాప్తంగా 250 రైల్వే స్టేషన్లలో ప్లాట్‌ఫాం టికెట్ ధరను పెంచుతున్నట్టు ప్రకటించింది. ప్రస్తుతం రూ.10 ఉండగా, ఈ మొత్తాన్ని ప్రధాన స్టేషన్లలో రూ.50కి, చిన్న స్టేషన్లలో రూ.20కి పెంచుతున్నట్టు తెలిపింది. ఇవి బుధవారం నుంచి అమల్లోకొస్తాయి.

### కరోనా కారణంగా 29 రైళ్లు రద్దు

కరోనా వ్యాప్తి నియంత్రణలో భాగంగా బుధవారం నుంచి ఈ నెల 31 వరకు వివిధ తేదీల్లో మొత్తం 29 రైళ్లను రద్దు చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది.

## ఆలయాల్లో కరోనా కట్టడి

■ అధికారులతో మంత్రి అల్లోల సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆలయాల్లో కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు అన్నిచర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని దేవాదాయశాఖ కార్యాలయంలో మంత్రి అధికారులతో సమీక్షించారు. దూరప్రాంతాల నుంచి భక్తులెవరూ ఆలయదర్శనానికి రావొద్దని సూచించారు.

### హైదరాబాద్ రావొద్దు: శ్రీనివాస్‌గౌడ్

చిన్న చిన్న సమస్యలకు నియోజకవర్గ ప్రజలు గుంపులుగా హైదరాబాద్‌కు రావొద్దని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తిచేశారు. సమస్యలుంటే ఫోన్ ద్వారా దృష్టికి తీసుకురావాలని కోరారు.

## ఎయిర్‌పోర్ట్ టు క్వారంటైన్

**హైదరాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** కరోనా వ్యాప్తి నేపథ్యంలో శంషాబాద్ విమానాశ్రయ అధికారులు, సైబరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్ విదేశాల నుంచి వచ్చేవారికి మార్గదర్శకాలను జారీచేశారు. యూఏఈ, ఖతార్, ఒమన్, కువైట్ దేశాల నుంచి వచ్చేవారితోపాటు ఇతర ప్రాం తాల నుంచి ఆయా దేశాల మీదుగా వచ్చేవారు 14 రోజులపాటు క్వారంటైన్‌లో ఉండాలని ఆంక్షలు విధించారు. బ్రిటన్ సహా ఐరోపా దేశాల నుంచి వచ్చేవారిపై బుధవారం నుంచి నిషేధం విధించారు. మరోవైపు తెలంగాణలోని అన్ని జైళ్లలో ములాకత్ రద్దు చేస్తున్నట్టు జైళ్లశాఖ డీజీ రాజీవ్‌త్రివేది తెలిపారు.

### పీఎఫ్ ఆఫీసుల్లో మార్గదర్శకాలు

హైదరాబాద్ బర్కత్‌పురాలోని పీఎఫ్ కార్యాలయం, కూకట్‌పల్లిలోని ఈపీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం పలు ఆంక్షలను విధించాయి. సమాచారం కోసం బర్కత్‌పురలో ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ నంబర్లు 18005999911, 040-27564576, కూకట్‌పల్లి కార్యాలయంలోని 040-29705520, 040-29708830 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### విశాఖ శారదాపీఠంలో యాగాలు

దేశంలో ఆరోగ్యకర సమాజాన్ని ఆకాంక్షిస్తూ.. యోగవాసిష్టం సూచించినట్టు విశాఖ శారదాపీఠంలో యాగాలు నిర్వహిస్తున్నట్టు శారదాపీఠం ఉత్తర పీఠాధిపతి స్వామి స్వాత్మానందేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. మరోవైపు, కరోనా వ్యాప్తిని అడ్డుకునేందుకు ప్రశాంతినిలయంలో దేశవిదేశీ భక్తులకు వసతిసౌకర్యం నిలిపివేస్తున్నట్టు సత్యసాయి ట్రస్ట్ ప్రకటించింది.

# కరోనా కట్టడిలో మనమే భేష్!

**నేషనల్ డెస్క్:**

చైనాలో తొలి కరోనా కేసు అధికారికంగా గతేడాది డిసెంబర్ 31న నమోదవ్వగా.. తొలి మరణం పదిరోజుల తేడాలోనే (జనవరి 9)న రికార్డయింది. ఈ పరిస్థితులను భారత్‌తో పోల్చిచూస్తే.. దేశంలో తొలి కరోనాకేసు జనవరి 30న నమోదవ్వగా.. తొలి మరణం మార్చి 12న నమోదైంది. తొలి కేసును గుర్తించిన తర్వాత.. తొలి మరణం సంభవించడానికి అత్యధికంగా 42 రోజుల సమయం పట్టింది. అప్పటివరకు రోగిని రక్షించడంలో మన వైద్యులు విజయం సాధించారు. ఆ వ్యక్తి వయోవృద్ధుడు కావడం, ఇతర అనారోగ్య సమస్యలు ఉండటం కూడా అతడి మరణానికి కారణమైంది. వైరస్ ప్రభావం అధికంగా ఉన్న మరే ఇతర దేశంలో(చైనా, ఇటలీ, ఇరాన్, స్పెయిన్, అమెరికా సహా) మొదటి కేసును గుర్తించిన తేదీకి, తొలి మరణం నమోదైన తేదీకి ఇంత వ్యవధి లేదు. తొలికేసు గుర్తించిన తేదీకి, తొలి మరణం నమోదైన తేదీకి మధ్య ఎక్కువ సమ2యం ఉందంటే.. వైరస్‌ను కట్టడి చేయడంలో, వ్యాధిసోకిన బాధితులకు చికిత్సను అందించడంలో అధికారులు అప్రమత్తతతో ఉన్నట్టు అర్థమని నిపుణులు చెబుతున్నారు. దీన్నిబట్టి వైరస్ సోకిన వాళ్లకు అందిస్తున్న చికిత్స పద్ధతుల్లో మిగతా దేశాల కంటే భారత్ మెరుగ్గా ఉన్నట్టు అర్థమవుతున్నది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కరోనాతో మరణించిన వారి సంఖ్య మూడుకు చేరగా, ఇప్పటివరకూ నమోదైన కేసుల సంఖ్య 137గా ఉన్నది. మరోవైపు, చైనాలో కరోనాతో మరణించిన వారి సంఖ్య 3,226కు చేరగా, ఇప్పటివరకూ నమోదైన కేసుల సంఖ్య 80,881గా ఉన్నది.

### కరోనా వివిధ దశలు..

**తొలి దశ:** ఈ దశలో వైరస్ సోకిన వారిని గుర్తించి కేసుల్ని నమోదు చేస్తారు. బాధితులు ఇతరులతో కలువకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు.

**రెండో దశ (లోకల్ ట్రాన్స్‌మిషన్):** కరోనా వైరస్ ప్రభావిత దేశాల్లో ప్రయాణం చేసి, స్వదేశానికి వచ్చిన వారికి వైరస్ సోకితే, లోకల్ ట్రాన్స్‌మిషన్ అంటారు.

**మూడో దశ (కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్):** వైరస్ బాధితునితో కలవకపోయినా, కరోనా వైరస్ బాధిత దేశంలో ప్రయాణించకపోయినా ఒక వ్యక్తికి ఈ వైరస్ సోకినట్లయితే.. ఆ దశను కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్ అంటారు. ఈ దశ ప్రస్తుతం ఇరాన్, దక్షిణ కొరియా, అమెరికా, ఐరోపాలోని పలు దేశాల్లో ఉన్నది.

**నాలుగో దశ:** ఈ దశలో వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తూ, అంటు వ్యాధిగా మారుతుంది. ప్రస్తుతం చైనాలో ఈ దశ ఉన్నది.

### కరోనా గుర్తించినరోజే మరణం

ఇరాన్‌లో ఫిబ్రవరి 19న రెండు కరోనా కేసులను గుర్తించారు. అదేరోజు ఆ ఇద్దరూ మరణించారు. కొవిడ్ వల్ల చైనా తర్వాత తీవ్ర ప్రభావానికి గురైన ఇటలీలో తొలి కరోనా కేసు జనవరి 31న నమోదవ్వగా.. ఫిబ్రవరి 21న తొలి మరణం రికార్డైంది. వీటిమధ్య అంతరం 22 రోజులుగా ఉన్నది. ఆ తర్వాత ఆ దేశంలో అత్యంత వేగంగా కొవిడ్ విస్తరించింది. దీంతో ఇప్పటివరకు ఇటలీలో 2,158 మంది మరణించారు. 27,980 మందికి వైరస్ సోకి బాధపడుతున్నారు. ఇరాన్‌లో కరోనాతో మరణించిన వారి సంఖ్య 988కు చేరగా, నమోదైన కేసుల సంఖ్య 16,169గా ఉన్నది. స్పెయిన్‌లో తొలి కరోనా కేసు జనవరి 31న, తొలి మరణం ఫిబ్రవరి 13న నమోదయ్యాయి. ఇక్కడ పద్నాలుగు రోజుల పాటు రోగిని కాపాడగలిగారు. ఇప్పుడు స్పెయిన్‌లో కరోనా మృతులు 509కు చేరగా, వైరస్ సోకిన కేసుల సంఖ్య 11,409గా ఉన్నది. ఇటలీ, స్పెయిన్‌లో ఒకే రోజున(జనవరి 31) కరోనా తొలి కేసులు గుర్తించినప్పటికీ, మరణాల తేదీల్లో సుమారు 8 రోజుల వ్యత్యాసం ఉన్నది. అగ్రరాజ్యం అమెరికాలో తొలి కరోనా కేసు జనవరి 31న నమోదవ్వగా.. తొలి మరణం ఫిబ్రవరి 29న సంభవించింది. తొలి కేసు గుర్తించడానికి.. తొలి మరణానికి అమెరికాలో 39 రోజుల అంతరం నమోదైంది. ప్రస్తుతం ఆ దేశంలో కొవిడ్-19తో 93 మంది చనిపోగా.. 4,752 కేసులు నమోదయ్యాయి.

### భారత్ నిబద్ధత ఆకట్టుకున్నది: డబ్ల్యూహెచ్‌వో

కరోనాపై పోరాటంలో భాగంగా భారత్ చూపుతున్న నిబద్ధత ఎంతో ఆకట్టుకున్నదని ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రశంసలు కురిపించింది. భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్)తో సమావేశం అనంతరం భారత్‌కు డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధిగా ఉన్న హెంక్ బెకెడమ్ మీడియాతో మాట్లాడారు. 'కరోనాపై పోరాడేందుకు భారత్‌లో అధికారులు నిబద్ధతతో చర్యలు చేపడుతున్నారు. ఇవి ఎంతో ఆకట్టుకుంటున్నాయి. దేశంలో వైరస్ తీవ్రత ఇంతగా ఉన్నప్పటికీ భారత్ ధృఢంగా ఉండటానికి ఇది కూడా ఓ కారణం. వైరస్‌పై ప్రతి ఒక్కరి నుంచి ఈ స్థాయిలో స్పందన రావడం ఎంతో ఆకర్షించింది. భారత్‌లో ఐసీఎంఆర్ వంటి సంస్థల్లో పరిశోధనలకు అనువైన సదుపాయాలు ఉన్నాయి. వైరస్‌ను ఎదుర్కొనగల సామర్థ్యం వారికి ఉన్నది' అని హెంక్ పేర్కొన్నారు.

| దేశం | తొలి కేసు నమోదైన రోజు | తొలి మరణానికి పట్టిన వ్యవధి | తొలి కేసును గుర్తించి నేటికి(బుధవారానికి) | ప్రస్తుతం మరణాలు | మొత్తం కేసులు |
|---|---|---|---|---|---|
| చైనా | 31.12.2019 | 10 రోజులు | 78 రోజులు | 3,226 | 80,881 |
| ఇటలీ | 31.01.2020 | 22 రోజులు | 47 రోజులు | 2,158 | 27,980 |
| ఇరాన్ | 19.02.2020 | అదేరోజు | 28 రోజులు | 988 | 16,169 |
| స్పెయిన్ | 31.01.2020 | 14 రోజులు | 47 రోజులు | 509 | 11,409 |
| అమెరికా | 21.01.2020 | 39 రోజులు | 57 రోజులు | 93 | 4,751 |
| భారత్ | 30.01.2020 | 42 రోజులు | 48 రోజులు | 03 | 137 |

### తెలంగాణలో కట్టుదిట్టం

దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల్లో కొవిడ్-19 విస్తరించగా.. తెలంగాణ ప్రభుత్వం ముందస్తుగానే కట్టడిచర్యలు చేపట్టింది. విమాన, రోడ్డు, రైలు మార్గాల్లో రాష్ట్రంలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరినీ పరీక్షించి కరోనా వ్యాప్తిని కట్టుదిట్టంగా అడ్డుకొంటున్నది.రూ.500 కోట్ల నిధులను విడుదల చేసి వైరస్ నిరోధానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకొంటున్నది. పలుచోట్ల క్వారంటైన్ కేంద్రాలు, పదమూడు వందలకు పైగా ఐసొలేషన్ బెడ్స్, ఆరు వ్యాధి నిర్ధారణ ల్యాబ్‌లతో పటిష్ఠమైన చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా జనసమ్మర్థాన్ని నిలువరించడానికి పదిహేనురోజులపాటు పాఠశాలలు, సినిమాహాళ్లు, అమ్యూజ్‌మెంట్‌పార్కులు మూసివేసింది. ఇప్పటివరకు 66 వేలమందికి పైగా స్క్రీనింగ్ నిర్వహించగా కేవలం ఐదుగురికే కరోనా నిర్ధారణ అయింది. వీరిలో ఒకరు చికిత్స ద్వారా వ్యాధి నయంచేయించుకొని డిశ్చార్జి కాగా.. మిగిలిన నలుగురిలో ముగ్గురి పరిస్థితి మెరుగుపడింది.

### రెండో దశలోనే..

దేశంలో కరోనా వైరస్ మహమ్మారి రెండో దశ (లోకల్ ట్రాన్స్‌మిషన్)లో ఉన్నదని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ బలరాం భార్గవ చెప్పారు. ఈ మహమ్మారి నాలుగు దశల్లో ఉంటుందన్నారు. మూడో దశ కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్ అని, అంతర్జాతీయ సరిహద్దులను కట్టుదిట్టంగా మూసివేయడంతో ఈ దశ దేశంలోకి ప్రస్తుతానికి ప్రవేశించబోదని తాను ఆశిస్తున్నట్టు తెలిపారు. కొవిడ్-19 కేసుల పరీక్షల నిర్వహణకు జాతీయ ప్రయోగశాలల గుర్తింపు మండలి (ఎన్ఏబీఎల్) గుర్తింపు పొందిన ప్రైవేటు ల్యాబొరేటరీలతో సంప్రదింపుల ప్రక్రియ జరుగుతున్నదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ రంగంలో 72 ఐసీఎంఆర్ ల్యాబొరేటరీలు పని చేస్తున్నాయని, మరొక 49 ల్యాబొరేటరీలను ఈ నెలాఖరుకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

# వ్యాప్తిని అడ్డుకొంటాం

■ వ్యాధి నిర్ధారణకు ఆరు ల్యాబ్‌లు

■ ఐదుగురికి మాత్రమే పాజిటివ్

■ వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో కరోనా వ్యాప్తిని అడ్డుకొంటామని వైద్యారోగ్యశాఖమంత్రి ఈటల రాజేందర్‌తెలిపారు. ఇప్పటివరకు 66,182 మందికి స్క్రీనింగ్ చేయగా ఐదుగురికే కొవిడ్-19 పాజిటివ్‌గా తేలిందని, ఒకరికి నయంచేసి ఇంటికి పంపామని తెలిపారు. ఇండోనేషియా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఒకరికి పాజిటివ్ వచ్చిందని ఆరోగ్యశాఖ ప్రకటించింది. గాంధీలో చికిత్స పొందుతున్న ముగ్గురు బాధితుల పరిస్థితి మెరుగుపడిందని వెల్లడించింది. మంగళవారం కుటుంబసంక్షేమశాఖ సమావేశ మందిరంలో మంత్రి ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ.. ఇతరదేశాల నుంచి వచ్చినవారికి తప్ప తెలంగాణ గడ్డపై ఉంటున్నవారెవరికీ వైరస్ సోకలేదని పునరుద్ఘాటించారు. వైరస్ తీవ్రత అధికంగా ఉన్న దేశాల నుంచి వచ్చిన వారికి వ్యాధి లక్షణాలు లేకపోయినా క్వారంటైన్‌చేస్తామని, చైనా, ఇటలీ, ఇరాన్, జర్మనీ, కొరియా, ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల నుంచి వచ్చినవారినిక్వారంటైన్‌చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటివరకు 221 మందిని వికారాబాద్, దూలపల్లి క్వారంటైన్ కేంద్రాల్లో ఉంచామని, 1,238 మందిని ఇండ్లల్లోనే క్వారంటైన్‌లో ఉంచినట్టు వివరించారు. విదేశాల నుంచి వచ్చే తెలంగాణవాసులను వారి జిల్లాల్లోనే క్వారంటైన్ చేసే ఆలోచన ఉన్నదన్నారు. ఆఫ్ఘనిస్థాన్, మలేసియా, యూకే, పిలిప్పీన్స్ నుంచి విమానాలను రద్దుచేశారని, బుధవారంనుంచి మరికొన్ని దేశాలనుంచి వచ్చే విమానాలు రద్దు చేయవచ్చన్నారు.



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల. చిత్రంలో కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ యోగితారాణా, డీఎంఈ రమేశ్‌రెడ్డి

### వారికి పాజిటివ్ లేదు

ఇప్పటివరకు 66,182 మందికి శంషాబాద్ విమానాశ్రయంలో స్క్రీనింగ్ నిర్వహించగా ఐదుగురికే కరోనా నిర్ధారణ అయిందని మంత్రి ఈటల అన్నారు. పాజిటివ్ వచ్చిన వ్యక్తులకు సంబంధించి పలువురిని ట్రాకింగ్ చేసి పరీక్షలు నిర్వహించగా అందరికీ నెగెటివ్ వచ్చిందని పేర్కొన్నారు.

### ఆరోగ్యశాఖ బులెటిన్ వివరాలు

| వివరాలు | మంగళవారం ఒక్కరోజు | మొత్తం |
|---|---|---|
| విమానాశ్రయంలో థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు | 2057 | 65238 |
| వ్యక్తిగతంగా వచ్చినవారు | 68 | 918 |
| ఇండ్లలో, ఇతరచోట్ల క్వారంటైన్‌లో ఉన్నవారు | 662 | 1530 |
| దవాఖాన ఐసొలేషన్‌లో | 40 | 435 |
| వ్యాధి నిర్ధారణ పరీక్షలు | 40 | 432 |
| నెగెటివ్‌గా నిర్ధారణ | 21 | 397 |
| పాజిటివ్‌గా నిర్ధారణ | 1 | 5 |
| నిర్ధారణ కావాల్సినవి | 18 | 18 |

### ఆరు ల్యాబ్‌లలో నిర్ధారణ పరీక్షలు

కొవిడ్-19 వ్యాప్తిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రవ్యాప్తంగా ఆరు ల్యాబ్‌లలో వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించనున్నట్టు మంత్రి ఈటల పేర్కొన్నారు. గాంధీ, ఉస్మానియాలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామని, ఫీవర్ దవాఖాన, ఐపీఎం, ఎంజీఎం, నిమ్స్ దవాఖానలో కూడా ల్యాబ్‌లను సిద్ధంచేస్తున్నట్లు వెల్లడించారు. దూలపల్లి, వికారాబాద్ క్వారంటైన్ కేంద్రాలకు సాధారణ వ్యక్తులనే తరలిస్తున్నామని.. విదేశాలనుంచి వచ్చేవారిలో కొందరు ఇంట్లోనే క్వారంటైన్ ఉంటామని కోరుతున్నారని, ఆ విషయాన్ని పరిశీలిస్తామన్నారు. సమావేశంలో కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ యోగితారాణా, డీఎంఈ రమేశ్ రెడ్డి, ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ జీ శ్రీనివాస రావు పాల్గొన్నారు. రాష్ట్రంలో కొవిడ్-19 ఐదుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ కాగా, ఒకరు డిశ్చార్జ్ కాగా, ముగ్గురి ఆరోగ్య పరిస్థితి మెరుగు పడిందని, ఇండోనేషియాకు చెందిన వ్యక్తిని ఐసొలేషన్‌లో ఉంచినట్టు తెలిపింది.

### అప్రమత్తమైన పట్టణ స్థానిక సంస్థలు

రాష్ట్రంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కరోనా కట్టడికి పురపాలకశాఖ చర్యలు చేపట్టింది. బస్టాపులు, రైల్వేస్టేషన్లు, మెట్రో స్టేషన్లు, షాపింగ్ మా ళ్లలో ప్రచారం నిర్వహించడానికి నోడల్ ఆఫీసర్లను నియమించింది. ర్యాపిడ్ రెస్పాన్స్ టీంను సిద్ధంచేసింది. కొవిడ్-19 పాజిటివ్ కేసును గుర్తిస్తే, చేపట్టాల్సిన చర్యలను నోడల్ అధికారులకు నిర్దేశించింది. ప్రార్థనాలయాల్లో కియోస్కులతో అవగాహన కల్పించా లని,అంగన్‌వాడి కేంద్రాలు, మెప్మా బృందాలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

# కరోనా అనుమానితుల చేతిపై ముద్ర




**ముంబై:** ఎన్నికల సమయంలో ఓటర్ ఎడమ చేతి చూపుడు వేలుకు సిరాచుక్క పెట్టినట్టుగా.. కరోనా వైరస్ అనుమానితులకు కూడా మహారాష్ట్ర ప్రభుత్వం ముద్ర వేస్తున్నది. ఈ ముద్రపై 'రక్షిస్తున్నందుకు గర్విస్తున్నాం.. హోం క్వారంటైన్డ్.. 30 మార్చి 2020' అని రాసి ఉన్నది. కరోనా అనుమానితులు స్వీయనిర్బంధాన్ని ఉల్లంఘించినట్లయితే ఇతరులు వారిని గుర్తించేందుకు వీలుగా వారి కుడి చేతిపై చెరిగిపోని సిరాతో స్టాంప్ వేస్తున్నారు. ఈ విషయాన్ని మహారాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి రాజేశ్ తోపే కూడా ధ్రువీకరించారు. గతంలో కొందరు కరోనా అనుమానితులు మహారాష్ట్రలోని దవాఖానల నుంచి పారిపోవడంతో ఇలాంటి నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆయన స్పష్టంచేశారు. స్వీయనిర్బంధాన్ని ఉల్లంఘించి వీరు బహిరంగ ప్రదేశాల్లోకి వెళితే.. ఇతరులు గుర్తించి వారికి దూరంగా ఉండేందు కోసం ఇలాంటి చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని రాజేశ్ తోపే పేర్కొన్నారు.

# హెచ్ఐవీ నియంత్రణ ఔషధాలను కూడా వాడొచ్చు

**న్యూఢిల్లీ:** కరోనా సోకిన వారి పరిస్థితి విషమించినప్పుడు హెచ్ఐవీ ఇన్‌ఫెక్షన్లను కట్టడి చేసేందుకు ఉపయోగించే లోపిన్‌అవిర్, రీటోన్‌అవిర్ ఔషధాలను వాడాలని కేంద్రం సూచించింది. 'ఔషధాలతో కొవిడ్-19 నిర్వహణ' పేరిట జారీ చేసిన మార్గదర్శకాల్లో ఈవివరాల్ని పొందుపరిచింది. మధుమేహం, మూత్రపిండాలు పని చేయకపోవడం, ఊపిరితిత్తుల సమస్యలు ఉండి కరోనాతో బాధపడుతున్న 60 ఏండ్ల పైబడిన వాళ్లు లోపిన్ అవిర్, రీటోన్‌అవిర్ వాడొచ్చని పేర్కొంది.

## కరోనా క్లాక్ 17-3-2020

| | |
|---|---|
| ప్రపంచవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 1,97,000 |
| మరణాలు | 7,950 |
| దేశవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 137 |
| మరణాలు | 3 |
| రాష్ట్రవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 5 |
| మరణాలు | 0 |

# స్వీయనిర్బంధంలో కేంద్ర మంత్రి

**'కరోనా పాజిటివ్' వైద్యుడితో సమావేశం నేపథ్యంలో నిర్ణయం**


మురళీధరన్

**తిరువనంతపురం:** కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి ఒకరు స్వీయనిర్బంధంలోకి వెళ్లాలని నిర్ణయించుకొన్నారు. కరోనా నియంత్రణ ఏర్పాట్లను పరిశీలించేందుకు మూడ్రోజుల క్రితం కేరళలోని తిరువనంతపురంలో ఉన్న శ్రీచిత్ర తిరునాళ్ వైద్యకళాశాలను కేంద్ర విదేశాంగశాఖ సహాయమంత్రి మురళీధరన్ సందర్శించారు. అక్కడ పలువురు వైద్యులతో సమీక్ష జరిపారు. ఈ సమీక్షలో పాల్గొన్న ఒక డాక్టర్ మార్చి ఒకటో తేదీన స్పెయిన్ నుంచి వచ్చారని, ఆయనకు కొవిడ్-19 పాజిటివ్‌గా ఉన్నట్టు మరుసటిరోజు తేలింది. దాంతో విషయాన్ని శ్రీచిత్ర తిరునాళ్ వైద్యకళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆశా కిశోర్ కేంద్ర మంత్రికి తెలిపారు. ఢిల్లీలో ఆయన కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోగా.. వైద్యనివేదిక నెగెటివ్‌గా వచ్చింది. అయిప్పటికీ ముందుజాగ్రత్త చర్యగా స్వీయనిర్బంధంలో ఉండాలని కేంద్రమంత్రి నిర్ణయించారు.




తమ దేశానికి విమాన సర్వీసులు నిలిచిపోవడంతో చెన్నైలో చిక్కుకుపోయిన ఫ్రాన్స్ పర్యాటకులు

## ప్రపంచం దిగ్బంధం

**న్యూయార్క్:** కరోనా రక్కసిని కట్టడి చేసేందుకు ప్రపంచదేశాలు విధిస్తున్న ఆంక్షలతో ప్రపంచం యావత్తూ దిగ్బంధానికి గురైనది. సరిహద్దుల మూత, ప్రయాణాలపై నిషేధం విధిస్తుండడంతో స్వస్థలాలకు వెళ్లాల్సిన ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఆగ్నేయాసియా మొదలుకుని, యూరప్, అమెరికా వరకు ఇదే పరిస్థితి నెలకొన్నది. మలేసియాలో నిత్యావసరాల కోసం సూపర్‌మార్కెట్ల ఎదుట ప్రజలు బారులు తీరారు. ఫిలిప్పీన్స్‌లో చెక్‌పాయింట్ల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. స్పెయిన్‌లో మంగళవారం ఒక్కరోజే రెండు వేలకు పైగా కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో బాధితుల సంఖ్య 11,178కి చేరుకోగా, మృతుల సంఖ్య 491కి పెరిగింది. డిమాండ్ తగ్గడం, ప్రయాణాలపై నిషేధం నేపథ్యంలో విమానాయాన సంస్థలు సర్వీసులను భారీగా తగ్గించాయి. 9 యూరప్ దేశాల్లో చిక్కుకుపోయిన తమ దేశానికి చెందిన 3,614 మందిని తరలించేందుకు టర్కీ సిద్ధమైంది. మరోవైపు, ప్రపంచవ్యాప్తంగా చిక్కుకుపోయిన తమ దేశీయులను తరలించేందుకు జర్మనీ 50 మిలియన్ యూరోల వ్యయంతో కార్యాచరణ రూపొందించింది. ఒక్క మొరాకోలోనే 5,000 మంది జర్మన్లు చిక్కుకుపోయినట్లు అంచనా. విదేశీయులకు పోలండ్ సరిహద్దులు మూసివేయడంతో ఆ దేశంలోకి వెళ్లాల్సిన ట్రక్కులతో లిథువేనియాలో 60 కి.మీ. మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇటలీలో కరోనా బాధితుల సంఖ్య 27,980కి చేరుకున్నది. ఇప్పటివరకు ఆ దేశంలో 2,158 మంది మృత్యువాతపడ్డారు.

- ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 7,950 మందికిపైగా మృత్యువాత పడగా, దాదాపు 1,97,000 మంది వైరస్ బారినపడ్డారు.
- కరోనా తొలిసారి వెలుగులోకి వచ్చిన చైనాలోని వుహాన్‌లో మంగళవారం ఒక కేసు మాత్రమే నమోదైంది.
- కరోనా నేపథ్యంలో థాయ్‌లాండ్ వాటర్ ఫెస్టివల్‌ను రద్దుచేసింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత తొలిసారి యూఎస్ గుర్రపు పోటీలు వాయిదా పడనున్నట్లు సమాచారం.

# కరోనా ఘంటికలు

**137కు పెరిగిన బాధితులు**

- వైరస్‌తో మరొకరు మృత్యువాత.. దేశంలో మూడుకు చేరిన మరణాలు
- అఫ్గానిస్థాన్, ఫిలిప్పీన్స్, మలేసియా ప్రయాణికులపైనా నిషేధం
- మహారాష్ట్రలో వేగంగా వ్యాపిస్తున్న వైరస్
- పార్లమెంట్ సమావేశాలు కుదించబోమన్న ప్రధాని మోదీ


మాస్క్‌లకు విపరీతంగా డిమాండ్ పెరుగడంతో వాటిని తయారు చేస్తున్న ముంబై కార్మికులు

**దేశంలో కరోనా కేసులు ఇలా..**

| | | |
|---|---|---|
| మహారాష్ట్ర 39 | కేరళ 26 | ఉత్తరప్రదేశ్ 15 |
| హర్యానా 15 | ఢిల్లీ 8 | కర్ణాటక 11 |
| లడఖ్ 6 | కశ్మీర్ 3 | రాజస్థాన్ 4 |
| తెలంగాణలో 5, ఏపీ, ఒడిశా, పంజాబ్, ఉత్తరాఖండ్, తమిళనాడులలో ఒక్కొక్కటి చొప్పన.. | | బాధితుల్లో విదేశీయులు 24 |

**న్యూఢిల్లీ/ముంబై, మార్చి 17:** కరోనా మహమ్మారి భారత్‌లోనూ పంజా విసురుతున్నది. ఈ వైరస్ బారిన పడి దేశంలో మరొకరు మృత్యువాతపడ్డారు. ముంబైకి చెందిన 63 ఏండ్ల వృద్ధుడు మంగళవారం ప్రాణాలు కోల్పోయారు. దీంతో మృతుల సంఖ్య మూడుకు చేరుకున్నది. మరోవైపు, దేశంలో కరోనా బాధితుల సంఖ్య 137కు పెరిగినట్లు కేంద్ర వైద్య శాఖ వెల్లడించింది. ఇందులో 24 మంది విదేశీయులని తెలిపింది. యూరోపియన్ యూనియన్ (ఈయూ), టర్కీ, బ్రిటన్ నుంచి వచ్చే ప్రయాణికులపై ఈ నెలాఖరు వరకు నిషేధం విధిస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేసిన కేంద్రం.. తాజాగా అఫ్గానిస్థాన్, మలేసియా, ఫిలిప్పీన్స్‌ను కూడా ఆ జాబితాలో చేర్చింది.

**ఒక్క మహారాష్ట్రలోనే 39 కేసులు..**

మహారాష్ట్రలో వైరస్ వేగంగా వ్యాపిస్తున్నది. దేశంలోనే అత్యధికంగా ఆ రాష్ట్రంలో 39 కరోనా కేసులు నమోదయ్యాయి. మంగళవారం మృతిచెందిన ముంబై వాసి ఇటీవలే దుబాయ్ నుంచి తిరిగొచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆయన భార్యకు కూడా కరోనా నిర్ధారణ అయిందని, ఆమె పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని చెప్పారు. దేశంలో ఇప్పటికే కర్ణాటకలో ఒకరు, ఢిల్లీలో మరొకరు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు 13 మందిని డిశ్చార్జి చేసినట్లు అధికారులు తెలిపారు.

**కరోనాపై అవగాహన పెంచండి: ప్రధాని**

కరోనా వైరస్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలని బీజేపీ ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు. మంగళవారం బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను కుదించే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎంపీలు తమ విధులను నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది, ఎయిర్‌లైన్స్ సిబ్బంది.. కరోనా వైరస్‌పై అలుపెరుగని పోరాటం సాగిస్తున్నారని ప్రశంసించారు. మరోవైపు, అన్ని ప్రభుత్వ కార్యాలయాల ముందు థర్మల్ స్కానర్లు ఏర్పాటు చేయాలని కేంద్ర సిబ్బంది, శిక్షణ విభాగం అన్ని మంత్రిత్వ శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. అలాగే తక్షణమే తాత్కాలిక, సందర్శకుల పాస్‌లను నిలిపివేయాలని సూచించింది. అనవసర ప్రయాణాలు మానుకోవాలని, సమావేశాలను సాధ్యమైనంతవరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించాలని సూచించింది.


కరోనా నేపథ్యంలో పూర్తి రక్షణతో చెన్నై విమానాశ్రయం వద్ద చిన్నారితో ఓ తల్లి

# కరోనా టీకాపై కసరత్తు

- అమెరికాలో క్లినికల్ ట్రయల్ ప్రారంభం
- ఏడాదిన్నర తర్వాతే అందుబాటులోకి వచ్చే అవకాశం

**వాషింగ్టన్:** ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా మహమ్మారికి చెక్ పెట్టేందుకు టీకాను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నంలో తొలి అడుగుపడింది. అమెరికాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్(ఎన్ఐహెచ్) శాస్త్రవేత్తలు, మోడెర్నా బయోటెక్నాలజీ సంస్థ సంయుక్తంగా రూపొందించిన టీకాను సోమవారం సీటెల్‌లో ఓ వలంటీర్‌పై తొలి డోస్ ప్రయోగించారు. దీనికి 'ఎంఆర్ఎన్ఏ-1273' అని పేరు పెట్టారు. 18-55 మధ్య ఏండ్ల వయస్సున్న 45 మంది ఆరోగ్యవంతులను బృందాలుగా విభజించి ఆరువారాలు టీకాను ప్రయోగించి, దాని పనితీరును అంచనా వేస్తామని తెలిపారు. ఈ టీకా కరోనాను కట్టడి చేసినట్టు రుజువైనా, ప్రజలందరికీ అందుబాటులోకి రావడానికి ఏడాదిన్నర సమయం పడుతుందన్నారు. ఇంకా అమెరికా 'జిలీడ్' సంస్థ రూపొందించిన 'రెమ్‌డెస్విర్' డ్రగ్‌ను దీన్ని ఇప్పటికే చైనాలో ప్రయోగించారు. కరోనా వ్యాధి నియంత్రణలో సత్ఫలితాలు సాధించిందని, క్లినికల్ ట్రయల్స్ చివరి దశలో ఉన్నాయని ఆ సంస్థ పేర్కొన్నది. అమెరికాకే చెందిన మరో ఔషధ సంస్థ ఇనోవియో డీఎన్ఏ ఆధారిత టీకాను తయారుచేశామని, వచ్చేనెలలో క్లినికల్ ట్రయల్ చేపడుతామన్నది.కరోనా వైరస్ సంక్షోభం ఆగస్టు వరకు కొనసాగవచ్చునని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.

## ఇటలీలో పరిస్థితులు దారుణం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'జ్యోతిబాపూలే విదేశీ విద్యానిధి పథకం ద్వారా తెలంగాణ ప్రభుత్వం అందించిన ఆర్థికసాయంతో ఇటలీలో ఎంఎస్ పూర్తిచేశాను. ఇటలీలోనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాను. ఇక్కడ కరోనా వైరస్ అల్లకల్లోలం చేస్తున్నది. రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. భారత్‌లో అలాంటి పరిస్థితులు ఉత్పన్నం కాకుండా ప్రజలు స్వీయనియంత్రణ పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ముప్పు కొని తెచ్చుకోవడమే అవుతుంది. కరోనా వ్యాప్తి నియంత్రణకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పలు ముందుజాగ్రత్త చర్యలు అభినందనీయం.

– **ఇటలీలోని మిలాన్‌లో ఉన్న కరీంనగర్ జిల్లా రేకుర్తి గ్రామవాసి సంధ్యారాణి**
**(ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ బీ వినోద్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు.)**

## రాష్ట్రాలకు 30 మంది కేంద్ర అధికారులు!

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ కట్టడి కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు చేయూతనిచ్చేందుకు కేంద్రం 30 మంది సంయుక్త కార్యదర్శి, అంతకంటే పై స్థాయి అధికారులను నియమించింది. ఇప్పటికి భారత్‌లో 137 మందికి కరోనా సోకింది. ముగ్గురు రోగులు మృతి చెందారు. దీంతో కోవిడ్-19ను అరికట్టడంలో రాష్ట్రాలకు సహకరించేందుకు వీరిని నియమించినట్లు ఓ కేంద్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి తెలిపారు.

## నేవీలోనూ మహిళలకు శాశ్వత కమిషన్

- సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు
- 3 నెలల్లో విధివిధానాలు రూపొందించాలని కేంద్రానికి ఆదేశం

**న్యూఢిల్లీ, మార్చి 17:** భారత నౌకాదళంలో మహిళా అధికారులకు శాశ్వత కమిషన్ (పర్మినెంట్ కమిషన్) మంజూరుకు మార్గం సుగమం చేస్తూ మంగళవారం సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు చెప్పింది. శారీరక పరిస్థితుల వల్ల మహిళలకు సమాన హక్కులు నిరాకరించడం తగదని స్పష్టంచేసింది. వారికి శాశ్వత కమిషన్‌కు మూడు నెలల్లో విధివిధానాలు రూపొందించాలని జస్టిస్‌లు డీవై చంద్రచూడ్, అజయ్ రస్తోగీలతో కూడిన ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది. సైన్యంలోనూ షార్ట్ సర్వీస్ మహిళా అధికారులకు శాశ్వత కమిషన్ మంజూరు చేస్తూ ఇదే ధర్మాసనం నెలక్రితం చారిత్రక తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. సమాన అవకాశాలు కల్పించడంతో మహిళలు 'తరతరాల వివక్ష' నుంచి బయటపడేందుకు వీలవుతుందన్నాది. ఐఎన్ఎస్ జ్యోతి యుద్ధనౌకలో పనిచేస్తున్నవారితో సహా మహిళా నౌకా అధికారులు సాధించిన ఘనతలను కోర్టు ప్రస్తావించింది. విద్య, న్యాయ, నావల్ ఆర్కిటెక్చర్ విభాగాలకే మహిళలకు పర్మినెంట్ కమిషన్‌ను పరిమితం చేస్తూ 2008లో కేంద్రం తెచ్చిన పాలసీ వివక్షాపూరితమైనదని పేర్కొంది. పిటిషనర్లలో ఒకరైన రిటైర్డ్ కమాండర్ సుమతి బలూనీ కోర్టు తీర్పును స్వాగతించారు. ఈ చారిత్రక తీర్పు నేవీ దృక్పథం మారేందుకు దోహదపడుతుందని అన్నారు. 'తొలి అడుగు పడింది. ఇక సమీప భవిష్యత్‌లో మహిళా అధికారులు నౌకను కమాండ్ చేయడం, సబ్‌మెరైన్లలో పనిచేయడం చూడాలి. మహిళలు వ్యోమనౌకను కమాండ్‌చేసినపుడు, నౌకనూ కమాండ్ చేయగలరు' అని ఆమె అన్నారు. నేవీలో పర్మినెంట్ కమిషన్ ద్వారా నియమితులైన వారు రిటైరయ్యేదాకా కొనసాగుతారు. అదే షార్ట్ సర్వీస్ కమిషన్ ద్వారా చేరే వారు 10 ఏండ్ల వరకు మాత్రమే పనిచేసే వీలుంది. ఆపై మరో నాలుగేండ్లు పొడిగించవచ్చు.



### షిర్డీ సాయిబాబా ఆలయం మూసివేత

**షిర్డీ/న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా రోజురోజుకు కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో మహారాష్ట్రలోని షిర్డీ సాయిబాబా దేవాలయాన్ని కూడా మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి మూసివేశారు. తదుపరి ఆదేశాలను జారీ చేసే వరకు ఆలయం మూసివేసి ఉంటుందని శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ప్రకటించింది. భక్తులు తమ షిర్డీ యాత్రను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని సూచించింది. మరోవైపు ఆగ్రాలో ఉన్న ప్రఖ్యాత తాజ్‌మహల్‌ను మంగళవారం నుంచి మూసివేస్తున్నట్లు పర్యాటకశాఖ పేర్కొంది.

### 85 రైళ్లు రద్దు..

**ముంబై:** కరోనా నిరోధక చర్యల్లో భాగంగా రైల్వే శాఖ 85 రైళ్లను ఈనెల 31 వరకు రద్దుచేయాలని నిర్ణయించింది. ఇందులో సెంట్రల్ రైల్వేకు సంబంధించి 31, పశ్చిమ రైల్వే-10, దక్షిణ మధ్య రైల్వే-29, సౌత్ ఈస్టర్న్ రైల్వేస్-9, నార్తర్న్ రైల్వేస్-5, నార్త్ వెస్టర్న్ రైల్వేస్-4, ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌లో 4 చొప్పున రైళ్లను రద్దు చేసింది.

### ఆన్‌లైన్‌లో పరీక్షల ఫలితాలు

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ నేపథ్యంలో ఢిల్లీలో కేంద్రీయ విద్యాలయ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల వార్షిక పరీక్ష ఫలితాలను ఆన్‌లైన్ (ఈ-మెయిల్, వాట్సప్)లో ప్రకటించనున్నారు. అలాగే తమ పిల్లలకు వచ్చిన మార్కులు ఇతర విషయాలపై టీచర్లతో చర్చించాలనుకుంటే ఫోన్‌లో మాట్లాడాలని లేదా బడులు తెరిచాక కలువాలని యాజమాన్యాలు సూచించాయి. కరోనా నేపథ్యంలో ఎక్కువ మంది గుమిగూడవద్దని ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నాయి.

### వీడియో కాన్ఫరెన్స్‌లో విచారణ

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) పరిమితులను విధించింది. ఈ నెల 31 వరకు ఆడియో, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేవలం అత్యవసర అంశాలపైనే విచారణ చేపడుతామని స్పష్టంచేసింది. సిబ్బంది కూడా ఆఫీస్ లోపల, బయట ఒకరికి ఒకరు దూరంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. సంబంధిత కక్షిదారులు అన్ని వినతులను ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చని, అత్యవసరమైతే తప్ప కార్యాలయాన్ని సందర్శించవద్దని సీఐసీ సూచించింది.

# మరణమృదంగమే!

**ప్రజలు సహకరించకపోతే లక్షలాది మరణాలు!**
**ప్రజలకు ఇరాన్ హెచ్చరిక**

**టెహ్రాన్:** కరోనా మహమ్మారి విజృంభిస్తున్న నేపథ్యంలో ఇరాన్ తమ దేశ ప్రజలకు కఠిన హెచ్చరికలు జారీచేసింది. మార్గదర్శకాలను విస్మరించి, ప్రజలు ప్రయాణాలు కొనసాగిస్తే దేశంలో లక్షలాది మంది మృత్యువాతపడక తప్పదని స్పష్టంచేసిది. స్టేట్ టెలివిజన్ జర్నలిస్ట్, డాక్టర్ అఫ్రజ్ ఇస్లామీ ఈ హెచ్చరిక చేశారు. ఇరాన్‌లోని ప్రఖ్యాత 'షరీఫ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ' అధ్యయనాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రజలు ఇప్పటికైనా సహకరిస్తే, ఈ మహమ్మారి అంతమయ్యే లోపు దేశంలో 12,000 మంది మరణించవచ్చని, మరో 1,20,000 మంది వైరస్ బారిన పడొచ్చని తెలిపారు. ప్రజల నుంచి పాక్షిక మద్దతు లభిస్తే.. 1,10,000 మరణాలు సంభవిస్తాయని, 3,00,000 మంది వైరస్ బారిన పడుతారని పేర్కొన్నారు. ప్రజలు సహకరించని పక్షంలో దేశ ఆరోగ్య వ్యవస్థ కుప్పకూలుతుందని హెచ్చరించారు. 35 లక్షల మంది మృత్యువాతపడుతారని, 40 లక్షల మందికి వైరస్ సోకే ప్రమాదం ఉన్నదని తెలిపారు. కరోనా నేపథ్యంలో దేశ అత్యున్నత ఖమేనీ ఫత్వా జారీచేశారు. ప్రజలు అనవసర ప్రయాణాలు సాగించొద్దని ఆదేశించారు. వైరస్ బారిన పడి ఇరాన్‌లో మంగళవారం మరో 135 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో మృతుల సంఖ్య 988కి చేరుకున్నది. ఇప్పటివరకు 16000 మందికి వైరస్ సోకింది.


ఇరాన్‌లోని ఓ మసీదును శుభ్రం చేస్తున్న సిబ్బంది

### ఇరాన్‌లో 250మందికిపైగా భారతీయులకు కరోనా!

ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయులు ఆరోగ్య విపత్తును ఎదుర్కొంటున్నారు. ఆ దేశంలో 250 మందికిపైగా భారతీయులకు కరోనా సోకినట్లు వార్తలు వెలువడడం ఆందోళన కలిగిస్తున్నది. అయితే కేంద్ర విదేశాంగ శాఖ మాత్రం ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు. 'ఇరాన్‌లోని భారతీయుల పట్ల అక్కడి భారత రాయబార కార్యాలయం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది. ఇరాన్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని రక్షణ చర్యలు చేపడుతున్నాం' అని తెలిపింది.

# క్విడ్ ప్రోకో!

- రాజ్యసభకు మాజీ సీజేఐ జస్టిస్ గొగోయ్ నామినేషన్‌పై ప్రతిపక్షాల మండిపాటు
- అనుకూలంగా తీర్పులిచ్చినందుకేనని ధ్వజం
- పలువురు న్యాయమూర్తుల అసంతృప్తి
- రాజ్యసభ పోస్టుకు ఎందుకు సరేనన్నానో ప్రమాణం తర్వాత చెప్తా: గొగోయ్

**గువహటి:** భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌ని రాజ్యసభకు నామినేట్ చేయడంపై విపక్ష పార్టీలు మండిపడుతున్నాయి. కేంద్రం నిర్ణయం న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ విరుచుకుపడింది. కేంద్రానికి అనుకూల తీర్పులిచ్చినందుకే గొగోయ్‌కు రాజ్యసభ పదవి కట్టబెట్టారని మజ్లిస్ పార్టీ విరుచుకుపడింది. రాజస్థాన్ సీఎం, కాంగ్రెస్ నేత అశోక్ గెహ్లాట్ మాట్లాడుతూ.. కేంద్రం తాజా నిర్ణయం గొగోయ్ గతంలో ఇచ్చిన తీర్పుల పారదర్శకతపై అనుమానాల్ని రేకెత్తించేలా ఉన్నదన్నారు. 'గొగోయ్‌ను రాజ్యసభకు నామినేట్ చేసేముందు ప్రధాని మోదీ.. మాజీ న్యాయ మంత్రి అరుణ్ జైట్లీ సలహాను పరిశీలించారా? లేదా?' అని కాంగ్రెస్ నేతలు రణ్‌దీప్ సుర్జేవాలా, అభిషేక్ సింఘ్వీ ట్విటర్‌లో ప్రశ్నించారు. రిటైర్మెంట్ వయస్సు వచ్చినా, కొందరు జడ్జిలు రిటైరవ్వడానికి ఇష్టపడటంలేదని 2012లో కేంద్ర మాజీ అరుణ్ జైట్లీ అన్న మాటల్ని షేర్ చేస్తూ వాళ్లు ఈ వ్యాఖ్యలు చేశారు. గొగోయ్‌ని రాజ్యసభకు నామినేట్ చేయడాన్ని సీపీఎం ఖండించింది. ఈ నిర్ణయంతో న్యాయ వ్యవస్థ స్వతంత్రతను మోదీ సర్కార్ బలహీనపరుస్తున్నదన్నది.



**నైతికంగా దిగజారే అవకాశం**

గొగోయ్‌ని కేంద్రం రాజ్యసభకు నామినేట్ చేయడం పట్ల మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు అనుకూల తీర్పులతో సహకరించినందుకు రాజ్యసభ సీటిచ్చి సత్కరించారా..? అని కేంద్రాన్ని ప్రశ్నించారు. రామజన్మభూమి-అయోధ్య, రాఫెల్ కేసులలో కేంద్రానికి అనుకూలంగా తీర్పులిచ్చినందుకు ఆయనకు ఈ పదవినిచ్చి ఉండవచ్చని అసదుద్దీన్ అనుమానం వ్యక్తం చేశారు. గొగోయ్ నియామకాన్ని సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి ఖండించారు. గొగోయ్ నియామకం న్యాయ వ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీస్తుందని సుప్రీంకోర్టు మాజీ జస్టిస్ మదన్ బీ లోకుర్, కురైన్ జోసెఫ్, ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి ఆర్ ఎస్ సోఢీ విమర్శించారు. క్విడ్ ప్రోకో తరహాలో.. అధికారంలో ఉన్న వారికి అనుకూల తీర్పులిస్తే పదవులు దక్కుతాయన్న సందేశాన్ని ఈ చర్యలు తెలుపుతున్నాయని రిటైర్డ్ జడ్జి ఏపీ షా పేర్కొన్నారు.

**తర్వాత చెప్తా: గొగోయ్**

రాజ్యసభకు తన నామినేషన్‌పై విపక్ష పార్టీల విమర్శలపై మంగళవారం రంజన్ గొగోయ్ స్పందించారు. దీనిని అంగీకరించడానికి గల కారణాల్ని ప్రమాణ స్వీకారం చేశాక వెల్లడిస్తానన్నారు. తాను పార్లమెంట్‌లో ఉండటంతో చట్టం ముందు న్యాయవ్యవస్థ అభిప్రాయాల్ని వెల్లడించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## కమల్‌నాథ్‌కు నోటీసులు

- విశ్వాస పరీక్షపై సుప్రీంకోర్టు నిర్ణయం
- నేడు ఉదయం 10.30 గంటలకు విచారణ

**న్యూఢిల్లీ/ భోపాల్:** మధ్యప్రదేశ్‌లోని అత్యవసర పరిస్థితి దృష్ట్యా ఆ రాష్ట్ర సీఎం కమల్‌నాథ్‌కు, ఆ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ ఎన్పీ ప్రజాపతికి, అసెంబ్లీ ముఖ్య కార్యదర్శికి సుప్రీంకోర్టు మంగళవారం నోటీసులు జారీ చేసింది. కమల్‌నాథ్ సర్కార్‌ను తక్షణం విశ్వాస పరీక్ష నిర్వహణకు ఆదేశించాలని మాజీ సీఎం, బీజేపీ సీనియర్ నేత శివరాజ్ సింగ్ చౌహాన్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్‌లు డీవై చంద్రచూడ్, హేమంత్ గుప్తాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. దీనిపై వైఖరి తెలుపాలని సీఎం తదితరులను ఆదేశించింది. గవర్నర్ లాల్జీ టాండన్ ఆదేశాలను ఉల్లంఘిస్తూ విశ్వాస పరీక్షను చేపట్టకుండా కరోనా వైరస్ ఉధృతి నేపథ్యంలో ఈ నెల 26 వరకు స్పీకర్ వాయిదా వేశారని ఆరోపిస్తూ.. చౌహాన్ తదితరులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ రిట్ పిటిషన్‌పై బుధవారం ఉదయం 10.30 గంటలకు విచారణ జరుపుతామని ధర్మాసనం తెలిపింది. మరోవైపు రాజీనామా లేఖలను స్పీకర్‌కు పంపిన 16 మంది రెబెల్స్ తమను చౌహాన్ పిటిషన్‌లో ఇంప్లీడ్ అయ్యేందుకు వీలు కల్పించాలని మరో పిటిషన్ వేశారు. మరోవైపు తమ పార్టీ రెబెల్ ఎమ్మెల్యేలను కలుసుకునేందుకు కేంద్రం, కర్ణాటకలోని బీజేపీ ప్రభుత్వాలకు ఆదేశాలివ్వాలని కోరుతూ మధ్యప్రదేశ్ అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ చీఫ్ విప్ గోవింద్ సింగ్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.

## 'నిర్భయ' ఐసీజే పరిధిలోకి రాదు

**న్యూఢిల్లీ:** నిర్భయ కేసులో ఉరిశిక్ష పడిన నలుగురు ఖైదీలకు ఈ నెల 20న మరణశిక్ష అమలును నిలిపివేస్తూ అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) స్టే మంజూరు చేయలేదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ పేర్కొన్నారు. ఈ కేసులో ఆదేశాలు జారీ చేయడానికి ఐసీజేకు అధికారం లేదని మంగళవారం తెలిపారు. కాగా, ఈ కేసులో దోషి అక్షయ్ కుమార్ క్షమాభిక్ష కోసం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు రెండోసారి పిటిషన్ పెట్టుకున్నాడు. కాగా, ఈ కేసులో ఉరిశిక్ష పడనున్న ఖైదీ అక్షయ్ భార్య పునీత.. బీహార్‌లోని ఔరంగాబాద్ జిల్లా కోర్టులో తన భర్త (అక్షయ్) నుంచి విడాకులు కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. కాగా, శుక్రవారం ఉదయం 5.30 గంటలకు నిర్భయ దోషులకు ఉరిశిక్షను అమలు చేయడం కోసం మీరట్ జైలు తలారి పవన్ జల్లాద్ మూడు రోజుల ముందే తీహార్ జైలుకు చేరుకున్నారు. మరోవైపు ఉరిశిక్ష అమలుకు, ఒక రోజు ముందు దోషుల బరువుతో సమానంగా ఉండే ఇసుక బస్తాలతో నమూనా ఉరి (డమ్మీ హ్యాంగింగ్) నిర్వహించనున్నారు.

## ఆర్థిక సునామీ రాబోతున్నది: రాహుల్

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్‌తోపాటు ఆర్థిక విధ్వంసాన్ని ఎదుర్కొనేందుకు భారత్ తప్పనిసరిగా సిద్ధం కావాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశంపైకి దూసుకొస్తున్న 'ఆర్థిక సునామీ'తో జరిగే వినాశనం కోట్ల మంది ప్రజలపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం పార్లమెంట్ బయట ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ కండ్లు తెరువాలని.. ఆర్థిక సంక్షోభంతో దేశ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. 'భారీ (ఆర్థిక) సునామీ వస్తుందని నేను ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా. వాళ్లు (ప్రభుత్వం) వెర్రి వాళ్ల మాదిరిగా వ్యవహరిస్తున్నారు. దీనిపై ఏం చేయాలో వారికి స్పష్టత లేదు. వచ్చే ఆరు నెలల్లో ప్రజలు అనూహ్య బాధలు ఎదుర్కోబోతున్నారు' అని ఆందోళన వ్యక్తం చేశారు. 'మన ఆర్థిక వ్యవస్థ శక్తి సామర్థ్యాలు నాకు తెలుసు. వీరు (ప్రభుత్వ పెద్దలు) మన శక్తి సామర్థ్యాలను నమ్మడం లేదు. మూడీస్, స్టాండర్డ్ అండ్ పూర్, (డొనాల్డ్) ట్రంప్ రేటింగ్‌పై ఆధారపడతారు' అని ఎద్దేవా చేశారు.

**భారత ప్రభుత్వం**
**ఆర్థిక మంత్రిత్వ శాఖ, వ్యయాల విభాగం,**
**ప్రజా ఆర్థిక నిర్వహణ వ్యవస్థ,**
**స్టేట్ డైరెక్టరేట్, తెలంగాణ రాష్ట్రం**
**1వ అంతస్తు, రూమ్ నెం. 113-116, కేంద్రీయ సదన్, కోఠి-500 095**

**గమనిక**

కేంద్ర మరియు కేంద్ర ప్రాయోజిత పథకాల కొరకు భారత ప్రభుత్వం నుండి గ్రాంట్లు/నిధులు పొందే తెలంగాణ రాష్ట్రంలోగల తెలంగాణ ప్రభుత్వ అన్ని శాఖలు/అమలు చేసే ఏజెన్సీలు/సంస్థలు/NGOలు PFMS యొక్క EAT మాడ్యూల్ ద్వారా వ్యయం దాఖలు చేయుట కొరకు ఈ కార్యాలయాన్ని (గతంలో SPMU, తెలంగాణ రాష్ట్రంగా పిలువబడేది) సంప్రదించవచ్చును.
ఏవైనా విచారణలు మరియు శిక్షణ అభ్యర్థనలను **హెల్ప్ డెస్క్ సంప్రదించు నెం. 040-24616277|ఇ-మెయిల్ ఐడి: tlpfms@gmail.com**కు పంపవచ్చును.

సం/-
**సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్**



ఇంటి దగ్గరే ఉండవలసి రావడం మనకు కొత్త అనుభవం. కానీ బలవంతంగానైనా సరే మన గాయాలను మాన్పుకోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి ఇదే మంచి సమయం. దేవుడి దయవల్ల మనకు కుటుంబంతో కలిసి ఉండే అవకాశం లభించింది.

**కపిల్‌దేవ్, భారత మాజీ క్రికెటర్**

జాతి నిర్మాణం కోసం శాసన, న్యాయశాఖలు కలిసి పనిచేయాలనేదే నా దృఢ నమ్మకం. నేను పార్లమెంటులో ఉండటం వల్ల అక్కడ న్యాయవ్యవస్థ అభిప్రాయాలు వెల్లడిస్తాను. ఇదేవిధంగా న్యాయవ్యవస్థకు శాసనశాఖ అభిప్రాయాలు తెలియజేస్తాను.

**రంజన్ గొగోయి, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి**



### చరిత్రలో నేడు



**1890**

జర్మనీ చక్రవర్తితో విభేదాల మూలంగా రాజీనామా చేసిన చాన్స్‌లర్ బిస్మార్క్.

**1920**



గ్రిగారియన్ క్యాలెండర్‌ను స్వీకరించిన గ్రీసు.



**1922**

శాసనోల్లంఘనకు పాల్పడినందుకు మహాత్మా గాంధీకి ఆరేండ్ల జైలు శిక్ష విధించిన బ్రిటిష్ న్యాయమూర్తులు.

చైనాతో ఎటువంటి సంబంధాలను కలిగి ఉండాలనేది తైవాన్‌లో ఎప్పుడూ చర్చనీయాంశమవుతూ ఉంటుంది. చైనాకు వ్యతిరేకంగా, తైవాన్ స్వతంత్రతను కాంక్షించే డెమొక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ రెండవసారి కూడా విజయం సాధించడంతో, ప్రతిపక్షమైన కోమిన్‌టాంగ్ పార్టీలో అంతర్మథనం మొదలైంది. కోమిన్‌టాంగ్‌కు చైనా అనుకూల పార్టీగా గుర్తింపు ఉన్నది. కోమిన్‌టాంగ్ చైర్మన్‌గా 48 ఏండ్ల చియాంగ్ చి చెన్ పగ్గాలు చేపట్టడంతో పార్టీ కొత్త బాట పట్టే సూచనలు కనిపిస్తున్నాయి.

**సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్**

కరోనా వైరస్‌ను అరికట్టడానికి సార్క్‌లోని ఎనిమిది దేశాలు ఏకతాటి మీదికి వచ్చాయి. సభ్యదేశాల మధ్య వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడానికి చొరవ చూపినందుకు భారత ప్రధాని మోదీ అభినందనీయులు. సార్క్ దేశాల మధ్య తీవ్ర విభేదాలుండటం వల్ల కలిసికట్టుగా అభివృద్ధి చెందలేకపోతున్నాయి. ఈ సమావేశం మూలంగానైనా సార్క్ దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, పర్యాటకం తదితర రంగాల్లో సహకారం కొనసాగుతుందని ఆశిద్దాం. ఈ ప్రాంత దేశాల అభివృద్ధికి విస్తృతస్థాయిలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలి.

**ది హిమాలయన్ టైమ్స్**



# సార్క్ సౌభ్రాతృత్వం

దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంస్థ (సార్క్) పునరుజ్జీవనానికి కరోనా వైరస్ పరోక్ష దోహదకారిగా మారుతున్నది. బద్ధ శత్రువులైనా ఆపద సమయాల్లో దగ్గరవుతారన్న నానుడిని నిజం చేస్తూ ఇన్నాళ్లూ ఎడమొఖం, పెడమొఖంగా ఉన్న దేశాలు ఏకతా టిపైకి వచ్చి చేయిచేయి కలుపుతున్నాయి. దక్షిణాసియా దేశాల్లో వైరస్ విస్తరించకుండా కట్టడి చేసేందుకు కలిసి నడువటానికి సమాయత్తమవుతున్నాయి. పాకిస్థాన్‌తో సహా సార్క్ సభ్యదేశాలన్నీ భారత్ పిలుపునకు సానుకూలంగా స్పందించాయి. దేశ దేశాలను వణికిస్తున్న కోవిడ్-19ని ఎదుర్కోవటం కోసం సార్క్ దేశాల మధ్య పరస్పర సహకారం అవసరమని ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపునకు సార్క్ దేశాధినేతల నుంచి తక్షణ స్పందన లభించింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా మోదీ ప్రతిపాదించిన వెంటనే సార్క్ సభ్యదేశాధినేతలంతా దృశ్య మాధ్యమ సదస్సులో భాగస్వాములవటం ముదావహం.

సార్క్ దేశాల మధ్య గత నాలుగేండ్లుగా సయోధ్య లేదు. భారత్‌లో 'యురి' ఉగ్రదాడి నేపథ్యంలో 2016లో పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో జరుగాల్సిన సార్క్ సదస్సును భారత్‌తో సహా మిగతా సభ్య దేశాలన్నీ బహిష్కరించాయి. పాకిస్థాన్ తన భూభాగాన్ని ఉగ్రవాదానికి స్థావరంగా చేయటం మానేయాలని డిమాండ్ చేశాయి. ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసినప్పుడు మాత్రమే టెర్రరిజానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరులో పాక్ పాత్రను విశ్వసిస్తామని తేల్చి చెప్పాయి. అప్పటినుంచి ఈ ప్రాంతీయ కూటమి ద్వారా సాగే దౌత్య, రాజకీయ సంబంధాలు నామమాత్రంగా మిగిలిపోయాయి. ప్రాంతీయాభివృద్ధి, వర్తక వాణిజ్యాల కోసం సభ్యదేశాల మధ్య అత్యున్నత రాజకీయచర్చలు జరుగాలని శ్రీలంక, నేపాల్, మాల్దీవులు అప్పటినుంచీ కోరుతున్నాయి. కానీ దానికి తగిన రాజకీయ వాతావరణం లేదని భారత్ చెబుతూ వచ్చింది. కోరలు చాస్తున్న కోవిడ్ కాటునుంచి దక్షిణాసియా ప్రాంతాన్ని సంరక్షించుకోవాలంటే ముందస్తు చర్యలు అవసరమని గుర్తించిన భారత్ తగురీతిన చొరవ తీసుకున్నది. సార్క్ సభ్యదేశాలైన ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, ఇండియా, మాల్దీవులు, నేపాల్, పాకిస్థాన్, శ్రీలంక దేశాల అధినేతలతో వీడియో కాన్ఫరెన్స్‌కు ప్రతిపాదించింది. మోదీ ప్రతిపాదనకు సార్క్ నేతలంతా స్వల్పవ్యవధిలోనే స్పందించారు. నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీ శస్త్రచికిత్స చేసుకొని దవాఖాన నుంచి బయటకు వచ్చిన మరునాడే పాలుపంచుకోవడాన్ని బట్టి సదస్సుకు లభించిన ప్రాధాన్యం అవగతమవుతున్నది. పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ మాత్రం నేరుగా భాగస్వామి కాకుండా ఆరోగ్యరంగ సలహాదారు జాఫర్ మీర్జాను నియోగించారు. ఎప్పటిలాగే ఈ సందర్భంగా కూడా పాకిస్థాన్ రాజకీయ ప్రస్తావనలు చేసి వక్రబుద్ధిని చాటుకున్నది. మానవాళికి ప్రమాదం ముంచుకొస్తున్న పరిస్థితుల్లో కూడా మానవీయంగా స్పందించేబదులు రాజకీయాలు చేయటం గర్హనీయం.

> **చైనా తర్వాత జనసాంద్రత ఎక్కువ కలిగిన దక్షిణాసియాలో వైరస్ విస్తరిస్తే పెను ఉపద్రవమే. సార్క్ దేశాలన్నింటా ఒకేవిధమైన వాతావరణ పరిస్థితులుంటాయి. జీవనరీతులు, ప్రమాణాలు కూడా దాదాపుగా ఒకే స్థాయిలో ఉంటాయి. అయినా ఈ దేశాల్లో ఒక్కో దేశానిది ఒక్కో సమస్య. మాల్దీవులకు వైరస్‌ను నిలువరించే ఆర్థిక, వైద్య, శాస్త్రపరిజ్ఞానం తగినంతగా లేదు. నిధుల కొరత సరేసరి. శ్రీలంక, భూటాన్ లాంటి దేశాలు చిన్నవైనా టూరిజం గణనీయంగా ఉంటుంది. గరిష్ఠ స్థాయిలో ప్రపంచ దేశాలనుంచి సందర్శకులుంటారు. కాబట్టి వైరస్ విస్తరణ ప్రమాదం ఎక్కువ.**

చైనా తర్వాత జనసాంద్రత ఎక్కువ కలిగిన దక్షిణాసియాలో వైరస్ విస్తరిస్తే పెను ఉపద్రవమే. సార్క్ దేశాలన్నింటా ఒకేవిధమైన వాతావరణ పరిస్థితులుంటాయి. జీవనరీతులు, ప్రమాణాలు కూడా దాదాపుగా ఒకే స్థాయిలో ఉంటాయి. అయినా ఈ దేశాల్లో ఒక్కో దేశానిది ఒక్కో సమస్య. మాల్దీవులకు వైరస్‌ను నిలువరించే ఆర్థిక, వైద్య, శాస్త్రపరిజ్ఞానం తగినంతగా లేదు. నిధుల కొరత సరేసరి. శ్రీలంక, భూటాన్ లాంటి దేశాలు చిన్నవైనా టూరిజం గణనీయంగా ఉంటుంది. గరిష్ఠస్థాయిలో ప్రపంచ దేశాలనుంచి సందర్శకులుంటారు. కాబట్టి వైరస్ విస్తరణ ప్రమాదం ఎక్కువ. ఈ దేశాలన్నింటా విస్తారంగా ఉన్న గ్రామీణ వెనుకబడిన ప్రాంతాల్లో వైరస్ మరింత ప్రమాదభరితంగా మారే అవకాశం ఉన్నది. అందుకే కోవిడ్-19ను నిలువరించటం కోసం ప్రధాని మోదీ ఇప్పటికే కోటి డాలర్ల సాయాన్ని ప్రకటించి, మిగతా దేశాలకు మార్గదర్శకంగా నిలిచారు. పొరుగు దేశాల వినతి మేరకు వైద్య బృందాలను పంపేందుకు సంసిద్ధతను వ్యక్తం చేశారు. మాల్దీవుల విజ్ఞప్తి మేరకు 48 గంటల్లోనే భారత్ అత్యవసర వైద్యసిబ్బందిని పంపించింది. ఇరాన్ చేసిన వినతులను కూడా మానవతా దృక్పథంతో పరిశీలిస్తున్నట్లు భారత్ తెలిపింది. కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు ప్రధాని మోదీ తీసుకున్న చొరవను అమెరికా, రష్యా దేశాధినేతలు కూడా శ్లాఘించటం గమనించదగినది. సార్క్ తరహాలో జీ-20 దేశాలు కూడా ఆన్‌లైన్ యంత్రాంగంతో అనుసంధానమవ్వాలని భారత్ ప్రతిపాదించింది. ఇది భారత్ బాధ్యతాయుత వైఖరికి నిదర్శనం. కేవలం కోవిడ్‌ను ఎదుర్కొనడానికే పరిమితం కాక సార్క్ మరింత ముందడుగు వేయాలి. సార్క్ దేశాల మధ్య అన్నిరంగాల్లో సహకారం నెలకొనాలె. ఇదే దక్షిణాసియాకు శ్రీరామ రక్ష!

**జనగళం**

## కరోనా క్యా హోనా?

**కరోనా భయం కళ్ళల్లో**
ముఖంలో ప్రస్ఫుటమవుతోంది

మనుషులను భౌతికంగా
విడదీసిన కరోనా
మనసులను దగ్గర చేసింది

కరోనా యుద్ధానికి
ప్రపంచమంతా బలైనా
ఖండాంతరాలను కలిపింది

అణ్వాయుధాలు వదలకున్నా
మనిషి జాతి మీద కరోనా
జీవాయుధాలను విసిరింది

మనిషి పుట్టుక
ఏ దేశంలోనైనా
చావు మాత్రం అందరిదీ అయ్యింది

మానవజాతి మనుగడకు
ప్రమాద ఘంటికలు మ్రోగించిన కరోనా
జాతి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తోంది

చైనాలో పుట్టిన కరోనా
అగ్రరాజ్యాల వెన్నులో
వణుకు పుట్టిస్తోంది

బాల్కనీల నుంచి చావుకేకలు
వీధుల్లో పొరాడుతున్నాయి
నిరంతరం ప్రవహించే జనప్రవాహం
నయాగారా మంచు జలపాతంలా
స్థంభించిపోయింది

గాలికి పెట్టిన దీపాల్లా
మనుషుల ప్రాణాలు
గాల్లో కలిసిపోతున్నాయి

జాతి మొత్తం ఏకమై
కరోనా భూతాన్ని తరిమేద్దాం!
స్వచ్ఛ ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ
వైరస్ లేని సమాజాన్ని నిర్మిద్దాం!!

**– వారణాశి భానుమూర్తిరావు**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

తెలంగాణం



**గటిక విజయ్‌కుమార్**

# ఫలించిన ఆర్థికవ్యూహం

**1940 దశకంలో బెంగాల్‌లో తీవ్ర కరువు వచ్చింది. లక్షలాదిమంది ఆకలికి అలమటించి చనిపోయారు. దేశంలో, బెంగాల్లో తిండిగింజలు లేక కాదు. వాటిని కొనుగోలుశక్తి లేకనే ఆకలిచావులు సంభవించాయి. ఆ ఆకలి బాధలను చవిచూసిన అమర్త్యసేన్ ప్రజల కొనుగోలుశక్తిని పెంచడమే మంచి ఆర్థికవిధానం అన్నారు. 1991లో ప్రధాని పీవీ ఆర్థిక సంస్కరణలను అమలుచేశారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. ఫలితంగా సంపద పెరిగి, పేదరికం తగ్గింది. సంపద ఒనగూరింది కాబట్టి, సంక్షేమ పథకాలను అమలుచేయగలిగామని, ఆకలిచావులు తగ్గాయన్నది కొందరు ఆర్థికవేత్తల వాదన.**

సంపద సృష్టించాలంటే వ్యవసాయం, సంక్షేమరంగాల్లో పెట్టుబడులు తగ్గించాలని ఆర్థికవేత్తలు ప్రతిపాదించారు. పారిశ్రామికీకరణ, పట్టణీకరణ పెరుగాలని, సేవారంగాలు విస్తరించాలన్నారు. ఇలా రెండురకాల ఆర్థిక నమూనాలు 2014 నాటికి మనముందున్నాయి.

కొత్తగా ఏర్పడిన ఏ దేశానికైనా, రాష్ట్రానికైనా ఏ ఆర్థిక విధానం ఎంచుకోవాలనే సందిగ్ధత ఏర్పడుతుంది. అమెరికా-రష్యా ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో ప్రపంచదేశాలు పెట్టుబడిదారీ-సామ్యవాద ఆర్థికవ్యవస్థలుగా విభజింపబడి ఉన్నాయి. భారత్ వీటికి భిన్నంగా మిశ్రమ ఆర్థిక వ్యవస్థను ఎంచుకున్నది. వలసపాలనలో నలిగిపోయిన దేశాన్ని తీర్చిదిద్దడానికి ఈ నవీన విధానం దోహదపడింది. ఆ తర్వాత ప్రపంచవ్యాప్తంగా, మరీ ముఖ్యంగా భారత్‌లో రెండురకాల ఆర్థికవిధానాలు ప్రాచుర్యం పొందాయి. ఇవి వృద్ధి-పంపిణీ విషయంలో భిన్నమార్గాలను సూచించాయి. ప్రజల కొనుగోలుశక్తిని పెంచడం ద్వారా ఆర్థికవ్యవస్థ పరిపుష్టం అవుతుందని అమర్త్యసేన్ లాంటి సామ్యవాద ఆర్థికవేత్తలు ప్రతిపాదించారు. సంపద పెరుగాలని, దానివల్ల ప్రజలు బాగుపడుతారని అరవింద పనగారియా లాంటి ఆర్థికవేత్తలు నమ్మారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి ఈ రెండు విధానాల్లో దేన్ని ఎంచుకోవాలనే మీమాంస కేసీఆర్ ప్రభుత్వం ముందుంది. అప్పటివరకు తెలంగాణ సమాజం పరాయిపాలనలో బాగా చితికి ఉన్నది. ఆర్థికంగా, సామాజికంగా తెలంగాణను నిలబెట్టడానికి, భవిష్యత్తుకు బాటలు వేయడానికి తగు మార్గాన్ని కేసీఆర్ ఎంచుకోవాల్సి వచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ ఓ ఇంజినీర్‌లాగా పనిచేశారన్నది తెలిసిందే. ఆర్థికవిధానాన్ని రూపొందించడంలో కూడా కేసీఆర్ ఆరితేరిన ఆర్థిక వేత్తగా సరికొత్త పంథాను ఎంచుకున్నారు. సంపద పెంచే విధానాలు అనుసరించాలా? పేదల కొనుగోలు శక్తి పెంచాలా? అనే రెండు విధానాలకు మధ్యస్థంగా, 'సంపద పెంచాలి-పేదలకు పంచాలి' అనే విధానం తీసుకున్నారు. కేసీఆర్ రాష్ట్ర సంపద పెరుగడానికి చర్యలు తీసుకుంటూనే, పేదల కొనుగోలు శక్తి పెంచదలిచారు. ముందుగా ప్రజలకు జీవనభద్రత కల్పించడానికి చర్యలు తీసుకున్నారు. పేదలు కడుపునిండా అన్నం తినడానికి మించిన ప్రగతి కేసీఆర్‌కు మరెందులోనూ కనిపించలేదు.

ఆత్మహత్యలు, ఆకలిచావులు, వలసలు, సాగునీటికి గోస, మంచినీటికి కటకట, కరెంటు లేక చిమ్మచీకట్లు, అప్పుల ఊబిలో రైతులు, వృత్తులు కోల్పోయిన బీసీలు, కుదేలైన గ్రామీణ ఆర్థికవ్యవస్థ-ఇదీ తెలంగాణ ఏర్పడిన నాటి దృశ్యం. ఈ దురవస్థ నుంచి తెలంగాణ సమాజాన్ని ముందు బయటపడేయాలి. అప్పుడే వారు ఉత్పాదక శక్తులుగా మారుతారు అని కేసీఆర్ ఆలోచించారు. అందుకే ఆసరా పింఛన్లు మొదటి రోజుల్లోనే నాలుగింతలు పెంచారు. రైతుబంధు ద్వారా పెట్టుబడి సాయమందించారు. సాగునీటిరంగాన్ని అభివృద్ధి పరిచారు. కుల, చేతివృత్తుల వారికి ఆర్థిక ప్రోత్సాహం అందించారు. దీంతో ఆత్మహత్యలు తగ్గాయి. ఆకలి చావులు కనుమరుగయ్యాయి. వలసలు ఆగిపోయాయి. 24 గంటల కరెంటు వల్ల వ్యవసాయం, పారిశ్రామికరంగం బాగుపడి ఉపాధి అవకాశాలు పెరిగాయి. మంచినీటి కష్టాలు, కరెంటుకోతలు తొలిగిపోయాయి. పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య ఉచితంగా అందుతున్నది. ప్రభుత్వ దవాఖానల్లో పేదలకు మంచి వైద్యం అందుతున్నది. రైతుల,



చేనేతకార్మికుల రుణమాఫీ, గృహరుణాల రద్దు, నీటి తీరువా రద్దు, ఆటోలు-ట్రాక్టర్లకు రవాణా పన్ను రద్దు, ఎస్సీ ఎస్టీలకు 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లాంటి నిర్ణయాల వల్ల పేదలకు ఆర్థికభారం తగ్గింది. వీటి వల్ల ఆదా అయిన డబ్బు, ఆసరా పింఛన్లు, రైతుబంధు వంటి పథకాల ద్వారా చేతికందిన నగదుతో ప్రజల కొనుగోలుశక్తి పెరిగింది. తత్ఫలితంగా తెలంగాణ సంపద పెరిగింది.

కరెంటు, సాగునీరు పుష్కలంగా అందడం వల్ల రైతులు పెద్ద ఎత్తున పంటలు పండిస్తున్నారు. గతంలో యాసంగిలో 17 లక్షల ఎకరాలకు మించి సాగు చేయలేదు. కానీ నేడు 38 లక్షల ఎకరాల్లో వరి సాగవుతున్నది. 2014-15లో వరి పంట 34,96,087 ఎకరాల్లో సాగయింది. 68,16,662 టన్నుల పంట పండింది. అప్పుడు ఆ పంట విలువ రూ.9,270 కోట్లు. 2019-20 సంవత్సరంలో వరిపంట 78,46,619 ఎకరాల్లో సాగయింది. 2,23,18,576 టన్నుల పంట పండింది. దీని విలువ 40.50 వేల కోట్ల రూపాయలు. అంటే ఐదేండ్లలో వరి ద్వారా రైతుల ఆదాయం 340 శాతం పెరిగింది. ఈ విధంగా వ్యవసాయానికి పెట్టుబడులు నిరర్థకం అని వాదించే నోళ్ళను మూయించింది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.

తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాల వల్ల, ఆత్మహత్యలను, ఆకలి చావులను, వలసలను నిరోధించడం వల్ల మానవ వనరులను సద్వినియోగం చేసుకొని, వారిని సంపద సృష్టించే శక్తులుగా మార్చగలిగింది. తెలంగాణ ఏర్పడకముందు పేదల ఇండ్లల్లో ఒక్క రూపాయి బిళ్ల కూడా దొరుకకపోయేది. కానీ నేడు ఏ ఇంటికి పోయిచూసినా కొన్ని వేల రూపాయలుంటున్నాయి. ఆసరా పింఛన్ల ద్వారా 2019-20 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రాష్ట్రంలో 42,470 రూపాయల నగదు పేదలకు అందింది. 2020-21లో మరో 11,758 కోట్ల రూపాయల నగదు అందుతుంది. అంటే మొత్తం 54,228 కోట్ల రూపాయలు.

రైతుబంధు ద్వారా 2019-20 ఆర్థికసంవత్సరం గడిచేసరికి 22,480 కోట్ల నగదు రైతులకు అందింది. 2020-21లో మరో 14 వేల కోట్లు వెళ్తాయి. అంటే మొత్తం 36,480 కోట్ల రూపాయలు. ఒక్కో రైతు జేబులో పడేది 72 వేల రూపాయలు. రెండు విడుతల రుణమాఫీ ద్వారా ప్రభుత్వం 42,214 కోట్లను రైతులకు ఆదా చేస్తున్నది. ఇవే కాకుండా కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్స్, వ్యవసాయ సబ్సిడీలు, రైతుబీమా, ఎక్స్‌గ్రేషియాలు, పునరావాస పథకాలు, గొర్రెలు, చేపలు, బర్రెల పంపిణీ తదితర కార్యక్రమాల ద్వారా పేదలకు డబ్బు వచ్చింది. ఈ విధంగా పేదల కొనుగోలుశక్తిని ప్రభుత్వం పెంచింది. సంపద పెంచే పారిశ్రామికీకరణ, పట్టణీకరణను కూడా ప్రభుత్వం పట్టించుకున్నది.

'సంపద పెంచాలి-పేదలకు పంచాలి' అనే విధానం ఫలితంగా పేదల బతుకులు బాగుపడటమే కాదు, రాష్ట్ర సంపద పెరిగింది. దేశవ్యాప్తంగా ఆర్థికమాంద్యం నెలకొన్నప్పటికీ, పలు రాష్ట్రాల్లో తిరోగమన వృద్ధిరేటు ఉన్నప్పటికీ తెలంగాణ రెవెన్యూ వృద్ధిలో ముందుకుపోతున్నది. జీఎస్డీపీ, తలసరి ఆదాయం, రెవెన్యూ వృద్ధిరేటు, పెట్టుబడి వ్యయం, తలసరి విద్యుత్ వినియోగం లాంటి అంశాలను ప్రగతి సూచికలుగా గుర్తిస్తారు. ఈ అన్నింటిలో తెలంగాణ అగ్రగామిగా నిలువడం కేసీఆర్ వ్యూహాత్మక ఆర్థిక విధాన ఫలితమే.

తెలంగాణ ఆరేండ్లలో సాధించిన ప్రగతి ఫలితంగా తననుతాను తీర్చిదిద్దుకోవడమే కాదు, దేశాభివృద్ధికి ఆర్థికచేయూతను అందిస్తున్నది. 2014 నుంచి 2019 మార్చి వరకు తెలంగాణ ప్రజలు పన్నుల ద్వారా 2,72,926 కోట్ల రూపాయలను కేంద్రానికి పంపారు. 1,12,854 కోట్ల రూపాయలు డెవల్యూషన్ ద్వారా మళ్లీ మన రాష్ట్రానికి వచ్చాయి. అంటే నికరంగా మన రాష్ట్ర ప్రజలు గడిచిన ఐదేండ్లలో 1,60,072 కోట్లను దేశాభివృద్ధికి నిధిగా అందించారు. తెలంగాణ ఒక రాష్ట్రంగా మనుగడ సాగిస్తుందా? అనే ప్రశ్నలకు జవాబు చెప్పడమే కాదు, తెలంగాణ నమూనానే ఇప్పుడు దేశానికి ఆదర్శంగా నిలువడం అసాధారణం.

రెండవ ప్రపంచయుద్ధంలో బూడిదగా మారిన దుస్థితి నుంచి ఫీనిక్స్ పక్షిలాగా జవసత్వాలు ప్రోగు చేసుకొని శరవేగంగా ఆకాశమంత ఎత్తు ఎదిగిన జపాన్ దేశ ప్రస్థానం లాంటిదే తెలంగాణ అనుభవం. దాదాపు ఆరు దశాబ్దాల పరాయిపాలన తెలంగాణ ప్రాంతాన్ని నిజంగానే బూడిద చేసింది. అలా అంపశయ్యపై ఉన్న తెలంగాణ శరవేగంగా కోలుకొని, లేచి పరిగెత్తి, నేడు దేశంలోనే పటిష్టమైన ఆర్థికశక్తిగా మారింది. దీనికి వ్యూహకర్త, కార్యకర్త కేసీఆర్ మాత్రమే.

> **పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య ఉచితంగా అందుతున్నది. ప్రభుత్వ దవాఖానల్లో పేదలకు మంచి వైద్యం అందుతున్నది. రైతుల, చేనేతకార్మికుల రుణమాఫీ, గృహరుణాల రద్దు, నీటి తీరువా రద్దు, ఆటోలు-ట్రాక్టర్లకు రవాణా పన్ను రద్దు, ఎస్సీ ఎస్టీలకు 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లాంటి నిర్ణయాల వల్ల పేదలకు ఆర్థికభారం తగ్గింది. వీటి వల్ల ఆదా అయిన డబ్బు, ఆసరా పింఛన్లు, రైతుబంధు వంటి పథకాల ద్వారా చేతికందిన నగదుతో ప్రజల కొనుగోలుశక్తి పెరిగింది. తత్ఫలితంగా తెలంగాణ సంపద పెరిగింది.**

# 'విభజన' అమలులోనూ వివక్ష

జాతీయం



**ఇనగంటి రవికుమార్**

ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే చట్టం నినాదంతో బీజేపీ రెండవసారి అధికారం చేపట్టగానే ఆర్టికల్ 370ని రద్దుచేస్తూ, జమ్ము కశ్మీర్‌ను విభజిస్తూ పునర్విభజన చట్టం తెచ్చింది. అయితే కేంద్రం ఈ పునర్విభజన చట్టాన్ని, ఏపీ పునర్విభజన చట్టాన్ని అమలుచేయడంలో ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తున్నది. తాజాగా రాత్రికిరాత్రి సీట్ల పెంపు అంశాన్ని ఏపీ పునర్విభజన బిల్లులో చేర్చారని హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపణలు చేశారు. కానీ 2013లోనే కేంద్ర క్యాబినెట్‌లో అసెంబ్లీ స్థానాల పెంపును ప్రతిపాదించారు. ఏపీ పునర్విభజన బిల్లును రాష్ట్రపతి ఏపీ అసెంబ్లీ పరిశీలనకు పంపినప్పుడు కూడా ఈ అంశం ఉన్నది. ఫిబ్రవరి 13న ఈ బిల్లును లోక్‌సభలో పెట్టి 18న రాజ్యసభలో పెట్టి ఆమోదించారు. ఈ వాస్తవాలను మననం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది.

జమ్ము కశ్మీర్ విభజన చట్టంలో అసెంబ్లీ స్థానాలను 107 నుంచి 114కి పెంచాలని నిర్దేశించారు. ఏపీ పునర్విభజన చట్టం సెక్షన్ 26లో తెలంగాణ అసెంబ్లీ సీట్లను 119 నుంచి 153కు, ఏపీలో సీట్లను 175 నుంచి 225కు పెంచాలని పేర్కొన్నారు. అయితే గత ఐదేండ్లుగా ఎన్డీయే ప్రభుత్వం వింత వాదన చేస్తున్నది. ఆర్టికల్ 170(3) ప్రకారం 2026 సంవత్సరం వరకు అసెంబ్లీ స్థానాలు పెంచకూడదని, పెంచాలంటే రాజ్యాంగ సవరణ చేయాలని చెబుతున్నది. అదే జమ్ము కశ్మీర్ విషయంలో పునర్విభజన చట్టంలో అసెంబ్లీ స్థానాల పెంపు, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించటం పునర్విభజన కమిషన్ ఏర్పాటు అంశాలను నిర్దేశించింది. వీటి అమలుకు అడ్డుగా ఉన్న ఆర్టికల్ 170 క్లాజ్-3ను రాజ్యాంగ సవరణ ద్వారా సవరించకుండా, దీనిలో ఏవీ ఉన్నప్పటికీ అవి పరిగణనలోకి రావని చేర్చింది. అలాగే '2026 తర్వాత వచ్చే తొలి జనగణనతో పునర్విభజన (సీట్ల పెంపు) చేయాల'న్న రాజ్యాంగ నిబంధనలో మార్పులు చేసి దాని స్థానంలో '2011 జనాభాతో' అన్న పదాలు చేర్చి, కేవలం కశ్మీర్ విభజన చట్టంతోనే అసెంబ్లీ సీట్ల పెంపును చట్టంలో నిర్దేశించారు. అక్కడితో ఆగకుండా కేంద్రం మార్చి 6న కేంద్ర న్యాయశాఖ పునర్విభజన కమిషన్‌ను ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి రంజన్ ప్రకాశ్ దేశాయ్‌ని చైర్మన్‌గా, భారత ఎన్నికల కమిషనర్ సుశీల్ చంద్రను సభ్యులుగా మరొక అధికార సభ్యుడిగా ఆయా రాష్ట్రాల రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను నియమించింది. జమ్ము కశ్మీర్‌లో సీట్ల పెంపుతో పాటు, (2008లో నిలిపివేయబడిన) అసోం, అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, నాగాలాండ్ రాష్ట్రాల్లో కూడా అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ చేపట్టేవిధంగా ఏడాది కాలపరిమితితో ఈ కమిషన్‌ను నియమించింది.

రాజ్యాంగంలోని 3వ అధికరణ కింద రాష్ట్ర విభజన చట్టం రూపొందించారని, అందులోని సెక్షన్ 26లోని 'సబ్జెక్ట్ టు ప్రొవిజన్' స్థానంలో 'నాట్‌విత్ స్టాండింగ్ కంటైయిన్డ్ ఆఫ్ ది ఆర్టికల్ 170 క్లాజ్ 3' అని చేర్చి పార్లమెంట్‌లో చట్టసవరణ లేదా కేంద్రం క్యాబినెట్ ఆమోదించడం ద్వారా సీట్ల పెంపుదల అమల్లోకి తీసుకువచ్చారని కేంద్ర మాజీ సమాచార ప్రధాన కమిషనర్ మాడభూషి శ్రీధర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు పలు సుప్రీంకోర్టు తీర్పులను ఉదహరిస్తూ నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించినప్పటికీ కేంద్ర వైఖరిలో ఎలాంటి మార్పు లేదు. సీట్ల పెంపుదల ప్రక్రియ అడుగు ముందుకుపడలేదు.

బీజేపీకి రాజకీయ అవసరం జమ్ము కశ్మీర్‌లో ఉన్నందున ఆర్టికల్ 3 ప్రకారం ఏర్పడింది. కాబట్టి రాష్ట్ర విభజన చట్టంతోనే సీట్ల పెంపుదల ప్రక్రియ మొదలుపెడుతున్నారు. అంటే తెలంగాణలో, ఏపీలో అసెంబ్లీ సీట్లు పెంచాలంటే రాజ్యాంగసవరణ కావాలి. కశ్మీర్, సిక్కిం (తాజాగా 32 నుంచి 40 అసెంబ్లీ స్థానాలు పెంచేందుకు కేంద్ర హోంశాఖ ముసాయిదా ప్రకటించి క్యాబినెట్ నోట్ కూడా పంపించారు)లలో మాత్రం విభజన చట్టం ప్రాతిపదికగానే అమలుచేయడం పూర్తిగా వివక్షపూరిత నిర్ణయంగానే భావించాలి. జమ్ము కశ్మీర్‌లో 107 నుంచి 114కు పెరుగుతున్నప్పటికీ ప్రత్యేకించి జమ్ము రీజియన్లో ఎక్కువ స్థానాలు పెరుగడం వల్ల బీజేపీ పెద్ద పార్టీగా వస్తుంది. కశ్మీర్ లోయలో సీట్లు జనభా ప్రాతిపదికన పెరిగే మాట ఎలా ఉన్నా పునరావాసం వల్ల సీట్ల సంఖ్య తగ్గే అవకాశమే కాక ఇక్కడ నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ, కాంగ్రెస్ పార్టీలు సీట్లను చీల్చుకుంటాయి. ఇలాంటి రాజకీయ లబ్ధి కోసమే కశ్మీర్‌లో డిలిమిటేషన్ కమిషన్‌లో సీట్ల పెంపు, పునర్విభజన ప్రక్రియ ప్రారంభించింది.

ఏపీలో బీజేపీ బలంగా లేదు. తెలంగాణలో బీజేపీ ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో 4 స్థానాలు గెలుచుకోవడం ద్వారా టీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఒక సవాలు విసిరి 3వ బలమైన పార్టీగా అవతరించింది. టీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఢీకొని ఓడించాలంటే కాంగ్రెస్ 10 శాతం ఓట్లకు పరిమితం కావాలి. లేదా బీజేపీ బలహీనపడితే కాంగ్రెస్ బాగా పుంజుకుంటేనే సాధ్య పడుతుంది. ఇవేవీ జరిగే అవకాశాలు లేనందున అసెంబ్లీ స్థానాలు పెంచి టీఆర్‌ఎస్‌కు మేలు చేయడం ఎందుకని బీజేపీలో ఒక వర్గం వాదనగా ఉన్నది. సికింద్రాబాద్ పూర్తిగా నగర పరిధిలోని పార్లమెంట్ స్థానం. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ స్థానాలు పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. హైదరాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల స్థానాలలో బీజేపీ గణనీయమైన ఓట్లు సాధించిందనీ, సీట్ల సంఖ్య పెరిగితే నగర పరిసరాల్లో 20కి పైగా అదనపు అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయని, అది బీజేపీకి లాభిస్తుందని పార్టీలోని మరొక వర్గం ప్రతిపాదిస్తున్నది. తెలంగాణ, ఏపీ మధ్య ఆస్తుల పంపిణీని కేంద్రం త్వరితగతిన చేయడం లేదు. అలాగే అసెంబ్లీ సీట్లను పెంచడం లేదు. ఇరు రాష్ట్రాలకు ఇచ్చిన హామీలను అమలుచేయడం లేదు. ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం, కడప, స్టీల్ ప్లాంట్లు, దుగ్గరాజపట్నం పోర్టు, ఏపీ రాజధాని నుంచి హైదరాబాద్‌కు జాతీయ రహదారుల విస్తరణ వంటి విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది.

కర్ణాటక, గుజరాత్, యూపీ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో బీజేపీ బలంగా ఉన్నందున, తమిళనాడులోని ఇరు ప్రధాన పార్టీలతో పార్లమెంట్‌లో అవసరం ఉన్నందున కేంద్రం ఈ రాష్ట్రాలకు మాత్రమే సహకరిస్తున్నది. కేంద్ర ప్రాయోజిత పథకాలు, విదేశీ ఆర్థికసాయం కింద చేపట్టే పథకాల పట్ల పూర్తి వివక్ష చూపిస్తున్నారని సీఎం కేసీఆర్ అంటున్నారు. ఆయన ఎంతో ప్రజాస్వామ్యయుతంగా ఫెడరల్‌వ్యవస్థను గౌరవిస్తూ విజ్ఞప్తి చేసినా తగురీతిలో స్పందించడం లేదు. దీంతో రాష్ట్ర వనరులు, రుణ సమీకరణ ద్వారా భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఇప్పటికైనా అసెంబ్లీ స్థానాల పెంపుదలలో ఆయా రాష్ట్రాల పట్ల కేంద్రం చూపిస్తున్న వివక్షను సరిచేసుకోవాలి. విభజన బిల్లులో ఇచ్చిన హామీలను అమలుచేయాలి. ఇలాంటి చర్యల వల్లనే బీజేపీ పట్ల ప్రజలకు నమ్మకం ఏర్పడుతుంది.

> **కర్ణాటక, గుజరాత్, యూపీ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో బీజేపీ బలంగా ఉన్నందున, తమిళనాడులోని ఇరు ప్రధాన పార్టీలతో పార్లమెంట్‌లో అవసరం ఉన్నందున కేంద్రం ఈ రాష్ట్రాలకు మాత్రమే సహకరిస్తున్నది. కేంద్ర ప్రాయోజిత పథకాలు, విదేశీ ఆర్థికసాయం కింద చేపట్టే పథకాల పట్ల పూర్తి వివక్ష చూపిస్తున్నారని సీఎం కేసీఆర్ అంటున్నారు. ఆయన ఎంతో ప్రజాస్వామ్యయుతంగా ఫెడరల్‌వ్యవస్థను గౌరవిస్తూ విజ్ఞప్తి చేసినా తగురీతిలో స్పందించడం లేదు.**

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

# కల్యాణం.. కమనీయం

- **వైభవంగా 'మైహోం' వేంకటేశ్వరస్వామి కల్యాణం**

**మేళ్లచెర్వు:** సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులోని మైహోం ఇండస్ట్రీస్ ఆవరణలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం కన్నులపండువగా నిర్వహించారు. శ్రీత్రిదండి చిన జీయర్‌స్వామి, అహోబిల రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో ఈ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. మైహోం గ్రూప్స్ చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు-శ్రీకుమారి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, కన్యాదానం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దంపతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



కల్యాణ వేడుకలో పాల్గొన్న చినజీయర్‌స్వామి, జూపల్లి రామేశ్వర్‌రావు తదితరులు



**చెక్కుల పంపిణీ**

వనపర్తి జిల్లాకేంద్రంలోని బాధితులకు మంజూరైన సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులు, ఎల్‌వోసీలను మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి వారి ఇండ్లకు స్వయంగా వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాధితుల ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. - వనపర్తి, నమస్తే తెలంగాణ

### ✦ మిర్చికి రికార్డు ధర



వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మిర్చికి రికార్డు స్థాయిలో ధర పలికింది. ఈ సీజన్‌లో అత్యధికంగా సింగిల్‌పట్టి రకం క్వింటాల్‌కు రూ.25,500 ధర నమోదైంది. సోమవారం రూ.24,500, గత నెలలో రూ.21,500 ధర పలికింది.

- కాశీబుగ్గ (వరంగల్)



# ఆర్డీఎస్‌కు దక్కని నీళ్లు

**ఈనెల 6నుంచి టీబీ డ్యాం ద్వారా నీటి విడుదల**

- **వచ్చిన నీటిని వచ్చినట్టే తోడేస్తున్న కర్ణాటక రైతులు**
- **ఆందోళనలో ఆయకట్టుదారులు**

**అయిజ:** ఆర్డీఎస్ వాటా నీటిని కర్ణాటక రైతులు అక్రమంగా తోడేస్తున్నారు. ఆయకట్టు పంటల రక్షణకోసం తుంగభద్ర డ్యాం నుంచి నదిలోకి ఈనెల 6 నుంచి 18వ తేదీ వరకు నీటి విడుదల కొనసాగనున్నది. కాగా, పైనుంచి వచ్చిన నీటిని వచ్చినట్టే లిఫ్టులు, మోటర్ల ద్వారా కర్ణాటక రైతులు మళ్లించుకుపోతున్నారు. దీంతో ఆర్డీఎస్ ఆనకట్టకు నీరు చేరడం లేదు. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గ పరిధిలో సాగు చేసిన 20 వేల ఎకరాలకు 1.90 టీఎంసీల నీళ్లు కావాలని ఈనెల 5న తుంగభద్ర బోర్డును తెలంగాణ ప్రభుత్వం కోరింది. దీంతో ఈఎన్సీ మురళీధర్‌రావు బోర్డు కార్యదర్శికి ఒక టీఎంసీ ఇండెంట్‌తో కూడిన లేఖను రాశారు. అందుకు అంగీకరించిన టీబీ డ్యాం అధికారులు ఈ నెల 6 నీటి విడుదలను ప్రారంభించారు. ఈ క్రమంలో కర్ణాటకలోని మాన్వి, సిరిగుప్ప, గబ్బూరు గ్రామాల్లోని ఎత్తిపోతల పథకాలతోపాటు స్థానిక రైతులు నీటిని మోటర్ల ద్వారా సాగుకు వినియోగించుకుంటున్నారు. దీంతో ఆర్డీఎస్‌కు నీరు చేరడం లేదు. ఆనకట్టలో నీటిమట్టం 2.9 అడుగులకు చేరుకోవడం.. టీబీ డ్యాం నుంచి నీరు రాకపోవడంతో స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఆర్డీఎస్ ఆనకట్టలో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ

**టీబీ డ్యాంలో 18.282 టీఎంసీల నీరు**

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంలో ప్రస్తుతం 18.282 టీఎంసీల నీరు ఉన్నది. ఈ డ్యామ్ నుంచి యాసంగి పంటలు, తాగునీటి అవసరాల కోసం కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ర్టాలకు నీటి విడుదల కొనసాగుతున్నది. మంగళవారం టీబీ డ్యాం నుంచి 6,969 క్యూసెక్కులు విడుదల చేశారు. టీబీ డ్యాం ద్వారా కర్ణాటక పరిధిలోని కాల్వలతోపాటు ఏపీలోని ఆయకట్టుకు సాగు నీరు అందించే హెచ్‌ఎల్‌సీ(హై లెవల్ కెనాల్-టీబీ డ్యాం నుంచి అనంతపూర్‌కు), ఎల్‌ఎల్‌సీ(లో లెవల్ కెనాల్- టీబీ డ్యాం నుంచి కర్నూల్‌కు) కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నట్టు టీబీ బోర్డు సెక్షన్ అధికారి విశ్వనాథం తెలిపారు.

**మరో టీఎంసీ వదలండి: పీజేపీ ఎస్‌ఈ లేఖ**

ఆర్డీఎస్ నీటి వాటాలో మిగిలిన ఒక టీఎంసీ నీటి విడుదల చేయాలని ఈఎన్సీ మురళీధర్‌రావుకు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎస్‌ఈ రఘునాథరావు లేఖ రాశారు. ఈఎన్సీ టీబీ బోర్డుకు ఇండెంట్ పెట్టనున్నారని, బోర్డు నుంచి అనుమతి రాగానే నీటిని విడుదల చేయిస్తామని తెలిపారు. కర్ణాటకలో పర్యటించి అక్కడి రైతులను కట్టడి చేసి ఆయకట్టుకు నీరందేలా చర్యలు తీసుకుంటామని రఘునాథరావు వివరించారు.



వరంగల్ నిట్‌లో మాట్లాడుతున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

## నేరరహిత తెలంగాణే లక్ష్యం

- **రాష్ట్రంలో మావోయిస్టుల ఉనికి లేదు**
- **డీజీపీ మహేందర్‌రెడ్డి**

**వరంగల్ ప్రధాన ప్రతినిధి, ఆసిఫాబాద్, నమస్తే తెలంగాణ/జ్యోతినగర్:** నేర రహిత రాష్ట్రంగా తెలంగాణను నిలుపడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని డీజీపీ మహేందర్‌రెడ్డి స్పష్టంచేశారు. శాంతిభద్రతలను నెలకొల్పడం.. వేగంగా నేర నిర్ధారణ.. నేరస్తులకు శిక్షలు పడేలా చూడటంలో ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు పెరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. మంగళవారం పెద్దపల్లి, ఆసిఫాబాద్ జిల్లాల్లో పర్యటించిన డీజీపీ అనంతరం వరంగల్‌లోని జాతీయ సాంకేతిక విద్యాలయం(నిట్)లో పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ తర్వాత డీజీపీ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలు నెలకొల్పడమే కాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో పోలీసు శాఖ భాగస్వామ్యం అవుతుందన్నారు. సీఎం కేసీఆర్ పోలీసు శాఖపై పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగా పనిచేస్తామని తెలిపారు. రాష్ట్రంలో సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టు కార్యకలాపాల విస్తరణ జరగకుండా ఉండేందుకు వీలుగా అన్నిచర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. నేరరహిత తెలంగాణగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రంలో 10 లక్షల సీసీ కెమెరాలను అమర్చుతున్నట్టు వెల్లడించారు. సమీక్షలో వరంగల్ రేంజ్ ఐజీ వై నాగిరెడ్డి, వరంగల్, కరీంనగర్, రామగుండం సీపీలు డాక్టర్ రవీందర్, కమలాసన్‌రెడ్డి, సత్యనారాయణ, ములుగు ఎస్పీ సంగ్రామ్‌సింగ్‌జీ పాటిల్ పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో దంపతుల దుర్మరణం

**అనాథలుగా మారిన నలుగురు పిల్లలు**

**ఎల్లారెడ్డి, నమస్తేతెలంగాణ/సదాశివనగర్:** రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందడంతో వారి నలుగురు పిల్లలు అనాథలుగా మిగిలారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం లింగంపల్లి గేటు సమీపంలో మంగళవారం చోటుచేసుకున్నది. గాంధారి మండలం పోతంగల్‌కలాన్‌కు చెందిన గంగిరెడ్డుల సాయిలు(35), సావిత్రి(30) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కాగా, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వివరాలు తెలుసుకునేందుకు మంగళవారం చిన్నకొడుకు రాజు(1), చిన్న కూతురు హర్షిత(2)తో బైక్‌పై జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లారు. రెండురోజుల తరువాత రావాలని వైద్యసిబ్బంది సూచించడంతో వారు వెనుదిరిగారు. ఇంటికి వెళ్తున్న క్రమంలో గాంధారి ఎక్స్‌రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ వీరిని ఢీకొట్టగా.. సాయిలు, సావిత్రి అక్కడికక్కడే మృతి చెందారు. చిన్నారులు హర్షిత, రాజు కింద పడిపోవడంతో స్వల్పగాయాలతో బయటపడ్డారు. సాయిలు పెద్ద కూతురు సునీత(11), పెద్ద కుమారుడు సందీప్(8) చదువుకుంటున్నారు. పోలీసులు వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సాయిలు, సావిత్రి (ఫైల్ )



ప్రమాదం నుంచి బయటపడ్డ చిన్నారులు

# 2 కోట్లతో వస్త్రవ్యాపారి పరారీ

**యాదగిరిగుట్ట పట్టణవాసుల ఆందోళన**

**యాదగిరిగుట్ట, నమస్తేతెలంగాణ:** స్థానికుల వద్ద దాదాపు రూ.2 కోట్ల వరకు వసూలు చేసిన ఓ వ్యాపారి ఉడాయించిన ఘటన యాదగిరిగుట్ట పట్టణంలో మంగళవారం వెలుగుచూసింది. బాధితుల కథనం ప్రకారం.. తమిళనాడుకు చెందిన రామస్వామి 25 ఏండ్ల కింద యాదగిరిగుట్టకు వచ్చి వస్త్ర వ్యాపారం చేస్తూ స్థిరపడ్డాడు. ఆయన వస్త్ర దుకాణంలో అర్జున్, పళని అనే వ్యక్తులు పని చేసేవారు. వీరికి రామస్వామి తన కూతుళ్లను ఇచ్చి వివాహం చేశారు. అందరితో కలివిడిగా ఉంటూ వ్యాపారం చేసేవారు. నమ్మకంగా ఉంటూ 2014లో అర్జున్ స్థానికుల వద్ద సుమారు రూ.50 లక్షల వరకు అప్పు చేసి ఉడాయించాడు. అతని ఆచూకీ కోసం చాలారోజులు వెతికినా లభించలేదు. రామస్వామి కూడా అప్పట్లోనే వెళ్లిపోయాడు. ఇదిలావుండగా యాదగిరిగుట్టలోనే పళని కుటుంబం మాత్రమే ఉంటుంది. పళని కూడా స్థానికుల వద్ద వడ్డీకి సుమారు రూ.2 కోట్ల వరకు వసూలు చేసి నెలరోజుల క్రితం కుటుంబసభ్యులతో కలిసి తమిళనాడుకు పరారయ్యాడు. వ్యాపారంలో భాగంగా తమిళనాడు వెళ్లిన పళని తిరిగివస్తాడని భావించిన బాధితులకు నిరాశే మిగిలింది. యాదగిరిగుట్ట పట్టణంలో పళనికి అప్పు ఇచ్చినవారు ఎంత మంది ఉన్నారో వివరాలు సేకరిస్తున్నట్టు స్థానికుడు గౌలికార్‌అశోక్ తెలిపారు. సుమారు 25 మందికిపైగా అప్పు ఇచ్చినవారిని గుర్తించామని, వీరిసంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నదన్నారు. ఒకే ఇంట్లో భార్యకు తెలియకుండా భర్త వద్ద, భర్తకు తెలియకుండా భార్య వద్ద పళని అప్పు తీసుకున్నట్టు తెలిసిందన్నారు. కాగా, యాదగిరిగుట్ట సీఐ పాండురంగారెడ్డిని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.



పళనికి అప్పుగా ఇచ్చిన వారి వివరాలు నమోదు చేస్తున్న స్థానికుడు గౌలికార్ అశోక్

## ఆఖరి పరీక్షకు వెళ్తూ..

**రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి దుర్మరణం**

**కామేపల్లి:** ఇంటర్ ప్రథమ సంవత్సరం చివరి పరీక్షకు వెళ్తూ ఓ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం రాయిగూడెం స్టేజీ సమీపంలో మంగళవారం చోటుచేసుకున్నది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన మామిడి వివేక్(17), గార్ల మండలం రాంపురానికి చెందిన వడ్లమూడి లెనిన్‌కుమార్ కలిసి బైక్‌పై పరీక్ష రాసేందుకు ఖమ్మం బయలుదేరారు. మార్గమధ్యంలో రాయిగూడెం స్టేజీ సమీపంలోని మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న గోతిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో వివేక్ మరణించాడు.



వివేక్(ఫైల్ )

## భారీగా ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** గత కొన్నిరోజులుగా విధులకు దూరంగా ఉంటున్నారన్న కారణంగా జాతీయ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను మంగళవారం ఆయా జిల్లాల అధికారులు సస్పెండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 235 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను, రంగారెడ్డి జిల్లాలో 172 మంది, కామారెడ్డి జిల్లాలో 266 మంది, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 134 మంది, సూర్యాపేట జిల్లాలో 274 మంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 181 మందిని సస్పెండ్ చేశారు.

# రుణమాఫీ చెక్కు రైతు చేతికే

మూడోపేజీ తరువాయి...

తీసుకుని పంటకు అవసరమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే విధానానికి స్వస్తి చెప్పేందుకు సీఎం కేసీఆర్ ఇప్పటికే చేసిన ప్రకటనకు అనుగుణంగా రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న సంస్థాగత రుణాలను మాఫీ చేస్తున్నట్టు ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. రైతు కుటుంబం యూనిట్‌గా రుణమాఫీని వర్తింపజేయనున్నారు. అంటే భర్త, భార్య వారిమీద ఆధారపడి ఉన్న పిల్లలు కలిపి గరిష్ఠంగా రూ.లక్ష వరకు నాలుగు విడుతులగా మాఫీ చేయనున్నారు. ఈ రూ.లక్షలో ప్రాసెసింగ్ ఫీజు, లీగల్ చార్జీలు, ఇన్సూరెన్స్ తదితరాలు ఉండవు. ఇటీవల అసెంబ్లీలో ప్రకటించిన విధంగా రూ.25 వేల వరకు ఉన్న పంట రుణాలను ఒకే దఫాలో మాఫీ చేస్తారు. రూ. 25 వేలకు పైబడిన.. లక్షలోపు రుణాలను నాలుగుదఫాలుగా మాఫీ చేయనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. లబ్ధిదారులకు రుణమాఫీ డబ్బులను చెక్కుల రూపంలో నేరుగా అందించనున్నారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు గ్రీవెన్స్‌సెల్‌ను ఏర్పాటుచేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### అర్హుల గుర్తింపు ఇలా..

- ☛ 2014 ఏప్రిల్ 1 (గతంలో రుణమాఫీకి తీసుకున్న కటాఫ్ తేదీ) నుంచి 2018 డిసెంబర్ 11దాకా రైతులు తీసుకున్న, రెన్యువల్ పంటరుణాలు, వడ్డీలు కలుపుకొని లక్ష రూపాయలకు మించకుండా మాఫీచేస్తారు.
- ☛ గ్రామీణ ప్రాంతాల్లోని బ్యాంకుల్లో బంగారం తాకట్టుతో తీసుకున్న పంటరుణాలు రూ. లక్ష వరకు మాఫీచేస్తారు.
- ☛ రైతులకు ఎన్నిబ్యాంకుల్లో ఎన్ని అప్పు ఖాతాలున్నప్పటికీ ఒక కుటుంబానికి రూ.లక్ష మేరకు మాఫీ వరిస్తుంది.
- ☛ కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది పంటరుణానికి అర్హులైతే రూ.లక్ష మొత్తంలో ఉన్నవారందరికీ సమానంగా ఇస్తారు.
- ☛ స్వల్పకాలిక పంట రుణాలు 18 నెలల చెల్లింపు కాలవ్యవధి ఉన్నవాటికే మాఫీ వర్తిస్తుంది, ఉద్యాన పంటల కోసం పొందిన స్వల్పకాల రుణాలూ ఈ పథకం పరిధిలోకి వస్తాయి.
- ☛ రైతు కుటుంబాలను గుర్తించేందుకు ఏఈవో, వీఆర్వో, పంచాయతీ సెక్రటరీల సాయం తీసుకుంటారు. తాసిల్దార్, ఎంపీడీవో, వ్యవసాయాధికారి పర్యవేక్షిస్తారు.

**వీటికి వర్తించదు:** టై అప్ రుణాలు, ఖాతా తీసేసిన, రాతపూర్వక రుణాలు, జేఎల్జీ, ఆర్‌ఎంజీ, ఎల్‌ఈసీ రుణాలు, రీస్ట్రక్చర్డ్, రీషెడ్యూల్ రుణాలు

### లబ్ధిదారుల తుది జాబితా ఇలా..

రుణమాఫీ ప్రయోజనం రైతులకు అందించేందుకు వ్యవసాయశాఖ ఐటీ వ్యవస్థ లేదా పోర్టల్‌ను తయారుచేస్తుంది. రైతుల సమాచారం కోసం, వారి రుణాల మొత్తం వంటివి ఫైనల్ చేసేందుకు దీనిని వినియోగిస్తారు. ప్రతీ బ్యాంకు బ్రాంచిలవారీగా కటాఫ్ తేదీకి అనుగుణంగా ఇచ్చిన పంటరుణాలను నిర్దేశించిన నమూనాలో గ్రామాలవారీగా జాబితాను రూపొందిస్తుంది. దానిని గ్రామసభ నిర్వహించి పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. ఈ సందర్భంగా సామాజిక ఆడిట్ నిర్వహించి.. అభ్యంతరాలు ఏవైనా ఉంటే స్వీకరించి పరిష్కరిస్తారు. తర్వాత బ్రాంచీలవారీగా అర్హుల తుదిజాబితాను లీడ్ బ్యాంక్ మేనేజర్, జిల్లా కలెక్టర్‌కు పంపుతారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ బ్యాంకులవారీగా, రైతులవారీగా చెల్లించాల్సిన మొత్తం వివరాలను, ప్రభుత్వం మంజూరుచేయాల్సిన మొత్తాన్ని నిర్ణయిస్తుంది.

## రేపటి నుంచి గ్రూప్ - 4 అభ్యర్థులకు మెడికల్ టెస్ట్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రూప్-4లోని జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, జూనియర్ స్టెనో పోస్టులకు ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 18, 19న మెడికల్‌టెస్ట్ నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆర్థోపెడిక్ హ్యాండీకాప్డ్ అభ్యర్థులకు మాత్రమే ఈ పరీక్ష ఉంటుందని, అభ్యర్థులు ఉదయం 10.00 గంటలకు ప్రతిభాభవన్‌కు చేరుకోవాలని సూచించింది. హాల్‌టికెట్, ఐడీకార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు వెంట తెచ్చుకోవాలని, మెడికల్‌బోర్డు ఫీ కోసం రూ.400 చెల్లించాలని కోరింది. పూర్తివివరాలకు తమ వెబ్‌సైట్ సందర్శించాలని సూచించింది.



## యాదాద్రి సమాచారం

- ✦ ఉదయం 4 గంటలకు లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయం తెరుస్తారు
- ✦ ఉ.4 నుంచి 4:30 వరకు సుప్రభాతం
- ✦ 4:30 నుంచి 5 వరకు బాలభోగం
- ✦ 5 నుంచి 7:15 వరకు సహస్రనామార్చన
- ✦ ఉ.7:15 నుంచి మ.12 వరకు ధర్మ, ఉభయ దర్శనాలు
- ✦ ఉ.9 నుంచి 10 వరకు సుదర్శన నారసింహ హోమం
- ✦ 10 నుంచి 12 వరకు నిత్యకల్యాణం
- ✦ మ. 12 నుంచి 12:30 వరకు స్వామి అమ్మవార్లకు నివేదన
- ✦ 12:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆలయం మూసివేత
- ✦ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 వరకు ధర్మ, ఉభయ దర్శనాలు
- ✦ రాత్రి 7 నుంచి 8:10 వరకు ఆరాధన, సహస్రనామార్చనలు
- ✦ రాత్రి 8:15 నుంచి 9 వరకు ధర్మ, ఉభయ దర్శనాలు
- ✦ రాత్రి 9 నుంచి 9:30 వరకు పవళింపు సేవ, దర్శనాలు నిలిపివేత
- ✦ రాత్రి 9.30 నుంచి 10 వరకు ద్వార బంధనం, ఆలయ మూసివేత

### గదుల సమాచారం

- ✦ కొండ కింద తులసీవనంలో 120 గదులు ఖాళీగా ఉన్నాయి. రూ. 250 నుంచి రూ. 1,700 వరకు గదులు భక్తులకు అందుబాటులో ఉన్నాయి.

### ✦ క్షీరాభిషేకం



బ్రాహ్మణుల అభ్యున్నతి కోసం భారీగా నిధులు కేటాయిస్తున్నందుకు కృతజ్ఞతగా బ్రాహ్మణ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ చౌరస్తాలో మంగళ వారం సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు. చిత్రంలో బాలానగర్ కార్పొరేటర్ నరేందరాచార్య, అర్చకులు రాహుల్‌దేశ్‌పాండే, కోడూరి కృష్ణమాచార్య, శ్రీరంగం గోపీకృష్ణమాచార్య, శ్రీనివాసాచార్యులు తదితరులు ఉన్నారు.



సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా శాసనసభలో తీర్మానం చేయడాన్ని హర్షిస్తూ మంగళ వారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మైనార్టీ నాయకులు సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. మైనార్టీలకు అండగా నిలిచిన కేసీఆర్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని వారు పేర్కొన్నారు. - సిరిసిల్ల టౌన్

## తండ్రిపైనే అనుమానం!

- **తల్లీకొడుకుల సజీవదహనం కేసు..**

**ధర్మారం:** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తిలో సోమవారం అర్ధరాత్రి గ్యాస్‌లీకై తల్లీకొడుకు సజీవ దహనమైన కేసులో తండ్రిపై అనుమానంతో పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. పెద్దపల్లి సీఐ ప్రదీప్ కథనం ప్రకారం.. దొంగతుర్తికి చెందిన గొట్టె నారాయణ (45), యశోద(40) దంపతులు. వీరికి కొడుకు రాహుల్ (18), కూతురు రాణి(15)ఉన్నారు. కొడుకు ఇంటర్ ఫస్టియర్ చదువుతుండగా, రాణి గురుకుల పాఠశాలలోనే ఉంటూ 8వ తరగతి చదువుతున్నది. కొద్దిరోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. స్థానికులు సర్దిచెప్పడంతో ఒకే ఇంట్లో వేర్వేరుగా ఉంటున్నారు. సోమవారం అర్ధరాత్రి ఎప్పటిలాగే తల్లీ కొడుకు ఒక గదిలో, భర్త మరోగదిలో పడుకొన్నారు. సమయంలో పెద్ద శబ్దంతో సిలిండర్ పేలి ఇంటి పైకప్పు ధ్వంసమై, మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో యశోద, రాహుల్ సజీవదహనమయ్యారు. కాగా, ఘటనలో యశోద భర్త గొట్టె నారాయణపై అనుమానం ఉన్నట్టు యశోద సోదరి కమల ఫిర్యాదు మేరకు అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సీఐ తెలిపారు.

# నీటివృథాకు 'చెక్'డ్యాం

మూడోపేజీ తరువాయి...

నిర్మాణం చేపట్టబోతున్నారు. బాన్సువాడ మండలంలోని చింతల్‌నాగారంలో చెక్‌డ్యాంను 1500 మీటర్లు పొడవుతో 64 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. ఇందుకోసం రూ.28.29 కోట్లు వెచ్చించనున్నారు. కుర్థిలో నిర్మిస్తున్న బ్రిడ్జి కమ్ చెక్‌డ్యాం నిర్మాణం ద్వారా బహుళ ప్రయోజనాలున్నాయి. ఈ మూడు చెక్‌డ్యాంల నిర్మాణాలు పూర్తైతే మంజీర నదిలో సుమారుగా 50 నుంచి 100 కిలోమీటర్ల మేర వరద నీరు నిల్వ ఉండే అవకాశాలున్నాయని నీటిపారుదలశాఖ అధికారులు చెప్తున్నారు.

**యాబై ఏండ్ల గోసకు పరిష్కారం లభించినట్టే**



ఎన్నోఏండ్ల నుంచి మంజీర నదిపై బ్రిడ్జి కావాలని గత ప్రభుత్వాలను వేడుకున్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం మూలంగా 50 ఏండ్ల సమస్యకు పరిష్కారం లభిస్తున్నది. బ్రిడ్జి నిర్మాణం పూర్తైతే మాకు ఎలాంటి చింత ఉండబోదు.

– బేగరి పెద్ద సాయిలు, కుర్థి గ్రామస్థుడు

**చీకూ చింత లేదిక**



మంజీర నదిలో వానకాలంలో నీరు పెద్ద ఎత్తున పారుతుంటుంది. ఆ తర్వాత కొద్దిరోజులకే చుక్కకూడా కన్పించదు. వర్షాలు పడ్డప్పుడు మాకు కలిగే ఆనందం కొద్దిరోజుల్లోనే పోతుంది. ఇక్కడ కట్ట కట్టడం వల్ల రైతులకు మేలు చేకూరుతుంది. యాసంగి కాలంలో పంటల సాగుకు దిక్కులు చూడాల్సిన అవసరం ఉండదు.

– డాకవ్వ, మంజీర పరివాహక ప్రాంత రైతు

## ఈ మహిళకు కుడివైపు గుండె



**వైరా, నమస్తే తెలంగాణ:** సాధారణంగా మనుషుల్లో గుండె ఛాతికి ఎడమవైపున ఉంటుంది. కానీ, ఖమ్మం జిల్లా వైరాకు చెందిన ఓ మహిళకు కుడివైపున ఉన్నట్టు వైద్య పరీక్షల్లో తేలింది. పట్టణానికి చెందిన బాసాటి ఉష(22)కు ఆనంద్‌తో పదేండ్ల కింద పెండ్లి అయ్యింది. వీరికి సంతానం లేకపోవడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు దవాఖానలో సంప్రదించారు. ఉషను పరిశీలించిన డాక్టర్ ఎడమవైపు ఉండాల్సిన గుండె కుడివైపు ఉన్నట్టు గుర్తించారు. వేల మందిలో ఒకరికి ఈవిధంగా గుండె కుడివైపు ఉంటుందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైరాలోని ప్రముఖవైద్యుడు డాక్టర్ దారెల్లి కోటయ్య చెప్పారు.



అది సాదా సీదా ఇల్లు. ఆ ఇంట్లో మనుషులూ సామాన్యులే. మనసులే చాలా గొప్పవి. ఆ ఇంట్లో పుట్టింది నేటి 85 ఏళ్ల యువ డాక్టర్. అవును.. 85 ఏళ్ల యువతే. ఎందుకంటే ఈ వయసులో కూడా రోజుకి కనీసం మూడు సర్జరీలనైనా అలవోకగా చేసేస్తారామె. ఆరోగ్యంలోనే కాదు.. ఆరోగ్యకరమైన మనసులో కూడా ముందుంటారామె.

ఆమె ఇంట్లో క్లినిక్‌కి బోర్డు ఉండదు. కాని అక్కడ మనసున్న డాక్టరమ్మ ఉన్నదని మాత్రం సికింద్రాబాద్‌లోని చాలామందికీ తెలుసు. ఆమె క్లినిక్‌లో హంగులూ ఉండవు. ఏసీలుండవు. కానీ అసౌకర్యం అన్న మాట లేకుండా గంటల కొద్దీ పేషెంట్లు బారులుతీరి వేచి చూస్తుంటారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలందించినా, కొన్ని వందల మంది అంకితభావం ఉన్న డాక్టర్లను తయారుచేసినా ఆమెలో ఎక్కడా డాబుసరి కనిపించదు. ఆ వ్యక్తిత్వం అంత ఉన్నతమైంది కాబట్టే.. సికింద్రాబాద్‌లోని సాగర్‌లాల్ హాస్పిటల్‌లోని ప్రసూతి వార్డుకు ఆమె పేరు పెట్టారు. ఇటీవలి మహిళా దినోత్సవం నాడు గ్రీన్ ఇండియన్ సొసైటీ నుంచి సత్కారాన్ని అందుకున్న ఆమే డాక్టర్ సూరి శ్రీమతి.

## ఈ డాక్టర్ ఫీజు
# వంద రూపాయలే!

''భగవంతుడు మనకు బుద్ధి, జ్ఞానం సరైన విధంగా ఉపయోగపడటం కోసం ఇస్తాడు. మాకు వైద్య పరిజ్ఞానం ఇచ్చాడంటే అది సక్రమంగా రోగులకు ఉపయోగపడాలనే. ఈ విషయాన్ని మరువకుండా దేవుడు మనకు అందించిన డ్యూటీని సరిగ్గా చేయాలి. నాలాంటి వాళ్ల ద్వారా ఈ వైద్యం అందిస్తున్నది కూడా ఆయనే. నా విధిని నేను సరిగ్గా నిర్వర్తించే శక్తిని ఇవ్వమని ఆయన్ని కోరుకుంటా'' అంటూ తాను డ్యూటీని మాత్రమే చేస్తూ వెళ్తున్నానే తప్ప గొప్పదాన్ని కాదని చెప్తారు డాక్టర్ శ్రీమతి. 1935లో పుట్టిన డాక్టర్ శ్రీమతి 1958లో మెడిసిన్ పూర్తి అయిన దగ్గరి నుంచి ఇప్పటి దాకా అంతే శ్రద్ధగ్గా, అదే సేవా దృక్పథంతో వైద్యసేవలందిస్తున్నారు. ఈ వైద్య ప్రస్థానంలో తను పెళ్లి చేసుకోవాలన్న సంగతే మరిచారు. పేషెంట్లనే తన పిల్లలుగా ఆదరిస్తారామె. తెలుగురాష్ట్రాల్లోని దాదాపు అన్ని జిల్లాల్లోని గవర్నమెంట్ హాస్పిటల్స్ లోనూ పనిచేశారు. 1991లో నిలోఫర్ హాస్పిటల్‌లో రిటైర్ అయ్యారు.

**నాన్న వారసత్వం :** డాక్టర్ సూరి శ్రీమతి నాన్న సూరి రాఘవ దీక్షితులు 60వ దశకంలో గాంధీ జ్ఞాన మందిర్ ద్వారా హైదరాబాద్‌కి మొట్టమొదటిసారిగా యోగాను పరిచయం చేసిన వారు. మన పుట్టుక ఎంతో మందికి ఉపయోగపడేలా ఉండాలని చెప్పే ఆ మంచి మనిషి లక్షణాలన్నీ పుణికి పుచ్చుకున్నారు డాక్టర్ శ్రీమతి. ఆమె దగ్గరికి వచ్చే గర్భిణులకు అందరికీ ఉచితంగా యోగా ప్రాక్టీస్ చేయిస్తారు. ఇప్పటికీ తమ ఇంటిలోని యోగా హాల్‌లో ప్రతిరోజూ ఉదయం ఉచితంగా యోగాభ్యాసం చేయిస్తారు. తన పేషెంట్ల దగ్గర కేవలం వంద రూపాయల నామమాత్రపు ఫీజు తీసుకుంటారు. పేదలైతే ఉచితంగానే వైద్యం అందిస్తారు. అయినా నా గుమ్మానికి వచ్చిన వాళ్లకి నా పరిజ్ఞానం, అనుభవంతో తోడ్పడుతున్నానంతే అంటారు.



ఇప్పుడు చాలామంది 20లలోనే పెండ్లి చేసుకుంటున్నారు. సరైన వయసులో గర్భం దాలిస్తే రిస్క్ తక్కువగా ఉంటుంది. కానీ ఆలస్యం చేయడం వల్ల బీపీ, డయాబెటిస్ లాంటి సమస్యలు వస్తున్నాయి.

**వయసు పెరిగినా వణకని చేతులు :** నలభయ్యేళ్లు రాగానే రకరకాల అనారోగ్యాలూ, అలసటలూ... వయసైపోయిందంటూ డీలా పడిపోతుంటాం. కాని ఈ 85 ఏళ్ల వయసులో కూడా ఆమె ఫిట్‌నెస్ చెక్కు చెదరలేదు. ఇందుకు యోగానే కారణం అంటారామె. ఆఫీసుల్లో కూర్చుని పనిచేయడానికే సంకోచించే వయసులో అలవోకగా సర్జరీ చేసేస్తారామె. ఆమె దృష్టిలో గానీ, వినికిడిలో గానీ, చేతుల పట్టులో గానీ ఎక్కడా వయసు జాడ ఉండదు. నార్మల్ డెలివరీలే కాదు.. ఆపరేషన్‌ను కూడా ఎటువంటి లోపాలు లేకుండా చకచకా చేస్తారు. 99.9 శాతం నార్మల్ డెలివరీలే చేయడం ఆమె ప్రత్యేకత. పొద్దున్నే 5 గంటలకు లేచి భగవద్ధ్యానం చేసుకోవడం మనసులోని ఒత్తిడినంతటినీ తగ్గిస్తుంది. 6 నుంచి 7.30 దాకా యోగా చేయడం, నోటికి పనికొచ్చేది కాకుండా.. శరీరానికి పనికొచ్చేది తినడం... ఇదే తన ఆరోగ్య రహస్యం అంటారామె. అలాగని ఆకులు.. అలములు, కందమూలాలు కాదు... మనం తిన్నట్టే రెండు పూటలా సాధారణ ఆహారమే తీసుకుంటారు. రెండేళ్ల క్రితం నడుమునొప్పి రావడంతో యోగా ఆపేశారు.

**పెండ్లి వయసు దాటితే సమస్యలే..!:** ఇప్పుడు సంతానలేమి సమస్యలు పెరగడానికి ప్రధాన కారణం వయసు మీరాక పెండ్లి చేసుకోవడమే అంటారామె. ఇంతకుముందులాగా బాల్యవివాహం చేయక్కర్లేదు. కాని జీవితంలో స్థిరపడ్డాక పెళ్లి చేసుకునేసరికి రిప్రొడక్టివ్ ఏజ్ దాటిపోయే పరిస్థితి ఏర్పడుతున్నది. ఈ లేట్ మ్యారేజీల వల్ల సంతానలేమి సమస్యలు ఎదుర్కొంటున్నారు. అయితే ఇప్పుడిప్పుడే ఆలోచనల పంథా మారుతున్నది. ఇప్పుడు చాలామంది 20లలోనే కూడా పెండ్లి చేసుకుంటున్నారు. సరైన వయసులో గర్భం దాలిస్తే రిస్క్ తక్కువగా ఉంటుంది. కానీ ఆలస్యం చేయడం వల్ల బీపీ, డయాబెటిస్ లాంటి సమస్యలు వస్తున్నాయి. ఎక్కువ వయసు ఉండటం కూడా నార్మల్ డెలివరీకి రిస్కే. అందుకే సిజేరియన్లు పెరుగుతున్నాయి. అంతేగాక ఇంతకుముందులా కాకుండా ఇప్పుడు ఒక్క బిడ్డతోనే ఆపేస్తున్నారు. కాబట్టి ఏ చిన్న సమస్య వచ్చినా రిస్క్ ఎందుకని సిజేరియన్‌కే ఓటు వేస్తున్నారు. పైగా తాము చూసుకున్న ముహూర్తంలోనే బిడ్డ పుట్టాలనే నమ్మకాలతో కూడా సిజేరియన్లు చేయించుకుంటున్నారు. కాని ఇది మంచి పద్ధతి కాదంటారామె. ఇక పెరుగుతున్న హిస్టరెక్టమీలకు కారణం క్యాన్సర్ లాంటి వ్యాధులే అని చెప్తారు. ముందస్తుగా పాప్ స్మియర్ లాంటి టెస్టులతో క్యాన్సర్ రిస్కు కనుక్కుంటున్నారు. క్యాన్సర్ల అవకాశాలు కూడా పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితిలో హిస్టరెక్టమీ చేయాల్సి వస్తుందే తప్ప అవసరం లేకున్నా పెద్దాపరేషన్ ఎవరూ చేయరు. డాక్టర్లెప్పుడూ అవసరం లేని పనులు చేయరు. అనవసరంగా హిస్టరెక్టమీలు చేస్తారని కూడా నేను అనుకోను అంటూ నిక్కచ్చిగా చెప్తారు.

### మన పిల్లలు జాగ్రత్త

హెల్దీ ఫుడ్ తీసుకోవాలి. రెగ్యులర్‌గా వ్యాయామం చేయాలి. పిల్లలకు ఇంతకుముందులా ఇప్పుడు వ్యాయామం లేదు. అపార్టుమెంట్లలో ఉంటున్నాం. వీధుల్లో ఆటలు లేవు. వెహికిల్స్ కొంటున్నాం. నడక లేదు. మ్యాగీలూ, చిప్స్ వచ్చేశాయి... సున్నుండలు, రవ్వ లడ్డూలు లేవు. ఇక ఇనుము, కాల్షియం పిల్లలకు ఎక్కడి నుంచి వస్తుంది. సూర్యుని ముఖం చూడని పిల్లలకు విటమిన్ డి ఎలా అందుతుంది? అందుకే చిన్న పిల్లల్లోనే హార్మోన్ సంబంధిత సమస్యలు వస్తున్నాయి. ఈ అలవాట్లకు తోడు పెరిగిన కాలుష్యం వాతావరణ ఉష్ణోగ్రతల్ని పెంచింది. దాంతో పసి వయసులోనే 8 ఏళ్లకే పిల్లలు మెచ్యూర్ అవుతున్నారు. చలి దేశాల్లో నెలసరి ఆలస్యంగా వస్తుంది. అందుకే పిల్లలకు ముందు నుంచే ఆరోగ్యకరమైన ఆహారం ఇస్తూ, ఆటలు ఆడటానికి ప్రోత్సహించాలని చెప్తారామె.



... రచన ముడుంబై

## ఈ పరిశ్రమ అందరిదీ!



**కార్పొరేట్ ఉద్యోగం సంతృప్తికరంగా ఉన్నది. అయినా ఆమె ఆరాటపడుతున్న సృజనాత్మక స్వేచ్ఛ దొరకలేదు. బ్యాంకింగ్ ఉద్యోగం వదులుకున్నది. పిక్సెల్ పిక్చర్స్‌తో భారత్ ప్రేక్షకుల కోసం సూపర్ మినిట్, డ్యాన్సింగ్ స్టార్ వంటి మరిన్ని టీవీ షోలు చేస్తున్నది. ఆమె ఎవరో తెలుసా?**

ఆమె పేరు ప్రశాంతి మలిశెట్టి. ఆంధ్రప్రదేశ్‌లోని పిఠాపురం పట్టణానికి చెందింది. చలనచిత్ర పంపిణీతో సహా అనేక వ్యాపారాలలో పాల్గొన్నది వీరి కుటుంబం. ఈ వారసత్వమే ప్రశాంతికి వచ్చింది. ఆమె వాణిజ్యంలో డిగ్రీ చేసింది. హెచ్‌ఎస్‌బిసి, కోటక్ మహీంద్రా బ్యాంక్ వంటి సంస్థలకు కార్పొరేట్ బ్యాంకర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. దీంతోనే 2013లో'పిక్సెల్ పిక్చర్స్' సంస్థతో ప్రారంభించింది. దీంతో అంతర్జాతీయ ప్రదర్శనలను ప్రాంతీయ ప్రేక్షకులకు తీసుకువస్తున్నారు. జబర్దస్త్ వంటి హిట్ రియాలిటీ షోను నిర్మించిన సంజీవ్ కె కుమార్‌తో కొన్ని ప్రాజెక్టులు చేపట్టింది. భారత్‌లో మీడియా, వినోద పరిశ్రమ లాభదాయకంగా ఉన్నది. సూపర్ మినిట్ వంటి హిట్ షోలతో 1000 గంటలకు పైగా టెలివిజన్ కంటెంట్‌తో ముందుకు వచ్చింది. డ్యాన్సింగ్ స్టార్, కుటుంబ శక్తి, తకధిమిత, సూపర్ టాక్ సమయం, అన్యోన్యమైనజంట వంటి ప్రోగ్రామ్‌లు ఇతర భాషల్లో వీక్షకులకు కనువిందు చేశాయి. పిల్లలకోసం ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటుంది. ఈ సంస్థ త్వరలో తమిళ, తెలుగు పరిశ్రమల టెలివిజన్ కోసం మొట్టమొదటి కల్పిత సిరీస్‌ను రూపొందించే ప్రయత్నం చేస్తున్నది. టెలివిజన్ పరిశ్రమ కేవలం పురుషులకే పరిమితం కాదని ప్రశాంతి నిరూపిస్తున్నది.

## శానిటైజర్లు పంచుతున్న రోబోలు



కరోనా కారణంగా ప్రపంచదేశాల్లో ఓ రకమైన భయానక వాతావరణం నెలకొంటున్నది. దీని గురించి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు వినూత్న పద్ధతుల్లో ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేరళలో రోబోల ద్వారా శానిటైజర్లు పంపిణీ మొదలు పెట్టారు. కేరళకు చెందిన 'ఆశిమూవ్ రోబోటిక్స్' రెండు రోబోలను తయారు చేసింది. వీటిల్లో ఒక రోబో మాస్కులు, శానిటైజర్లు, న్యాప్‌కిన్స్ అందిస్తుండగా.. మరొకటి థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నది. ఇలా చేయడం వల్ల ప్రజల్లో మరింత అవగాహన వస్తుందని ఆశిమూవ్ రోబోటిక్స్ ప్రతినిధులు చెబుతున్నారు. ఈ ప్రయత్నాన్ని కేరళ ఎంపీ శశిథరూర్ ట్విటర్ వేదికగా అభినందించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఇదని, కరోనా వ్యాధి నివారణకు అవగాహన ఒక్కటే మార్గమని చెప్పారు శశిథరూర్.

## అందంగానూ.. శుభ్రంగానూ!



ఇంట్లో వస్తువులు, దుస్తులు, పరికరాలు ఇలా ఒకటేమిటి చాలానే ఉంటాయి. వాటిని సరిగా సర్దకపోతే మాత్రం చిరాకుగా ఉంటుంది. అంతెందుకు తక్కువ ప్రదేశంలోనే ఇంటిని చక్క పెట్టుకోవచ్చు. రూమ్ డోర్‌కు వెనుక భాగాన పెద్ద హ్యాంగర్‌ను బిగించండి. దానికి వేలాడదీయాల్సిన వస్తువులన్నింటినీ తగిలించండి. దానికి కింది భాగంలో బూట్లు, షూలు పెట్టుకోవచ్చు. వాటిని కాళ్లకు వేసుకునేందుకు దగ్గర్లో మడత కుర్చీ పెట్టుకోండి. ఇలా చిన్న ప్రదేశంలోనే ఎక్కువ వస్తువుల్ని సర్దేయొచ్చు.







## రెండు రకాలుగా వేసుకోవచ్చు



**ఆడవాళ్లకు** ఎన్ని నగలు ఉన్నా సరిపోవనిపిస్తుంది. ఒకసారి పెట్టినవి మళ్లీ పెట్టకుండా చూసుకోవాలనుకుంటారు. కానీ ఒకే నగ రెండు రకాలుగా ఉపయోగపడితే బాగుంటుందని ఎప్పుడైనా అనిపించిందా? అదెలా సాధ్యం అవుతుందని కూడా అనిపించొచ్చు. కానీ కొన్నిసార్లు అవసరాలు మనల్ని ఏమైనా చేసేలా చేస్తాయని ఊరికే అనలేదు. మెడలో నగలు దిగేసి నడుముకు ఏమీ పెట్టకుండా వదిలేస్తే బోసి పోయినట్టు ఉంటుంది కదా! అప్పుడే ఎవరో మెడలో ఉన్న ఒక నగని తీసి నడుముకి చుట్టేసినట్టున్నారు. దాన్నే ఇప్పుడు మనవాళ్లు ఫాలో అయిపోతున్నారు. నగ కేవలం మెడకే ఎందుకు పరిమితం చేయాలని దాన్ని రెండు రకాలుగా ఉపయోగించేలా డిజైన్ చేస్తున్నారు. అటు వడ్డాణంగా.. ఇటు మెడలో ఒదిగిపోయే నగలాగా తయారుచేస్తున్నారు. మువ్వల హారాలు, కాసుల పేర్లను మాత్రం ఎక్కువగా ఇలా రెండు రకాలుగా ఉపయోగించేందుకు మగువలు మక్కువ చూపిస్తున్నారట.

## ఉద్యోగుల చర్మసంరక్షణే ముఖ్యం



**ఉద్యోగధ్యాసలో పడి ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇటు అందంపై శ్రద్ధ తీసుకునేంత సమయమూ ఉండట్లేదు. దాంతో చర్మ సమస్యలు. అందుకే ఈమె ఉద్యోగం వదులుకొని ఇతర మహిళల కోసం సహజ ఉత్పత్తుల తయారీకి బాటలు వేస్తున్నది.**

ఈరోజుల్లో గొప్పగా బతకాలంటే అమ్మాయిలు, అబ్బాయిలు ఉద్యోగం చేయక తప్పదు. ఉద్యోగంలో అనుభవం పెరిగేకొద్దీ పని ఒత్తిడి కూడా పెరుగుతుంది. దాంతో శరీరంలో మార్పులు వస్తున్నాయి. అవి చర్మంపై దద్దుర్లు, మచ్చలకు దారి తీస్తున్నాయి. ఇలాంటి పరిస్థితే బెంగళూరుకు చెందిన నమ్రత అగర్వాల్‌కు ఎదురైంది. 28 ఏండ్ల నమ్రతా ఆడిటర్‌గా అధిక వేతనం ఇచ్చే ఉద్యోగాన్ని విడిచి చర్మ సంరక్షణ బ్రాండ్ 'విశిష్ట్'కు పూనుకున్నది. ఉద్యోగం సమయంలోనే చర్మసంరక్షణ ఉత్పత్తులను తయారుచేయడం మొదలుపెట్టింది. దీన్నే వృత్తిగా మార్చుకున్నది. ముఖానికి సంబంధించిన ప్రొడక్ట్స్ అన్నింటినీ తయారు చేస్తున్నది. ఇందులో ఆర్గాన్, కొబ్బరి, బాదం నూనె, హిమాలయన్ పింక్ ఉప్పు, కాఫీ, కోకో పౌడర్ వంటి సహజమైన వాటిని ఉపయోగిస్తున్నది. ఉత్పత్తులు వాడిన 3 నెలలకు ఫలితం కనబడుతున్నది. వీటికి ఉపయోగించే మెటీరియల్స్ అన్నీ ఎకోఫ్రెండ్లీనే. ఇవి హానికరమైన రసాయనాల నుంచి చర్మాన్ని కాపాడుతాయంటున్నది నమ్రత.

## టేబుల్‌తోనే అన్నీ..



భోజనం చేసేందుకు చిన్న గది ఉంటే బాగుంటుంది అనుకుంటారు. అవసరం లేదు. ఉన్న చోటునే అలా మార్చుకోవచ్చు. గదిలోని మూల ప్రాంతంలో గుండ్రని టేబుల్. దాని చుట్టూ కుర్చీలు. ఆ గోడకు నచ్చిన ఆర్ట్ ఉంటే ఆ రూమ్‌కు స్పెషల్ లుక్ చేకూరుతుంది. వాల్‌ఆర్ట్‌ను చూస్తే మనసు కూడా ప్రశాంతంగా ఉంటుంది. భోజనం తర్వాత ఆ టేబుల్‌పై న్యూస్‌పేపర్, ఫ్లవర్‌వాజ్, చదువుకోవాల్సిన పుస్తకాలు పెట్టుకోవచ్చు. అవసరాన్ని బట్టి ఆ టేబుల్‌ను వాడుకోవచ్చు.

## ఇడ్లీలు వేరుగా..



ఇడ్లీలు గుండ్రంగానే ఎందుకుండాలి? ఇలా ఎప్పుడైనా అనిపించిందా! ఇడ్లీలంటేనే బోరింగ్ అనుకునే కొందరు పిల్లలు, పెద్దలున్నారు. మరి వారికి ఒకేలాంటి ఇడ్లీలు పెడితే ఏం తింటారు చెప్పండి. పైగా కరోనా కారణంగా పెద్దలకు, పిల్లలకు హాలీడేస్ వచ్చేశాయి. వారికి సుతిమెత్తని ఇడ్లీలను సరికొత్తగా పెట్టాలని భావించే వారికే ఈ ఇడ్లీ ప్లేట్లు. ఒక్కో షేప్‌తో వచ్చిన ఇడ్లీ స్టాండ్లు ఇప్పుడు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. స్టెయిన్‌లెస్ స్టీల్‌తో ప్రముఖ కంపెనీలు వీటిని తయారుచేస్తున్నాయి. దీని ధర కూడా 545 రూపాయలు మాత్రమే. దీంతో.. ఈ స్టాండ్ ఆన్‌లైన్ మార్కెట్‌లో హాట్‌గా అమ్ముడుపోతున్నదట.

## శుభ్రతను పాటించండి!

**ప్రపంచ**వ్యాప్తంగా కరోనా కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో ప్రముఖ వ్యాఖ్యాత సుమ ప్రజలకు కొన్ని రక్షణ చర్యల్ని సూచించింది. ఈ సందర్భంగా ఆమె సోషల్‌మీడియాలో ఓ వీడియోను విడుదల చేసింది. 'కరోనా గురించి పెద్దగా భయపడాల్సిన అవసరం లేదు. జ్వరం, దగ్గు, తుమ్ములు, ఒళ్లు నొప్పులు రాగానే కరోనా అని కలవరం చెందాల్సిన పనిలేదు. వైద్యుల్ని సంప్రదించి వారి సూచనల్ని పాటిస్తే సరిపోతుంది. ముఖ్యంగా కరచాలనం మానుకొని మన భారతీయ సంస్కృతి ప్రకారం చేతులు జోడించి నమస్కరించడం ఉత్తమం. అలాగే మనం వంటల్లో పసుపు ఎక్కువగా వాడతాం. ఇంటికి రాగానే కాళ్లు, చేతులు, మొహం కడుక్కుంటాం. అన్నీ చక్కగా ఉడకబెట్టుకొని తింటాం. ఇవన్నీ ఫాలో అవుతాం కాబట్టి కరోనా విషయంలో అంతగా భయపడాల్సిన అవసరం లేదు. మన భారతీయ సంప్రదాయాల్ని పాటిస్తే వైరస్ దరిచేరదు. అన్నింటి కంటే ముఖ్యంగా శుభ్రతను పాటిస్తే దాదాపుగా వైరస్ వ్యాప్తిని నివారించవొచ్చు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి' అని సుమ కోరింది.


సుమ



కరోనా వ్యాప్తికి అడ్డుకట్ట వేసే దిశగా ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడానికి సినీతారలు ముందుకొస్తున్నారు. తమ వంతు సామాజిక బాధ్యతగా సోషల్‌మీడియా వేదికల ద్వారా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ప్రత్యేక వీడియోలను విడుదల చేస్తూ కరోనా పట్ల ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారు.

## 'అవతార్-2' చిత్రీకరణ వాయిదా



**కరోనా** మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా భయాందోళనలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. హాలీవుడ్ చిత్ర పరిశ్రమకు కూడా కరోనా సెగ తాకింది. అమెరికా, యూరప్‌తో పాటు వివిధ దేశాల్లో చిత్రీకరణ జరుపుకుంటున్న హాలీవుడ్ సినిమాలు షూటింగ్‌లకు విరామం ప్రకటిస్తున్నాయి. తాజాగా కరోనా ఎఫెక్ట్‌తో ప్రతిష్టాత్మక 'అవతార్-2' చిత్రీకరణను వాయిదా వేస్తున్నట్లు దర్శకుడు జేమ్స్ కామెరూన్ ప్రకటించారు. ప్రస్తుతం ఈ సినిమా న్యూజిలాండ్ వెల్లింగ్టన్‌లో చిత్రీకరణ జరుపుకుంటోంది. షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ మొదటివారం వరకు న్యూజిలాండ్‌లో షూటింగ్ జరగాల్సి ఉంది. అయితే కరోనా వ్యాప్తి కారణంగా షూటింగ్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు. 'ప్రస్తుతం కరోనా వల్ల ప్రపంచం మొత్తం ప్రమాదంలో ఉంది. అందుకే షూటింగ్‌ను వాయిదా వేశాం. అమెరికాలోని లాజ్‌ఏంజిల్స్‌లో సినిమాకు సంబంధించిన గ్రాఫిక్స్ పనులు యథావిధిగా జరుగుతాయి' అని చిత్ర నిర్మాత జాన్‌ప్లాండే తెలిపారు. దాదాపు 250 మిలియన భారీ వ్యయంతో సైన్స్‌ఫిక్షన్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది డిసెంబర్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## అన్‌ఫెయిర్ అండ్ లవ్లీ


ఇలియానా

పై శీర్షిక చూసి ఓ బ్యూటీ ప్రొడక్ట్ పేరుని తప్పుగా రాశారనుకునేరు!. అదొక రాబోవు సినిమా టైటిల్ పేరు. శరీరఛాయ ఆధారంగా కనబరిచే వివక్షను వినోదాత్మక కోణంలో చర్చిస్తూ ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారు. ఈ సినిమాలో రణదీప్‌హుడా, గోవా బ్యూటీ ఇలియానా జంటగా నటించబోతున్నారు. రచయిత బల్వీందర్‌సింగ్ దర్శకుడిగా పరిచయవుతున్నాడు. 'ముబారకన్' 'ఫిరంగి' 'సాండ్ కీ ఆంఖే' చిత్రాలకు ఆయన రచయితగా పనిచేశారు. 'అన్‌ఫెయిర్ అండ్ లవ్లీ' చిత్రంలో ఇలియానా బ్లాక్‌బ్యూటీ లవ్లీ అనే పాత్రలో కనిపించనుంది. అందాన్ని శరీర వర్ణం ఆధారంగా నిర్ణయించలేమని, ఆత్మసౌందర్యమే మిన్న అనే తాత్వికమైన దృక్పథాన్ని ఈ సినిమాలో ఆవిష్కరించబోతున్నట్లు దర్శకుడు తెలిపారు. వచ్చే నెలలో షూటింగ్‌కు వెళ్లనున్నట్లు సమాచారం.



**కరోనా** వైరస్ వ్యాప్తిని అరికట్టాలంటే సామాజిక దూరం పాటించాలని యువ కథానాయకుడు మహేష్‌బాబు అంటున్నారు. ఓ సందేశాన్ని వీడియో రూపంలో పోస్ట్ చేశారు. వరుసక్రమంలో వున్న అగ్గిపుల్లలు ఒకదాని తర్వాత మరొకటి కాలిపోతుండగా ఓ అగ్గిపుల్ల ఆ వరుసక్రమం నుండి తప్పుకుంటుంది. దీంతో మంటలు ఆగిపోయి మిగిలిన అగ్గిపుల్లలు సురక్షితంగా వుంటాయి.ఈ విషయాన్ని మనుషులకు అన్వయిస్తూ ఆయన సూచనలు చేశారు. 'ఇప్పుడు అందరూ సామాజిక దూరం పాటించాల్సిన అవసరం వచ్చింది. ఇది కష్టమైనా తప్పదు' అని మహేష్ పిలుపునిచ్చారు.

## ముందుజాగ్రత్తలు పాటించండి

**కరోనా** వైరస్ వ్యాప్తి దృష్ట్యా ప్రజలంతా ప్రభుత్వం సూచించిన ముందుజాగ్రత్త చర్యల్ని విధిగా పాటించాలని పూరి జగన్నాథ్ కోరారు. కరోనా ప్రభావం దృష్ట్యా హైదరాబాద్‌లోని తమ ఆఫీసుకు సెలవులు ప్రకటిస్తున్నామని, అన్ని రకాల ప్రొడక్షన్ వ్యవహారాలకు విరామమిస్తున్నామని పూరి జగన్నాథ్ ట్విట్టర్ ద్వారా తెలియజేశారు.





## సమిష్టిగా పోరు చేద్దాం

**కరోనా**ను అంతమొందించడానికి ప్రజలందరూ సమిష్టిగా పోరాటం చేయాలని సీనియర్ నటుడు మోహన్‌బాబు పిలుపునిచ్చారు. ఈ నెల 19న తిరుపతిలో శ్రీవిద్యానికేతన్ ప్రాంగణంలో జరగాల్సిన తన పుట్టినరోజు వేడుకల్ని కూడా వాయిదా వేస్తున్నట్లు మోహన్‌బాబు తెలిపారు. 'ఆరోగ్యమే మహాభాగ్యం. కరోనా వైరస్ ఈ భూభాగం నుంచి నిష్క్రమించే వరకు జాగ్రత్తలు తీసుకోండి' అని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

## 6 జాగ్రత్తలు పాటించండి

**అగ్రహీరోలు** ఎన్టీఆర్, రామ్‌చరణ్ కరోనా ప్రభావం నేపథ్యంలో ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని, వ్యాధి వ్యాప్తిని నివారించేందుకు కొన్ని సూచనలు పాటించాలని ఓ వీడియో ద్వారా విజ్ఞప్తి చేశారు. ప్రతి రోజూ ఏడెదిమిని సార్లు శుభ్రంగా సబ్బుతో చేతులు కడుక్కోండి. కరచాలనం, కళ్లు, నోరు, ముక్కును తుడుచుకోవడం వంటి పనుల్ని మానేయండి. జ్వరం, జలుబు ఉందనిపిస్తే తప్పకుండా మాస్క్ ధరించండి. తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు మోచేతిని అడ్డుపెట్టుకోండి. మంచినీళ్లు విరివిగా తాగండి. వేడినీళ్లు అయితే ఇంకా మంచిది. సోషల్‌మీడియాలో పుకార్లను నమ్మకుండా వాస్తవాల్ని తెలుకొని ప్రభుత్వం ఆజ్ఞల్ని పాటించండి అని పేర్కొన్నారు.



## నేను కోలుకున్నా: టామ్ హ్యాంక్స్

**ప్రముఖ** హాలీవుడ్ నటుడు టామ్ హ్యాంక్స్, అతని భార్య రీటా విల్సన్‌కు కరోనా బారిన పడిన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ హాస్పిటల్‌లో వారం పాటు ఐసోలేషన్‌లో చికిత్స తీసుకున్న ఈ జంటను మంగళవారం డిశ్చార్జ్ చేశారు. మరో వారం పాటు తామిద్దరం స్వీయ గృహనిర్బంధంలో ఉండబోతున్నామని వారు తెలిపారు.


రాజ్‌బాల, మానస

## 'చిత్రం ఎక్స్'

**రాజ్‌బాల**, మానస జంటగా రమేష్ విభూది దర్శకత్వంలో పోలం గోవిందయ్య నిర్మిస్తున్న చిత్రం 'చిత్రం ఎక్స్'. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ని నిర్మాత రాజ్‌కందుకూరి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'మంచి కంటెంట్‌తో, ప్లానింగ్‌ఓ సినిమా చేస్తే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు. ఈ చిత్రం కూడా ఆ కోవలోనే విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు. ఇప్పటి వరకు తెలుగుతెరపై వచ్చిన హారర్ సినిమాలకు భిన్నంగా తమ చిత్రం వుంటుందని, తప్పకుండా అందర్ని ఆశ్చర్యపరుస్తుందని దర్శకుడు తెలియజేశాడు. పలాస శ్రీను, బాచీ, సునీల్ రావినూతల నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శివ ప్రణయ్, సమర్పణ: బేబీ రాజశ్రీ.


కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్ హుస్సేన్. చిత్రంలో టీఆర్‌ఎస్ నాయకులు జాకుల్లా, బాసిత్ తదితరులు

## సీఎం కేసీఆర్‌ది చారిత్రక నిర్ణయం

- ఎన్పీఆర్, ఎన్నార్సీ, సీఏఏను వ్యతిరేకించిన లౌకికనేత
- మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్‌హుస్సేన్ ప్రశంస

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్పీఆర్, ఎన్నార్సీ, సీఏఏలకు వ్యతిరేకంగా సీఎం కేసీఆర్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్ హుస్సేన్ అన్నారు. హైదరాబాద్ మాసాబ్‌ట్యాంకులోని కార్యాలయంలో కేసీఆర్ చిత్రపటానికి ఆయన క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు జాకుల్లా, బాసిత్ తదితరులు పాల్గొన్నారు.

**సీఎం కేసీఆర్ దార్శనిక నేత: హోంమంత్రి మహమూద్‌అలీ**

ఎన్పీఆర్, ఎన్నార్సీ, సీఏఏలకు వ్యతిరేకంగా రాష్ట్ర ఉభయసభల్లో తీర్మానించడంపై హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ హర్షం ప్రకటించారు. ఎంతో దార్శనికత ఉన్న కేసీఆర్‌లాంటి నాయకుడు సీఎంగా ఉండటం రాష్ట్ర ప్రజల అదృష్టమని పేర్కొన్నారు.

**బహుజన టీచర్స్ అసోసియేషన్ హర్షం**

సీఏఏ, ఎన్పీఆర్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానించి సీఎం కేసీఆర్ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని బహుజన టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చైతన్య కల్వదర్శి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**కేసీఆర్ లౌకికతత్వానికి నిదర్శనం: టీఆర్‌ఎస్ ఆస్ట్రేలియాశాఖ**

సీఏఏను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టడంపై టీఆర్‌ఎస్ ఆస్ట్రేలియా శాఖ హర్షం వ్యక్తంచేసింది. మతవివక్షకు ఆస్కారం ఉండకూడదని సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించడం ఆయన లౌకికతత్వానికి నిదర్శనమని టీఆర్‌ఎస్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు కాసర్ల నాగేందర్‌రెడ్డి కొనియాడారు. సీఎం కేసీఆర్ నిర్ణయానికి మద్దతుగా, సీఏఏకి వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహిస్తామన్నారు.

## నీటిలెక్కల్లో కుదరని పొంతన

- 26న కృష్ణా బోర్డు ప్రత్యేక సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కృష్ణా బేసిన్‌లో నీటి వినియోగ లెక్కలపై సందిగ్ధం వీడటం లేదు. ప్రధాన ప్రాజెక్టుల నుంచి తెలుగు రాష్ట్రాలు వాడుకున్న నీటి లెక్కల్లో పొంతన కుదరడం లేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 26న కృష్ణా బోర్డు సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జలసౌధలో సమావేశాన్ని ఏర్పాటుచేయాలని బోర్డు తాజాగా నిర్ణయించింది.

## ఆర్థికసంఘం నిధులకు జాయింట్ చెక్‌పవర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్ర ఆర్థికసంఘం గ్రామాలకు కేటాయించే నిధుల విడుదల అధికారాలను సైతం సర్పంచ్, ఉప సర్పంచ్‌కు కల్పించారు. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం.. నిధుల విడుదలకు జాయింట్ చెక్‌పవర్ ఇచ్చారు.

# భారతీయ చిరుత జన్యుక్రమం గుర్తింపు

- అంతరించిపోయిన చిరుతల పునఃసృష్టి
- ల్యాకోన్స్‌తో కలిసి ప్రయత్నిస్తామన్న సీసీఎంబీ

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** భారతదేశంలో అంతరించిపోయిన 'చిరుత(చీతా)'ని మళ్లీ సృష్టించడానికి ప్రయత్నిస్తున్నామని హైదరాబాద్‌కు చెందిన సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ (సీసీఎంబీ)తెలిపింది. భారతదేశపు చీతా జన్యుక్రమాన్ని ఇటీవలనే గుర్తించామని పేర్కొంది. మన దేశంలో చిరుతపులులు(లెపర్డ్) విరివిగానే ఉన్నప్పటికీ చిరుతలు మాత్రం అంతరించిపోయాయి. ఆఫ్రికన్ దేశాలలో విస్తృతంగా కనిపించే చిరుతలు, ఆసియా ఖండంలో ఇరాన్‌లో మాత్రమే కొంత వరకు మిగిలి ఉన్నాయి. ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని చిరుతపులుల జన్యుక్రమాలు వేర్వేరని సీసీఎంబీ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఇరాన్‌లోని చీతాల కణాలతో భారత్‌లో వాటిని మళ్లీ సృష్టించడానికి ల్యాబరేటరీ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ ఎండేంజర్డ్ స్పీషీస్ (ల్యాకోన్స్)తో కలిసి కృషి చేస్తున్నామని చెప్పారు. అత్యంతవేగంగా పరుగెత్తే జంతువైన చిరుతలు స్వాతంత్ర్యానికి పూర్వం మనదేశంలో విరివిగా కనిపించేవి. కానీ అడవులతోపాటే అవి కూడా అంతరించిపోయాయి. చిత్తూరులో 1953 ప్రాంతంలో చివరిసారిగా చిరుత కనిపించినట్టు రికార్డులు తెలుపుతున్నాయి. ఆ తరువాత చిరుతను అంతరించిన జంతుజాతిగా పేర్కొంటున్నారు. ఆసియా చిరుతలు ప్రస్తుతం ఇరాన్‌లో 50 వరకూ ఉన్నాయి. మన దేశంలోని జూపార్క్‌లలో ఉన్నవి ఆఫ్రికన్ జాతి చిరుతలు. ఇరాన్‌లోని ఆసియా జాతి చిరుత కణాలతో భారత దేశపు చిరుతకు మళ్లీ ఊపిరిపోయాలని చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఆసియా, ఆఫ్రికన్ జాతుల చిరుతలలో జన్యుపరమైన భేదాలపై పరిశోధనలు సాగించారు. వాటి డీఎన్‌ఏలను విశ్లేషించారు. మనదేశంలో లభ్యమైన 19వ శతాబ్దం నాటి చిరుత చర్మం నుంచి కూడాడీఎన్‌ఏను సేకరించి విశ్లేషించామని సీసీఎంబీ శాస్త్రవేత్త తంగరాజ్ తెలిపారు. ఈ విస్తృతమైన విశ్లేషణల అనంతరం ఈశాన్య ఆఫ్రికా ప్రాంతాలలోని చీతాలు, ఆగ్నేయ ఆఫ్రికా చీతాలు దాదాపు రెండు లక్షల సంవత్సరాల క్రితమే వేరపడి ఉంటాయని నిర్ధారణకు వచ్చామని ప్రముఖ సైంటిస్ట్ డాక్టర్ నీరజ్ రాయ్ తెలిపారు. అలాగే ఆఫ్రికా, ఆసియా చీతాలు లక్ష సంవత్సరాల క్రితం వేరపడి ఉంటాయని భావిస్తున్నామన్నారు.



భారత్‌లో అంతరించిపోయిన చీతా.. మనదేశంలో విరివిగా కనిపించే చిరుతపులి (లెపర్డ్)

# యువకుడిపై లావణ్య త్రిపాఠి ఫిర్యాదు

- విచారణ చేపట్టిన సీసీఎస్ సైబర్‌క్రైం పోలీసులు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న యువకుడిపై తగిన చర్యలు తీసుకోవాలంటూ సినిమా హీరోయిన్ లావణ్య త్రిపాఠి హైదరాబాద్ నగర పోలీసులను ఆశ్రయించారు. తనను పెండ్లి చేసుకొన్నానని, తనతో తిరిగానంటూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడని సీసీఎస్ సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదుచేశారు. సీసీఎస్ సైబర్‌క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈసీఐఎల్ ప్రాంతానికి చెందిన యువకుడు కొన్ని సినిమాల్లో చిన్నచిన్న పాత్రల్లో నటించాడు. యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూలో లావణ్య త్రిపాఠిని పెండ్లి చేసుకొన్నానని చెప్పిన అంశం వైరల్ అయింది. దీనిని గుర్తించిన హీరోయిన్.. సదరు యువకుడిపై తన సహాయకుడి ద్వారా సీసీఎస్ సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసుకొన్న ఎస్సై మదన్ గౌడ్.. ఆయా చానళ్లకు నోటీసులు జారీచేసి వారినుంచి సమాచారం సేకరిస్తున్నారు. ఇంటర్వ్యూ చేసింది, వైరల్ చేసింది ఎవరనే విషయాన్ని గుర్తించే పనిలోపడ్డారు. మంగళవారం పలువురు సీసీఎస్ సైబర్‌క్రైం పోలీసుల ఎదుట హాజరై వివరణ ఇచ్చినట్టు తెలిసింది. లావణ్య త్రిపాఠిపై యువకుడు చేసిన అనుచిత వ్యాఖ్యలకు సంబంధించిన లింకులను తొలగించినట్టు సమాచారం.

## ఆమె వేధింపులకు అతడు విలవిల

- సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించిన యువకుడు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** సోషల్ మీడియాలో వివాహిత ఒకరు వేధిస్తున్నారంటూ ఏపీకి చెందిన యువకుడొకరు సీసీఎస్ సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించాడు. తన పేరిట ఫేస్‌బుక్ నకిలీ ఐడీలు సృష్టించి ఇతరులతో చాట్‌చేస్తూ అసభ్యకర మెసేజ్‌లు పంపుతున్న మహిళపై చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం ఫిర్యాదుచేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన యువకుడు ఎంబీఏ చదివి ఉద్యోగం నిమిత్తం హైదరాబాద్ వచ్చాడు. ఏడాదిక్రితం అమీర్‌పేట్‌లోని ఓ సంస్థలో హెచ్ఆర్ మేనేజర్‌గా చేరాడు. ఆ సమయంలో భర్తతో విడిపోయిన మహిళతో పరిచయం ఏర్పడింది. తర్వాత మనస్పర్ధలు రావడంతో దూరంగా ఉంటున్నారు. మాట్లాడటంలేదని కోపం పెంచుకొన్న సదరు మహిళ.. యువకుడిపై జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసి ఇబ్బందిపెట్టింది. అంతటితో ఆగక యువకుడి పేరుతో మూడు ఫేస్‌బుక్ ఖాతాలు తెరిచి అతని కుటుంబసభ్యుల ఫొటోలను అప్‌లోడ్ చేసింది. అసభ్యకర పోస్టింగ్‌లు పెట్టడం, అతడికి తెలిసినవారితో చాటింగ్ చేయడం ప్రారంభించింది. అతడి కుటుంబసభ్యుల ఫొటోలను వెబ్‌సైట్లలోనూ పోస్ట్ చేయడంతో తెలిసినవారు యువకుడిపై మెదక్ జిల్లాలో ఫిర్యాదుచేశారు. తనకు తెలియకుండా ఎవరో తన మొబైల్ నంబర్ ద్వారా వేధిస్తున్నారని అనుమానించి ఆరా తీయగా.. ఒకప్పుడు పరిచయమైన వివాహితగా తేలింది. ఇదేమిటని ప్రశ్నించగా.. తనతో కలిసి ఉంటేనే వేధింపులు ఆపుతానంటూ బ్లాక్‌మెయిల్‌కు దిగింది. దాంతో తనను మానసికంగా వేధిస్తున్న వివాహితపై తగిన చర్యలు తీసుకోవాలంటూ బాధిత యువకుడు సీసీఎస్ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌కు ఫిర్యాదుచేశాడు.

## ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా

- విచారణ ఖైదీగా జైల్లో ఉండటంతో రేవంత్ గైర్హాజరు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి ప్రధాన నిందితుడిగా ఉన్న ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా పడింది. 2015లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ నాయకుడు వేం నరేందర్‌రెడ్డిని గెలిపించేందుకు నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు లంచం ఇస్తూ రేవంత్ పట్టుబడ్డ విషయం తెలిసిందే. ఈ కేసు విచారణలో భాగంగా మంగళవారం రేవంత్‌రెడ్డి కోర్టుకు హాజరుకావాల్సి ఉన్నా రాలేదు. డ్రోన్ కెమెరా కేసులో విచారణఖైదీగా జైల్లో ఉండటంతో రాలేకపోయారని ఆయన తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఈ కేసులో సహ నిందితులు సెబాస్టియన్, ఉదయసింహ విచారణకు హాజరయ్యారు.ఏసీబీ కోర్టు.. విచారణను ఏప్రిల్ 20కి వాయిదా వేసింది.


బ్రాహ్మణుల సంక్షేమానికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషిచేస్తున్నదని దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ విద్వత్సభ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గాడిచెర్ల నాగేశ్వరరావు సిద్ధాంతి రచించిన నవతివర్ష శ్రీ శార్వరి పంచాంగాన్ని మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, టీఆర్‌ఎస్ నాయకుడు వేణుగోపాలాచారి, తెలంగాణ విద్వత్సభ అధ్యక్షుడు యాయవరం చంద్రశేఖరశర్మ పాల్గొన్నారు. -హైదరాబాద్, నమస్తే తెలంగాణ

## గర్భవిచ్ఛిత్తి చట్టంపై అవగాహన కల్పించాలి

- లోక్‌సభలో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గర్భవిచ్ఛిత్తి (మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ)కి అనుమతించేందుకు ప్రస్తుతం 20 వారాలుగా ఉన్న గరిష్ఠ పరిమితిని 24 వారాలకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణ బిల్లును లోక్‌సభ మంగళవారం ఆమోదించింది. ఈ సందర్భంగా జరిగిన చర్చలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళల జీవన స్థితిగతులు పరిగణనలోకి తీసుకొని చట్టాన్ని అమలుచేయాలన్నారు. చట్టంపై అవగాహన కల్పించి అబార్షన్లు న్యాయబద్ధంగా జరిగేలా చూడాలని అభిప్రాయపడ్డారు.

## చిన్న విమానాశ్రయాల నిర్మాణానికి చర్యలు

- కేంద్రాన్ని కోరిన ఎంపీ బీబీ పాటిల్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో చిన్న విమానాశ్రయాల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని మెదక్ ఎంపీ బీబీ పాటిల్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎయిర్‌క్రాఫ్ట్ చట్ట సవరణ బిల్లుపై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఐదు చిన్న విమానాశ్రయాల నిర్మాణానికి కేంద్రం గతంలోనే అనుమతిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రయాణికులతోపాటు దేశ భద్రతను దృష్టిలో ఉంచుకొని ఎయిర్‌క్రాఫ్ట్ చట్టాన్ని సవరించాల్సిన అవసరమున్నదని బీబీ పాటిల్ పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ
# యువ
[ కరీంనగర్ ]
బుధవారం 18 మార్చి 2020

## నిత్యానందను కలవాలట!

**మోడల్‌గా** కెరీర్ ప్రారంభించింది మీరామిథున్. అభినయంతో సినిమా అవకాశాల్ని చేజిక్కించుకుంది. పలుసినిమాల్లో నటించిన మీరా.. తమిళ బిగ్‌బాస్ 3లోనూ కొన్నాళ్లు కనిపించి ఎలిమినేట్ అయ్యింది. ప్రస్తుతం ఆమె 'స్వామి నిత్యానందను కలవాలనుకుంటుందట! ఈ విషయమే సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఆమధ్య 'చెన్నై పోలీసులు అక్రమార్కులు, లంచగొండులు' అంటూ వ్యాఖ్యానించింది మీరా మిథున్. ఇటీవల మరో వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేసి మరోసారి వార్తల్లోకెక్కింది. 'నిత్యానందను ఒక్కసారైనా కలిసి మాట్లాడాలి అన్నది నా కోరిక' అంటూ ఆమె చెబుతున్నది. నిత్యానంద రాసిన 'లివింగ్ ఎన్‌లైట్‌మెంట్' పుస్తకాన్ని పొగుడుతూ తీసిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



## మత్తెక్కిస్తున్న ప్రగ్యా

**ప్రగ్యా జైస్వాల్** కంచె చిత్రంలో చీరకట్టుతో తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. బాలీవుడ్ నటి అయినప్పటికీ టాలీవుడ్‌లో అభిమానుల్ని సంపాదించుకున్నది. ఈ మధ్య ఆమెకు సినిమా అవకాశాలు తగ్గినప్పటికీ బాలీవుడ్, టాలీవుడ్‌లో ఫ్యాన్ ఫాలోయింగ్ మాత్రం అలాగే మెయింటెయిన్ చేస్తున్నది. ఇటీవల ఆమె ఓ ఫొటో షూట్‌లో పాల్గొన్నది. ఆ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. కుర్రకారుకు మత్తెక్కించే ఆ ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.



### మంచిమాట



నీకోసం నువ్వు బతుకు. ఎవర్నీ నీకోసం బతుకమని అడక్కు.

- అయాన్‌ర్యాండ్
అమెరికన్ రచయిత్రి

### మెమె




### వాట్సప్ మెసేజ్

ఓటమి లేని వాడికి అనుభవం రాదు
అనుభవం లేనివాడికి జ్ఞానం రాదు
గెలిచినప్పుడు గెలుపును స్వీకరించు
ఓడినప్పుడు పాఠాన్ని నేర్చుకో
ఎలా నిలదొక్కుకున్నావు అన్నది ముఖ్యం
గెలుపు, ఓటమి కాదు!

### ఏం డైలాగ్ గురూ..



ఉపవాసం అంటే
ఆకలితో ఉండటం కాదు..
దేవుడికి దగ్గరగా ఉండటం.

సినిమా: గోపాల గోపాల

# భాషకు దక్కిన గౌరవం



భాషంటే..
మన ఉనికి.. మన జీవనం..
మన పరిసరాలు.. మన ఆస్తి.. మన జీవితం.
భాష ఉంటేనే మన అస్తిత్వం.
మరి మనం చదివే భాష.. రాసే భాష ఒక్కటేనా?
ఎందుకింత వ్యత్యాసం?
అదే ప్రశ్న ఏండ్లుగా వేధించిందా యువకుడిని.. ఆ ప్రశ్నే..
తెలంగాణ భాషలో పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథం రాసేలా చేసింది.
ఎన్నో అడ్డంకులు, ఆటుపోట్లను ఎదుర్కొని డాక్టరేట్ అందుకునేలా చేసింది.
అలా తెలంగాణ భాషలో థీసిస్ రాసిన పరిశోధక విద్యార్థిగా
గుర్తింపు పొందిన యువకుడిని 'యువ' పలుకరించింది.

**తెలంగాణ** రాకముందు.. సభలో మన భాష మాట్లాడితే వెక్కిరింపులు. సమావేశంలో తెలంగాణ భాష ఇనవడితె మందలింపులు. అధికారుల్ని కలిసినా.. నాయకులతో ములాఖత్ అయినా.. మన భాషంటే చిన్నచూపే. మన యాస మాట్లాడే మనుషులంటే ఏవగింపే. మన భాషయాసల గొంతు నులిమిన వారెందరో. అలాంటి పరిస్థితులెన్నో కళ్లారా చూసి.. అచ్చ తెలంగాణ భాషలో పరిశోధనతో సైద్ధాంతిక గ్రంథం రాయాలని నిర్ణయించుకున్నాడు ఖాజా పాషా. ఓయూలో ఎంఏ రంగస్థల శాస్త్రం పూర్తయ్యాక పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో రీసెర్చ్ స్కాలర్‌గా చేరాడు. 'తెలుగు నాటకాలు, నాటికలు.. సినిమాలుగా మారే పరిణామం' అంశంపై పరిశోధన చేశాడు. అందుకు అవసరమైన గ్రంథాన్ని తెలంగాణ భాషలో రాసి తన పేరుకు ముందు డాక్టర్ అనే గౌరవాన్ని చేర్చుకున్నాడు. మరి ఆగౌరవం ఊరికే వచ్చిందా?

**నిలిచి గెలిచి..**

'తెలంగాణ భాషలో థీసిస్ రాస్తావా? అదెలా సాధ్యం? నిబంధనలకు విరుద్ధం? ఎలా రాస్తావో చూస్తాం కదా?' అని నిరుత్సాహానికి గురి చేసిండ్రు. 'ఎందుకు రాయొద్దు సార్.. నేను బరాబర్ రాస్త. మన భాషల మనం రాయకపోతె మరెవరు రాస్తరు? ఇంకెన్నొద్దులు సార్.. మన భాషను మనం గౌరవించకపోతె ఇంకెవరు గౌరవిస్తరు? ఇలా ఎన్నో ప్రశ్నలకు సమాధానం చెప్పాడతను. మూడేండ్ల పరిశోధన అనంతరం 2014లో థీసిస్ రాయడం ప్రారంభించిండు. 2016లో తన పరిశోధనా పత్రాల రచన పూర్తి చేసిండు. తెలంగాణ భాషలో థీసిస్ రాయకూడదనే నెపంతో ఏడాది, నిబంధనల్లో లేదనే నెపంతో మరో ఏడాది... ఇట్లా 2019 దాకా ఆగవట్టిండ్రు. అన్నింటికీ సమాధానం చెబుతూ ఆధారాలతో సహా రుజువులు చూపిస్తూ ఖాజా పాషా ముందుకెళ్లాడు. చివరికి 2019లో అతడికి పొట్టి శ్రీరాములు యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది.

**చింతబరిగె స్కీం**

ఖాజా పాషాది ఉమ్మడి వరంగల్ జిల్లా గున్నేపల్లి. ఉస్మానియా యూనివర్శిటీలో రంగస్థల శాస్త్రంలో పీజీ చదివిండు. ఆ విభాగంలో గోల్డ్‌మెడల్ కూడా సాధించిండు. యండమూరి వీరేంద్రనాథ్ రాసిన 'పాపులర్ రచనలు చేయడమెలా?' పుస్తకం ఖాజా జీవితాన్ని మార్చింది. చిన్నప్పట్నుంచి వేటూరి పాటలు వింటూ పెరిగిన పాషా సృజనాత్మక రచనల్లో మునిగిపోయేవాడు. వందల్లో కవితలు రాసిండు. 70 పేజీలు రాసిండు. అతికొద్ది నాటికలు రాసి తొమ్మిది నంది అవార్డులు గెలుచుకున్నడు. అందులో గాయత్రి డాటర్ ఆఫ్ బషీర్ అహ్మద్. శాపగ్రస్తులు (థర్డ్ జెండర్ గురించి), చింతబరిగె స్కీం (భాష గురించి), క్రిష్ణసాగరి నాటికలు చాలా పాపులర్ అయినవి. చింతబరిగె స్కీం తెలంగాణ ఉద్యమంలో సంచలనం రేకెత్తించింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ సాక్షిగా ఈ నాటికను అడ్డుకోవాలని సమైక్యవాదులు రకరకాల ప్రయత్నాలు చేశారు. ఆఖరికి చింతబరిగె స్కీం బృందంపై భౌతికదాడికీ దిగారు.



**సిన్మాల్లోకి..**

సీన్మాల్లోకి పోవాలనే కల. తెలంగాణోళ్లు డైరెక్టర్లు కారనే అపోహ. 'ఎన్‌కౌంటర్' సిన్మా చూసినంక మనోళ్లూ డైరెక్టర్లు అయితరు అని గట్టిగ నమ్మిండు పాషా. కృష్ణానగర్ వీధుల్లో అందరిలాగే ఒక్క అవకాశం అంటూ తిరిగిండు. కానీ వెళ్లిన ప్రతిచోటా 'అనుభవముందా?, రాసిన కథలేవీ' ఇలాంటి వందల ప్రశ్నలు ఎదురయ్యాయి. పాషా ఓయూలో థియేటర్ ఆర్ట్స్ కోర్సు చదువుతున్న సమయంలోనే చిన్న చిన్న నాటికలు రాస్తూ, డైరెక్షన్ చేస్తూ తన కలకు నిజ రూపాన్నిచ్చుకున్నడు. 2013లో డాటర్ ఆఫ్ రామ్‌గోపాల్ వర్మ సినిమాకు దర్శకత్వం వహించిండు. కన్నడలో విడుదలైన 'రాజరథం' సినిమాకు డైలాగ్ రైటర్‌గా పనిచేసిండు. 2014లో తెలంగాణ భాషలో 'పూరిండియా' షార్ట్ ఫిలిం నిర్మించిండు. ప్రస్తుతం తెలంగాణ భాషను సినిమాల్లో, మరిన్ని సాధనాల్లో అమలు చేసే ఆలోచనలో ఉన్నడు.



### మన భాషల సదువుచెప్పాలె

స్కూళ్లల్ల తెలంగాణ భాషల చదువు చెప్పాలె. తెలంగాణ యాసల్నే పుస్తకాల్ని అచ్చు వేయించాలె. ఇతర దేశాల్లో ఉన్న మాదిరిగా మన యాసలో సినిమాలు నిర్మిస్తే అలాంటి సినిమాలకు సబ్సిడీ ఇవ్వాలె. ప్రత్యేకంగా తెలంగాణ భాష కోసం ఓ డిక్షనరీ తీసుకురావాలె. గతంతో పోలిస్తే తెలంగాణ వచ్చాక మన భాషకు మంచి విలువ దక్కింది. భవిష్యత్ తరాలకు మన భాషను అందించేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపట్టి జనభాషను అమలుపర్చాలె. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, డిజిటల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్ తెలంగాణ యాసలో గ్రంథ రచన చేసేందుకు ఎంతో ప్రోత్సాహాన్నందించారు.

- డాక్టర్ ఖాజా పాషా

... పడమటింటి రవికుమార్

# టెక్నాలెడ్జి

## 'కరోనా' పాట్లు.. సేఫ్టీకి సూట్లు



**కరోనా** వైరస్ గడగడలాడిస్తున్నది. దానిబారిన పడకుండా ప్రపంచం జాగ్రత్తలు తీసుకుంటున్నది. ఆయాదేశాల్లో జనాలు గుమిగూడటం, ఇతరులను తాకడం, బయటకు రావడం అసలే చేయట్లేదు. మాస్కులు, గ్లౌజులు ధరిస్తున్నారు. చైనాలో ఓ కంపెనీ మాత్రం మరింత అడ్వాన్స్‌డ్‌గా ఆలోచించింది. కరోనా సేఫ్టీ కోసం సూట్లను తయారు చేసింది. షీల్డ్ టైపులో సూట్లు తయారుచేస్తున్నది. వైరస్ నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఇవి ఉపయోగపడుతాయని అంటున్నది ఆ కంపెనీ బీజింగ్‌కు చెందిన ఫర్మ్ పెండా దీనిని డిజైన్ చేసింది. నిద్రపోతున్న గబ్బిలం ఆకారంలో సూట్ ఉంటుంది. అల్ట్రా వాయిలెట్ టెక్నాలజీ సాయంతో పని చేస్తుంది. హానికర వైరస్‌ల నుంచి, అపరిశుభ్ర పరిసరాల నుంచి శరీరాన్ని కాపాడుతుంది. ఈ షీల్డ్ పరిసరాల్లో ఉన్న అల్ట్రావాయిలెట్ రేడియేషన్‌కు హీట్ అవుతుంది. దీంతో దగ్గర్లో ఉన్న వైరస్ చనిపోతుంది. పైగా దీనిని మడిచి పెట్టుకోవచ్చు.

## వీయూ 4కే టీవీ



**ప్రముఖ** టెలివిజన్ సంస్థ వీయు(వు) మరో అడుగు ముందుకేసింది. టెలివిజన్ ఉత్పత్తి రంగంలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకుంది. తాజా సరికొత్త ఫీచర్లతో ప్రీమియం 4కే టీవీని ఆవిష్కరించింది. 4కే టీవీ శ్రేణిలో మూడు రకాల సైజులు లభ్యమవుతున్నాయి. 43 అంగుళాలు (109 సెంటీమీటర్లు), 50 అంగుళాలు (127 సెంటీమీటర్లు) తోపాటు 55 అంగుళాలు (140 సెంటీమీటర్ల) సైజుల్లో అందుబాటులో ఉన్నాయి. పదేండ్లుగా వినియోగదారుల అభిరుచికి తగిన విధంగా సేవలు అందిస్తున్నామని 'వు' సంస్థ పేర్కొన్నది. ఫ్లిప్‌కార్ట్‌లో ఈ టీవీ అందుబాటులో ఉంది. దీని ప్రారంభ ధర రూ. 24,999.

**ఫీచర్లు**

**ప్రాసెసర్ :** క్వాడ్ కోర్
**స్టోరేజీ :** 16జీబీ స్టోరేజీ
**మెమొరీ :** 2జీబీ ర్యామ్
**ఓఎస్ :** ఆండ్రాయిడ్ 9.0
**కనెక్టివిటీ :** గూగుల్ క్రోమ్ వైఫై, బ్లూటూత్ 5. వాయిస్ సెర్చ్, గూగుల్ అసిస్టెన్స్
**యాప్స్ :** ప్లేస్టోర్, నెట్‌ఫ్లిక్స్, ప్రైమ్, ఒటిటి సపోర్ట్. డాల్బీ విజన్, హెచ్‌ఆర్డీ 10 సపోర్ట్
**ఆడియో :** 30 వాట్ నాయిస్ క్యాన్సిలేషన్, డాల్బీ ఆడియో.

## వాట్సాప్.. కొత్త ఫీచర్



**వాట్సాప్‌లో** గత కొద్ది రోజులుగా ఓ ఫీచర్ వస్తున్నది అంటూ వినియోగదారులు వేచి చూశారు. ఇక వేచి చూడాల్సిన అవసరం లేదు. వాట్సాప్ అప్‌డేట్ చేస్తే ఆ ఫీచర్ యాడ్ అవుతుంది. ఆ ఫీచరే 'డార్క్ మోడ్'. రాత్రి వేళల్లో వాట్సాప్ వినియోగించే యూజర్ల కండ్లకు శ్రమ తగ్గించేందుకు ఈ ఫీచర్ తీసుకొచ్చినట్టు కంపెనీ వెల్లడించింది. ప్రస్తుత వాట్సాప్‌ను అప్‌డేట్ చేసి ఈ ఫీచర్‌ను వినియోగించుకోవచ్చు. ఆండ్రాయిడ్ 10, ఐఓఎస్ 13లో ఈ ఫీచర్ పనిచేస్తుంది. ప్రత్యేక డార్క్ గ్రే కలర్ బ్యాక్‌గ్రౌండ్‌తో ఈ యాప్ తక్కువ లైటింగ్‌ను వెదజల్లుతుంది.

డార్క్‌మోడ్ అంటే.. సాధారణంగా ఇంటర్నెట్ సమాచారమంతా తెలుపు బ్యాక్‌గౌండ్ నల్లని అక్షరాల్లో ఉంటుంది. దీనికి భిన్నంగా నలుపు బ్యాక్‌గౌండ్‌తో తెలుపు రంగులో అక్షరాలు కనిపిస్తాయి. దీనివల్ల కండ్లకు తక్కువ శ్రమ కలుగుతుంది. రాత్రి వేళల్లో సౌకర్యంగా ఉంటుంది. వాట్సాప్ యాప్‌లో సెట్టింగ్స్‌లోకి వెళ్లండి. అక్కడి నుంచి చాట్స్‌లోకి, థీమ్‌లోకి వెళ్లండి. డార్క్ మోడ్‌ను సెలక్ట్ చేసుకోండి.

## భారత్‌లోకి మోటో రేజర్

**కిందటి** ఏడాది ప్రపంచ వ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారిన మోటరోలా రేజర్ ఇప్పుడు భారత్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆన్‌లైన్ స్టోర్ ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులో ఉంది. మొబైల్ తయారీ సంస్థలు ప్రస్తుతం ఫోల్డబుల్ ఫోన్లపై దృష్టి సారిస్తున్న సందర్భంలో మోటరోలా తన బ్రాండ్‌ను 'మోటో రేజర్'తో ఏర్పరుచుకుంటున్నది.



**ఫీచర్లు**

**డిస్‌ప్లే :** 6.2 అంగుళాలు
**ప్రాసెసర్ :** ఎస్‌డిఎం 710
**మెమొరీ:** 6 జీబీ
**స్టోరేజీ :** 128 జీబీ
**రియర్ కెమెరా :** 16 ఎంపీ
**సెల్ఫీ కెమెరా :** 5 ఎంపీ
**బ్యాటరీ :** 2510
**కలర్ :** బ్లాక్

## వర్క్ ఫ్రమ్ హోమ్ సౌకర్యాలు



- వర్క్ ఫ్రమ్ హోమ్ కోసం జూమ్ యాప్‌ను మూడు లక్షల మందికిపైగా డౌన్‌లోడ్ చేసుకున్నారు. దీంతో సాఫ్ట్‌వేర్‌కు అంతరాయం కల్గకుండా ఉండి డేటా భద్రంగా ఉంటుంది.
- ట్రాక్‌ప్యాడ్ కంటే మౌస్ ఉపయోగించడం ఉత్తమమని నిపుణులు చెబుతున్నారు.
- ఆఫీసుకు వెళ్లి రావాలంటే చాలా సమయం పడుతుంది. ఇప్పుడు ఆ సమయమంతా ఇంట్లోనే ఉంటాం. దీంతో శరీరానికి పెద్దగా శ్రమ ఉండదు. ప్రణాళికాబద్ధంగా ఆయా కంపెనీలు అప్పగించిన విధులను పూర్తిచేయాలి.
- పరుపు మీద కూర్చొని ల్యాప్‌ట్యాప్‌ను ఉపయోగించడం చాలా కష్టం. ఆఫీసులో టేబుల్, కుర్చీ వంటివి ఉండడం వల్ల పని చేసుకోవడానికి చాలా సౌకర్యవంతంగా ఉంటుంది.
- సహోద్యోగుల సూచనలు పాటించాలి.
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాల్సి వస్తే నాణ్యమైన హెడ్‌ఫోన్స్ వినియోగించాలి.
- లేదంటే అవతలి వాళ్లు ఏం చెబుతున్నారో, మనం ఏం చెబుతున్నామో సరిగా అర్థం కావు. దీనివల్ల వారు అందించిన విలువైన సమాచారం మనం అందుకోలేకపోవచ్చు.
- పని విషయంలో పూర్తిగా వెనుకపడాల్సి వస్తుంది. కాబట్టి దీనిని దృష్టిలో ఉంచుకోవాలి.
- ఇంట్లోనే ఆఫీస్ వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోండి.

## మాజీ ప్రేమికుల రివేంజ్



'ఆస్ట్రేలియాలోని ఆర్‌ఎమ్‌టీ స్టడీ లీడ్' అనే సంస్థ ఇటీవల ఓ సర్వే నిర్వహించింది. ఇందులో చాలామంది యువతులు ఫొటోల ఆధారంగా లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్నారని, ఇలా వేధింపులు చేసేవారు మాజీ ప్రేమికులే అని తెలిపింది.

**గతంలో** ప్రేమికులు కలిసి ఉన్నప్పుడు దిగిన రహస్య ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయడం, వాటిని అడ్డు పెట్టుకొని బెదిరించడాన్ని 'పోర్న్ రివేంజ్'గా అభివర్ణిస్తున్నారు. ఆస్ట్రేలియాలో 2వేల మంది యువతులపై ఇటీవల ఓ సర్వే నిర్వహించారు. ఇందులో 20 ఏండ్ల నుంచి 29 ఏండ్ల మధ్య ఉన్న యువతుల అభిప్రాయాల్ని సేకరించారు. వీరిలో ప్రతి ముగ్గురిలో ఒకరు ఫొటో ఆధారిత వేధింపులు ఎదుర్కొన్నట్లు తేలింది. ఈ రివెంజ్ బారిన పడితే తమను తాము ఎలా కాపాడుకోవాలో యువతులకు చెప్పారు. సోషల్ మీడియాలో తమకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఎదురైనప్పుడు బయటకు తెలిస్తే పరువు పోతుందని భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. అయితే ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో ఒక రివేంజ్ పోర్న్ కేసు కూడా నమోదైంది. ఇది దేశంలో నమోదైన మొట్టమొదటి రివెంజ్ పోర్న్ కేసు. ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసి యువతిని వేధించిన మాజీ ప్రేమికుడికి కోర్టు ఐదేళ్ల జైలు, రూ. 9వేలు జరిమానా విధించింది.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## ఐఐఎంలో

కోజికోడ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో కింది కోర్సులో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.

- **కోర్సు:** మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ) ఇన్ లిబరల్ స్టడీస్ అండ్ మేనేజ్‌మెంట్.
- ఈ కోర్సు రెండేండ్ల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్.
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ/పీజీ ఉత్తీర్ణత. క్యాట్/జీఆర్ఈ లేదా జీమ్యాట్‌లో వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.
- **ఎంపిక:** మూడుదశల్లో ఉంటుంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 31
- **రాతపరీక్ష/ఇంటర్వ్యూ :** ఏప్రిల్/మే నెలల్లో
- **వెబ్‌సైట్:** www.iimk.ac.in

## డీఐఏటీలో పీజీ కోర్సులు

రక్షణశాఖ పరిధిలోని డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ (డీఐఏటీ)లో పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.



- **కోర్సులు:** ఎంటెక్, ఎమ్మెస్సీ (ఫుడ్ టెక్నాలజీ), ఎంఎస్ (రిసెర్చ్), డ్యూయల్ డిగ్రీ (డీఐఏటీ, యూకేలోని కార్న్‌ఫీల్డ్ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న కోర్సు).
- అర్హతలు, ఎంపిక, ఫీజు తదితర వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **వెబ్‌సైట్:** www.diat.ac.in

## ఎంబీఏ టూరిజం

భారత ప్రభుత్వ పరిధిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ (ఐఐటీటీఎం)లో కింది కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.



- **కోర్సు:** బీబీఏ (టూరిజం&ట్రావెల్)
- **అర్హతలు:** ఇంటర్‌లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఐజీఎన్‌టీయూ -ఐఐటీటీఎం నిర్వహించే ప్రవేశపరీక్ష స్కోర్ ద్వారా
- **కోర్సు:** ఎంబీఏ (టూరిజం& ట్రావెల్ మేనేజ్‌మెంట్)
- **అర్హతలు:** కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణత. క్యాట్/మ్యాట్ లేదా సీమ్యాట్/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ లేదా ఐజీఎన్‌టీయూ-ఐఐటీటీఎం ప్రవేశ పరీక్ష ద్వారా
- **కోర్సులను అందిస్తున్న సంస్థలు:** గ్వాలియర్, భువనేశ్వర్, నోయిడా, నెల్లూరు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మే 29
- **ప్రవేశపరీక్ష తేదీ:** జూన్ 7
- **వెబ్‌సైట్:** www.iittm.ac.in

## ఇంద్రప్రస్థ యూనివర్సిటీలో

న్యూఢిల్లీలోని గురు గోవింద్ సింగ్ ఇంద్రప్రస్థ యూనివర్సిటీలో 2020-21 విద్యా సంవత్సరానికిగాను పలు కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.

సెట్ ద్వారా ప్రవేశాలు కల్పించే ప్రోగ్రామ్‌లు:

- బీకాం (ఆనర్స్), బీఏ, ఎంబీఏ, బీబీఏ, ఎంఈడీ, బీఎస్సీ (నర్సింగ్)/యోగా , ఎమ్మెస్సీ, ఎంటెక్, బీఈడీ, తదితర కోర్సులు.
- **నాన్ సెట్ ద్వారా ప్రవేశాలు కల్పించే కోర్సులు:** ఎంబీఏ, ఎల్ఎల్ఎం, ఎంబీఏ, బీవొకేషనల్ తదితర కోర్సులు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో, **చివరితేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** www.ipu.ac.in

## పీజీ డిప్లొమాలు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్&పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్)లో పీజీడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.

- **కోర్సు:** పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్-రూరల్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం-ఆర్ఎం)- రెండేండ్ల కోర్సు.
- **అర్హతలు:** కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ, క్యాట్/మ్యాట్ లేదా జీమ్యాట్‌లలో వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.
- **కోర్సు:** పీజీడీ రూరల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ (పీజీడీఆర్‌డీఎం)-ఏడాది కోర్సు.
- **అర్హతలు:** కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ. క్యాట్/జీమ్యాట్‌లో వ్యాలిడ్ స్కోర్ లేదా ఎన్ఐఆర్‌డీపీఆర్ నిర్వహించే జాతీయపరీక్ష స్కోర్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 10
- **వెబ్‌సైట్:** www.nirdpr.org.in

# క్రీడా కుసుమాలు

**జాతీయస్థాయిలో రాణిస్తున్న ఖమ్మం క్రీడాకారులు**

**ఆర్చరీలో అదరగొడుతున్న ఔచిత్య, హర్షిత చౌదరి**

**వాలీబాల్‌లో అక్కాచెల్లెళ్ల జోరు**




**జాతీయ స్థాయిలో ఖమ్మం జిల్లా క్రీడాకారులు అదరగొడుతున్నారు. టోర్నీ ఏదైనా పతకాలే లక్ష్యంగా దూసుకెళుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతిభను చాటుకుంటున్నారు. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో వాలీబాల్, ఆర్చరీ విభాగాల్లో జిల్లాకు చెందిన కావ్య, రిషిత, ఔచిత్య, హర్షిత తమదైన రీతిలో దూసుకెళుతున్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ రాష్ట్ర ఖ్యాతిని దశదిశలా ఇనుమడింపజేస్తున్న వీరి పతక ప్రదర్శనపై ఓ కథనం..**




**మయూరి సెంటర్, ఖమ్మం:**

ఖమ్మం జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయి వాలీబాల్, ఆర్చరీలో మెరుగ్గా రాణిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాశాఖ ద్వారా జిల్లాకు రూ.12 కోట్లతో అత్యుత్తమ సదుపాయాలతో స్టేడియాలు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా పలువురు క్రీడాకారులు ఆయా విభాగాల్లో శిక్షణ పొందుతున్నారు. ముఖ్యంగా వాలీబాల్, ఆర్చరీ విభాగాల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మరింతగా రాటుదేలుతున్నారు. వాలీబాల్‌లో జిల్లాకు చెందిన కావ్య, రిషిత ఆకట్టుకుంటున్నారు. ఒకే కుటుంబానికి చెందిన వీరిద్దరు అండర్-14, 19 విభాగాల్లో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నారు. కావ్య ప్రస్తుతం పోలీస్ కానిస్టేబుల్ శిక్షణ తీసుకుంటున్నది. ఇక ఆర్చరీ విషయానికొస్తే...ఔచిత్య, హర్షిత తమదైన ప్రతిభతో ముందుకెళుతున్నారు.

గతేడాది ఆగస్టు 6వ తేదిన రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆర్చరీ ప్రాంగణాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ఆర్చరీలో తర్ఫీదు పొందుతున్నారు. జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చొరవతో క్రీడాభివృద్ధి మరింత వేగవంతమైంది.

**విలువిద్య సాధనకు శ్రమించేదాన్ని: హర్షిత**

స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన వివిధ రాష్ట్ర స్థాయి టోర్నీల్లో అనేక పతకాలు కొల్లగొట్టాను. రాష్ట్ర స్థాయి సీనియర్స్ విభాగంలో రజత పతకంతో ఆకట్టుకున్నాను. జార్ఖండ్‌లో జరిగిన జాతీయ స్థాయి ఆర్చరీ పాల్గొని సత్తాచాటాను. మా నాన్న అమరనేని గాంధీ ఇచ్చిన ప్రోత్సాహంతో ఇటు చదువుతో పాటు ఆర్చరీలోనూ రాణిస్తున్నాను.

**వాలీబాల్ అంటే ఎంతో ఇష్టం: మొక్క కావ్య**

హకీం పేట స్పోర్ట్స్ పాఠశాలలో 4వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివాను. అప్పటి నుంచి వాలీబాల్‌పై ఆసక్తి ఏర్పడింది. ఇప్పటివరకు 68 రాష్ట్ర మీట్‌లు ఆడా. భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ స్థాయి సీనియర్స్ పోటీల్లో పాల్గొన్నాను. ఖమ్మం జిల్లా కేంద్రం వాలీబాల్ ఆడేందుకు అనువైన ప్రాంతం కావడంతో పాటు కోచ్ అక్బర్ ఇచ్చిన శిక్షణతో జాతీయస్థాయి వరకు వెళ్లగలిగాను. ఎనిమిది రాష్ట్రాల్లో వివిధ టోర్నీలు ఆడి జాతీయస్థాయికి ఎదిగాను. ప్రస్తుతం హైదరాబాద్‌లో భాగ్యరెడ్డి వెంకటరామ రెడ్డి కాలేజీలో డిగ్రీ చదువుతున్నాను. ఇటీవలి పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో ఉద్యోగం సాధించి శిక్షణ తీసుకుంటున్నాను. మా నాన్న పోలీస్ శాఖలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఖమ్మంలోని గొల్లగూడెం రోడ్ మధురానగర్‌లో నివాసం ఉంటున్నాం. మేము నలుగురు అక్కాచెల్లెలం.

**అక్క నాకు స్ఫూర్తి: మొక్క రిషిత**

మా అక్క కావ్యను స్ఫూర్తిగా తీసుకుని వాలీబాల్ క్రీడను ఎంచుకున్నాను. అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీల్లో ఖమ్మం తరపున ప్రాతినిధ్యం వహించాను. ఇందులో భాగంగా కామారెడ్డి, మంచిర్యాల, మహబూబ్‌నగర్‌లో జరిగిన టోర్నీల్లో పాల్గొన్నాను. పాఠశాల స్థాయి పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించాను. మా నాన్న రాంబాబు.. చదువు, క్రీడల్లో నన్ను వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారు. మా పాఠశాల సహకారంతో జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తూ రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేయాలనుకుంటున్నాను.

**నాన్న ప్రోత్సాహంతో: ఔచిత్య**

నాన్న ఇచ్చిన ప్రోత్సాహంతో ఆర్చరీలోనేను అద్భుత ఫలితాలు సాధిస్తున్నాను. గతేడాది కాలంగా జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆర్చరీలో శిక్షణ తీసుకుంటున్నాను. భువనేశ్వర్‌లో జరిగిన జాతీయస్థాయి ఆర్చరీ టోర్నీలో స్వర్ణ పతకంతో ఉత్త మ క్రీడాకారిణిగా నిలిచాను. రాష్ట్రస్థాయి పోటీల్లో కేంద్రీయ విద్యాలయం తరపున బరిలోకి దిగి పసిడి పతకంతో మెరిశాను. దీంతో పాటు భువనేశ్వర్, వారణాసిలో జరిగిన వేర్వేరు టోర్నీలో మెరుగైన ప్రతిభ కనబరిచాను. బ్యాంక్ ఉద్యోగి అయిన మా నాన్న అందిస్తున్న మద్దతు మాటల్లో వర్ణించలేనిది.

## ఇందూరులో క్రికెట్ స్టేడియం



**ఇందూరు:** రాష్ట్ర రాజధాని అవతల క్రికెట్ అభివృద్ధికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) సిద్ధమైంది. నిజామాబాద్ నగర శివారులోని గూపన్‌పల్లిలో ఆరెకరాల స్థలంలో క్రికెట్ స్టేడియాన్ని నిర్మిస్తామని హెచ్‌సీఏ అధ్యక్షుడు మహ్మద్ అజారుద్దీన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో హెచ్‌సీఏకు నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మాత్రమే సొంత స్థలాలు ఉన్నాయి. ఇందులో భాగంగా మంగళవారం అజర్ నేతృత్వంలోని హెచ్‌సీఏ కమిటీ స్థలాన్ని పరిశీలించింది. స్టేడియం నిర్మాణానికి కావాల్సిన సదుపాయాలపై చర్చించింది. అనంతరం స్థానిక హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అజర్ మాట్లాడారు. 'గతంలో కమిటీ మూడు, నాలుగు సార్లు ఈ స్థలాన్ని పరిశీలించినా..ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ కొత్తగా ఏర్పడిన హెచ్‌సీఏ అపెక్స్ కమిటీ దీనికి త్వరితగతిన ఆమోద ముద్ర వేసింది. మరో రెండు నెలల్లో స్టేడియం నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. వాటికి కావాల్సిన అత్యవసరమైన డ్రెస్సింగ్‌రూమ్స్, టాయిలెట్లు, ఫెన్సింగ్ పూర్తి చేస్తాం. ఇక్కడి మట్టిని పరిశీలించి గ్రేజింగ్ చేసిన తర్వాత మైదానాన్ని తీర్చిదిద్దుతాం. స్టేడియం నిర్మాణానికి బీసీసీఐ పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నది. క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహమిస్తున్నది. దీంతో ఎంతో మంది క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారు' అని అజర్ అన్నాడు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏ కార్యదర్శి విజయానంద్, ఉపాధ్యక్షుడు జాన్ మనోజ్, కోశాధికారి సుభాష్ అగర్వాల్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు చంద్రసేనా రెడ్డి, సంపత్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జపాన్ ఒలింపిక్ అధికారికి కరోనా


తషిమా

**టోక్యో:** విశ్వక్రీడల నిర్వహణపై అనుమానాలు పెరుగుతున్న తరుణంలో.. ఏకంగా జపాన్ ఒలింపిక్ కమిటీ(జేవోసీ) డిప్యూటీ చీఫ్ కొజో తషిమాకు కరోనా వైరస్ సోకింది. ఈ విషయాన్ని ఓ ప్రకటన ద్వారా ఆయనే మంగళవారం వెల్లడించాడు. 'పరీక్షల్లో నాకు కరోనా వైరస్ పాజిటివ్ ఉన్నట్టు తేలింది. జ్వరంతో పాటు నిమోనియా లక్షణాలు కనిపిస్తున్నాయి. కానీ క్షేమంగానే ఉన్నా. వైద్యుల సూచనల మేరకు చికిత్స తీసుకోవడంపై ఏకాగ్రతతో ఉన్నా' అని తషిమా వెల్లడించాడు. ఫిబ్రవరి 28నుంచి ఐర్లాండ్, నెదర్లాండ్, అమెరికా దేశాల్లో పర్యటించి జపాన్‌కు వచ్చాక కూడా అనేక సమావేశాల్లో తషిమా పాల్గొన్నాడు. ఆదివారం నుంచి జ్వరంతో బాధపడుతున్న ఆయన పరీక్షలు చేయించుకోగా కరోనా పాజిటివ్‌గా మంగళవారం తేలింది. మరోవైపు ఇప్పటికే గ్రీస్‌లో వెలిగిన ఒలింపిక్ జ్యోతి శుక్రవారం నాటికి ఉత్తర జపాన్ ప్రాంతానికి చేరుకోనుంది.

## నీరజ్ ప్రాక్టీస్‌కు బ్రేక్



**న్యూఢిల్లీ:** భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. ప్రాక్టీస్‌కు ఫుల్‌స్టాప్ పెట్టాడు. ప్రతిష్ఠాత్మక టోక్యో ఒలింపిక్స్ (2020)లో పతకం సాధించడమే లక్ష్యంగా టర్కీలో సాధన చేస్తున్న నీరజ్.. కరోనా వైరస్ కారణంగా స్వదేశానికి తిరుగు పయనమయ్యాడు. మోచేతి గాయం నుంచి ఇటీవలే కోలుకున్న 22 ఏండ్ల నీరజ్.. గత నెల రోజులుగా టర్కీలో కఠోర శిక్షణ తీసుకుంటున్నాడు. దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన ఒలింపిక్స్ అర్హత టోర్నీలో జావెలిన్‌ను 87.86 మీటర్ల దూరం విసిరిన నీరజ్.. ఇప్పటికే ఒలింపిక్ బెర్త్ ఖరారు చేసుకున్న విషయం తెలిసిందే. 'మార్చి 18 నుంచి రాకపోకలను నిలిపివేయాలని టర్కీ నిర్ణయించింది. అందుకే నీరజ్ తిరిగి వస్తున్నాడు. ఏప్రిల్ 17 నుంచి జరుగనున్న దోహా టోర్నీలో అతడు పాల్గొనడం లేదు. నీరజ్ బుధవారం ఇంటికి చేరుకుంటాడు'అని భారత అథ్లెటిక్స్ సమాఖ్య మంగళవారం తెలిపింది. భారత్ నుంచి టోక్యో టికెట్ ఖరారు చేసుకున్న మరో జావెలిన్ త్రోయర్ శివపాల్ సింగ్ కూడా పోచెఫ్‌స్ట్రూమ్ నుంచి ఇంటిబాటపట్టాడు.

## షెడ్యూల్ ప్రకారమే ప్రపంచకప్- ఐసీసీ




**దుబాయ్:** కరోనా వైరస్(కొవిడ్-19) కారణంగా..అక్టోబర్‌లో ప్రారంభం కావాల్సిన పురుషుల టీ20 ప్రపంచకప్ పైనా అనుమానాలు తలెత్తడంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) స్పందించింది. ఆస్ట్రేలియాలో జరగాల్సిన విశ్వటోర్నీని షెడ్యూల్ ప్రకారమే నిర్వహిస్తామని మంగళవారం వెల్లడించింది. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు సైతం కొనసాగిస్తున్నామని ప్రకటించింది. ఈ ఏడాది అక్టోబర్ 18 నుంచి నవంబర్ 15 వరకు ఆస్ట్రేలియాలోని ఏడు మైదానాల్లో టీ20 ప్రపంచకప్ జరగాల్సి ఉంది. 'సంబంధిత శాఖలను టీ20 ప్రపంచకప్ నిర్వాహక కమిటీ నిత్యం సంప్రదిస్తున్నది. ప్రస్తుతం కరోనా వైరస్ పరిస్థితులపై సమీక్షిస్తున్నది. ఈ ప్రక్రియ కొనసాగుతుంది. టోర్నీ షెడ్యూల్ ప్రకారమే జరుగుతుంది. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు కొనసాగిస్తాం' అని ఐసీసీ వెల్లడించింది.

**సాధారణ పరిస్థితి నెలకొంటుంది..!**

ప్రపంచకప్ ప్రారంభం కావాల్సిన అక్టోబర్‌కు చాలా సమముందని, అప్పటిలోగా కరోనా ప్రభావం తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొంటాయని క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) చీఫ్ కెవిన్ రాబర్ట్ ఆశాభావం వ్యక్తం చేశాడు. 'ప్రస్తుత పరిస్థితిని గతంలో ఎవరూ ఊహించలేదు. అక్టోబర్-నవంబర్‌లో జరిగే టీ20 ప్రపంచకప్ సాధారణ పరిస్థితుల మధ్య జరుగుతుందని ఆశిస్తున్నాం' అని రాబర్ట్ అన్నాడు. కాగా కరోనా కారణంగా ప్రస్తుతం ఆస్ట్రేలియాలో అన్ని క్రికెట్ కార్యకలాపాలు రద్దయిన సంగతి తెలిసిందే.

## భారత్ X పాక్ లేకపోతే వృథానే..

**ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌పై వకార్**




**కరాచీ:** చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ మధ్య సిరీస్ లేకుండా.. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) నిర్వహించడం అర్థరహితమని పాక్ మాజీ పేసర్ వకార్ యూనిస్ పేర్కొన్నాడు. 'ఇరు దేశాల మధ్య పరిస్థితులు సంక్లిష్టంగా ఉన్న మాట వాస్తవమే.. కానీ ప్రపంచ చాంపియన్‌షిప్ విషయంలో ఐసీసీ మరింత చొరవ చూపాల్సింది. రెండు బోర్డులను టెస్టు మ్యాచ్‌ల కోసం ఒప్పించాల్సింది. ఎందుకంటే దాయాదుల పోరు లేని ప్రపంచ చాంపియన్‌షిప్‌కు అర్థమే లేదు'అని వకార్ అన్నాడు. టీమ్‌ఇండియా పేసర్లు చక్కటి ప్రదర్శన కనబరుస్తున్నారన్న అతడు.. దేశవాళీల్లో నిలకడ కనబరిచే వారికి మరిన్ని అవకాశాలిస్తే పాక్ కూడా బలంగా తయారవుతుందని పేర్కొన్నాడు. 'టెస్టుల్లో భారత్‌పై అరంగేట్రం చేయడాన్ని నేనెప్పటికీ మరువలేను. ప్రస్తుత భారత బౌలింగ్ దళం బాగుంది. వారు నిరంతరం శ్రమిస్తున్నారు. క్రమం తప్పకుండా 140 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు విసురుతున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. బుమ్రా, షమీ, ఇషాంత్ చక్కగా రాణిస్తున్నారు. అందుకే టీమ్‌ఇండియా టెస్టులతో పాటు అన్ని ఫార్మాట్లలో మెరుస్తున్నది. ఒకప్పటితో పోల్చుకుంటే ప్రపంచవ్యాప్తంగా పేసర్ల ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చింది'అని వకార్ యూనిస్ వివరించాడు.

## యూరో చాంపియన్‌షిప్ వాయిదా

**లుసానే:** ఐరోపా సమాఖ్య దేశాల మధ్య జరిగే ఫుట్‌బాల్ టోర్నీ యూరో 2020 చాంపియన్‌షిప్ వాయిదా పడింది. ఈ ఏడాది జూన్, జూలైలో జరగాల్సిన ఈ పోటీలు.. కరోనా వైరస్ సంక్షోభంతో వచ్చే ఏడాదికి వాయిదా వేస్తున్నట్టు యూఈఎఫ్‌ఏ మంగళవారం ప్రకటించింది. దీంతో యూరో చాంపియన్‌షిప్ తొలిసారిగా బేసి అంకె ఉన్న ఏడాది(2021)లో జరగనుంది. యూరోపియన్‌లోని ఇటలీ, స్పెయిన్ దేశాల్లో కరోనా వైరస్ తీవ్ర రూపం దాల్చింది. ఇటలీలో ఇప్పటికే మహమ్మారి కారణంగా 2,100 మందికి పైగా మృతి చెందారు. మరోవైపు కోపా అమెరికా ఫుట్‌బాల్ పోటీలు సైతం వచ్చే ఏడాదికి వాయిదా పడ్డాయి.



ఆస్ట్రేలియాలోని అత్యంత ఎత్తైన పర్వతం మౌంట్ కోషియాస్కోను అధిరోహించిన అంగోత్ తుకారాంను మంగళవారం అభినందిస్తున్న రాచకొండ సీపీ మహేశ్ భగవత్

## ఆలస్యంగా ఫ్రెంచ్ ఓపెన్

**పారిస్:** కరోనా వైరస్(కొవిడ్-19) వల్ల టెన్నిస్ మట్టికోర్టు పోరు ఫ్రెంచ్ ఓపెన్ నాలుగు నెలలు వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది మే 24 నుంచి జూన్ 7వ తేదీ వరకు జరగాల్సిన ఈ టోర్నీ.. సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 4వ తేదీ మధ్య జరుపనున్నట్టు నిర్వాహకులు మంగళవారం ప్రకటించారు. ప్రస్తుతం కరోనా తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఏర్పాట్లు చేయడం సాధ్యం కాదని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఒకవేళ యూఎస్ ఓపెన్ షెడ్యూల్ ప్రకారమే సాగితే.. ఆ టోర్నీ ముగిసే వారానికే ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభం కానుంది.



**కరోనా వైరస్ నేపథ్యంలో డబ్ల్యూహెచ్‌వో తీసుకొచ్చిన సేఫ్‌హ్యాండ్స్ చాలెంజ్‌ను స్వీకరించిన స్టార్ షట్లర్ పీవీ సింధు.. కేంద్రక్రీడా మంత్రి కిరణ్ రిజిజు, టీమ్ఇండియా కెప్టెన్ కోహ్లీ, టెన్నిస్ స్టార్ సానియాకు సవాల్ విసిరింది.**

## ఇంకా సమయం ఉంది

**కరోనా వల్ల ఆకస్మిక నిర్ణయాలు అవసరం లేదు: ఐఓసీ**


లుసానేలోని ఐవోసీ ప్రధాన కార్యాలయం

**లుసానే:** టోక్యో ఒలింపిక్స్ ప్రారంభమయ్యేందుకు ఇంకా 4నెలల సమయం ఉందని, అందుకే తక్షణమే ఎలాంటి ఆకస్మిక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం లేదని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐఓసీ) అభిప్రాయపడింది. అథ్లెట్లు సాధ్యమైనంతగా విశ్వక్రీడలకు సన్నద్ధతను కొనసాగించాలని సూచించింది. కరోనా వైరస్ వ్యాప్తి పెరుగుతుండటంతో ప్రస్తుత పరిస్థితుల గురించి చర్చించేందుకు ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశాన్ని మంగళవారం ఇక్కడ నిర్వహించింది. 'టోక్యో ఒలింపిక్స్‌ను షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు ఐఓసీ పూర్తి పట్టుదలతో ఉంది. క్రీడలు జరిగేందుకు ఇంకా నాలుగు నెలల సమయం ఉంది. ఈ తరుణంలో హఠాత్తుగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరమే లేదు. ప్రపంచం మొత్తం ఊహించని పరిణామాలను ఎదుర్కొంటున్నది. ఒలింపిక్స్ ఏర్పాట్లను సైతం కరోనా వైరస్ ప్రభావితం చేస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల వల్ల వైరస్ తగ్గు ముఖం పడుతుందని ఆశిస్తున్నాం' అని సమావేశం అనంతరం ఐఓసీ ప్రకటించింది.

**ప్రాక్టీస్ కొనసాగించండి**

ప్రపంచ వ్యాప్తంగా ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నీలు వాయిదా లేదా రద్దవుతుండడంపైనా ఐఓసీ స్పందించింది. ఇప్పటికే 57శాతం మంది అథ్లెట్లు విశ్వక్రీడలకు అర్హత సాధించారని, మిగిలిన వారిని ఎంపిక చేసేందుకు అవసరమైతే క్వాలిఫికేషన్ సిస్టంలో సర్దుబాట్లు చేయనున్నట్టు తెలిపింది. ఇందుకోసం అంతర్జాతీయ క్రీడా సమాఖ్యలను సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకోనున్నట్టు ఐఓసీ ప్రకటించింది.

## సాయ్ శిక్షణ శిబిరాలు బంద్

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ కారణంగా అన్ని జాతీయ శిక్షణ శిబిరాలను వాయిదా వేయాలని భారత క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్) మంగళవారం నిర్ణయించింది. అయితే టోక్యో ఒలింపిక్స్ కోసం సన్నద్ధమతువుతున్న అథ్లెట్లను మాత్రం మినహాయించి, శిక్షణ పొందుతున్న మిగిలిన వారిని ఇండ్లకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు నిలుపుదల కొనసాగుతుందని ప్రకటించింది. 'టోక్యో ఒలింపిక్స్‌కు సిద్ధమవుతున్న వారికి మినహా అన్ని జాతీయ క్యాంపులను కరోనా వ్యాప్తి కారణంగా నిలిపివేయాలని సాయ్ నిర్ణయించింది. అలాగే నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాల్లో శిక్షణ సైతం రద్దు చేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఇది కొనసాగుతుంది. ముందు జాగ్రత్త కోసం ఈ చర్యలు తీసుకున్నాం. పరిస్థితి సద్దుమణిగితే మళ్లీ అథ్లెట్లకు శిక్షణ కొనసాగుతుంది' అని కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. శిక్షణ ఆగడం వల్ల అథ్లెట్లెవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని సమీక్షించాక త్వరలోనే మళ్లీ శిబిరాలు ప్రారంభమవుతాయని సాయ్ వెల్లడించింది. కాగా, అథ్లెట్లకు వసతి సదుపాయాన్ని ఈ నెల 20 వరకు సాయ్ కొనసాగించనుంది.

## స్వీయ నిర్బంధంలో హేల్స్



**లండన్:** పాకిస్థాన్ క్రికెట్ లీగ్ (పీఎస్ఎల్) నుంచి వెనుదిరిగిన ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్ అలెక్స్ హేల్స్ ఆరోగ్యం కాస్త ఆందోళనకరంగా ఉండటంతో.. అతడు స్వీయ నిర్బంధంలోకి వెళ్లాడు. పీఎస్ఎల్ నాకౌట్‌కు ముందు పాక్ నుంచి తిరుగు పయనమయ్యాక.. రెండో రోజు అతడు అనారోగ్యానికి గురయ్యాడు. లీగ్‌లో పాల్గొంటున్న విదేశీ ప్లేయర్లలో కరోనా వైరస్ లక్షణాలు కనిపిస్తున్నాయని పాక్ మాజీ కెప్టెన్ రమీజ్ రాజా చేసిన వ్యాఖ్యలపై హేల్స్ స్పందించాడు. 'కొవిడ్-19 ప్రబలుతున్న నేపథ్యంలో ఇతర విదేశీ ఆటగాళ్లలాగే నేను కూడా పాక్ నుంచి ఇంటికి బయలుదేరా. శనివారం స్వదేశానికి చేరుకున్న సమయంలో ఆరోగ్యంగానే ఉన్నా.. ఆదివారం ఉదయం జ్వరం, దగ్గు మొదలవడంతో.. ప్రభుత్వ సూచనల మేరకు నిర్బంధం విధించుకున్నా. ఇప్పటి వరకైతే వైరస్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించలేదు. ప్రస్తుతం నా ఆరోగ్యం నిలకడగానే ఉంది' అని అతడు పేర్కొన్నాడు. విదేశీ ప్లేయర్లు పీఎస్ఎల్‌ను వీడటంతో పాటు.. వైరస్ ప్రభావం పెరుగుతుండటంతో నిర్వాహకులు లీగ్‌ను వాయిదా వేసిన విషయం తెలిసిందే.